తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

సోమవారం 21.04.2025 | సంపుటి : 11 సంచిక : 272 | పేజీలు : 12 వెల: రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



ప్రకటనల కోసం సంప్రదించండి 98483 28698







తర్వలో టీఎస్ఆర్టీసీలో

# కొలువుల జాతర

- 3,038 ఉద్యోగాలకు నోటిఫికేషన్
- పలు విభాగాల్లో భర్తీచేస్తాం
- మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటన

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ ఆర్టీసీలో ఖాళీలను భర్తీ చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. త్వరలోనే 3,038 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తామని చెప్పారు. వీటి లో 2 వేల డ్రైవర్ పోస్టులు, 743 శ్రామిక్ ఉద్యోగాలు, 84 డిప్యూటీ సూపరింటెండెంట్ (ట్రాఫిక్), 114 డిప్యూటీ సూపరింటెండెంట్ (మెకానికల్), 25 డిపో మేనేజర్/అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, 18 అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్ పోస్టులు, 23 అసిస్టెంట్ ఇంజినీర్ (సివిల్), 11 సెక్షన్ ఆఫీసర్ (సివిల్). 6 అకౌంట్ ఆఫీసర్స్, 7 మెడికల్ ఆఫీసర్స్ జనరల్, 7 మెడికల్ఆఫీసర్స్ స్పెషలిస్ట్ పోస్టులుంటాయన్నారు

వివరాలు లోపలి పేజీల్లో..



# ఇంద్రవెల్లి అమరులకు ఘననివాళి


వారందరూ జాతి ప్రయోజనాల కోసం తమ ప్రాణాలర్పించారు: మంత్రి సీతక్క


అమరవీరుల స్మృతి వనం ఏర్పాటు బాధ్యత మాదే..

వారి కుటుంబాలకు ఐసీడీఎస్, పంచాయతీరాజ్ శాఖల్లో ఉద్యోగాల కల్పనను పరిశీలిస్తున్నాం

ఇంద్రవెల్లి అమరవీరుల సంస్మరణ సభలో మంత్రి వెల్లడి

గిరిజనులను రెచ్చగొట్టే చర్యలు మానుకోవాలని అధికారులకు సూచనలు





ఇంద్రవెల్లి, ఏప్రిల్ 20 (జనంసాక్షి) : "కాకతీయులకు వ్యతిరేకంగా సమ్మక్క-సారలమ్మలు పోరాడారు. నిజాం హయాంలో కొమరం భీమ్, అలాగే ఇంద్రవెల్లి వీరులందరూ జాతి ప్రయోజనాల కోసం తమ ప్రాణాలు అర్పించారు" అని మంత్రి సీతక్క గుర్తు చేశారు. ఆనాటి ఘటన దురదృష్టకరమైనదని, అది ఎవరివైపు నుంచైనా తప్పుగా జరిగి ఉండొచ్చు కానీ బాధ్యతను మేమే తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు. ఇంద్రవెల్లి సంఘటన జ్ఞాపకార్థం నిర్వహించిన సభలో ఆదివాసుల హక్కుల కోసం మంత్రి సీతక్క కీలక వ్యాఖ్యలు చేశారు. ముందుగా అమరవీరుల స్థూపం వద్ద ఆమె నివాళులర్పించి అనంతరం మాట్లాడారు. అప్పట్లో రెవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఇంద్రవెల్లి అమరవీరుల జ్ఞాపకార్థం స్మృతివనం ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. "అప్పుడు నివాళులర్పించడానికి కూడా అనుమతి ఇవ్వలేదు. నిషేధాలు విధించబడ్డాయి. కానీ ఇప్పుడు అధికారంలోకి వచ్చిన

మిగతా 2లో..

# చివరి ఆయకట్టుకు సాగునీరందిస్తాం


ఈ దిశగా పకడ్బందీ చర్యలు చేపడుతున్నాం: డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

తక్కువ ఖర్చుతో అధిక ఆయకట్టు వచ్చే ప్రాజెక్టులకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నాం

మధిరలో పలు అభివృద్ధి పనులకు ఉపముఖ్యమంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

ఖమ్మం/మధిర(జనంసాక్షి):చిట్ట చివరి ఆయకట్టుకు సాగునీరందేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు.ఆదివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంచార్జ్ కలెక్టర్ డా. పి. శ్రీజ తో కలిసి మధిర మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసారు. ఈ సందర్భంగా సిరిపురం గ్రామ శివారులో ఉప ముఖ్యమంత్రిని మంగళహారతులతో ఘనంగా స్వాగతం పలికి దారి వెంట పూల వర్షం కురిపిస్తూ మహిళలు తమ అభిమానాన్ని చాటుకున్నారు.. సిరిపురం గ్రామంలో 1240 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో 6 కోట్ల 85 లక్షలతో చేపట్టిన చెక్ డ్యామ్ నిర్మాణ పనులకు, సిరిపురం గ్రామంలో ఐదు కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణానికి,

మిగతా 2లో..



త్వరలో పట్టాలపై పరుగులు పెట్టనున్న

# తొలి హైడ్రోజన్ రైలు

జులై నుంచి ప్రారంభం - హరియాణాలోని జీంద్ నుంచి సోనిపత్ మధ్య ప్రయాణం



హరియాణా(జనంసాక్షి):దేశంలోనే తొలి హైడ్రోజన్ రైలు జూలై నుంచి హరియాణాలోని జీంద్ జిల్లాలో పరుగులు తీయనుంది. జీంద్ నుంచి సోనిపత్ మధ్య నడవనుంది. అయితే హైడ్రోజన్ ప్లాంట్ నిర్మాణం

మిగతా 2లో..

# మళ్లీ అధికారంలోకొస్తాం

- ఉప ఎన్నికలు ఏడాదిలోనే.. అందరూ సిద్ధంగా ఉండాలి
- కేసీఆర్ మరోసారి సీఎం కావడం చారిత్రక అవసరం
- ఆరు గ్యారంటీల్లో కనీసం ఒక్కటి కూడా పూర్తిచేయలేదు
- ఎన్నికల్లో ఓటమి భారాస కంటే ప్రజలకే ఎక్కువ నష్టం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలన్నీ బోగస్.. :కేటీఆర్



హైదరాబాద్(జనంసాక్షి): ఉప ఎన్నికలు ఈ ఏడాదిలోనే వస్తాయని.. అందరూ సిద్ధంగా ఉండాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. అత్తాపూర్ డివిజన్ కాంగ్రెస్ నేత వనం శ్రీరామ్‌రెడ్డి ఆయన సమక్షంలో భారాసలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. "కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వడంతో తినే కంచంలో మన్ను పోసుకున్నట్లయింది. సీఎం రేవంత్‌రెడ్డి మాటలన్నీ బోగస్.. 6 గ్యారంటీల్లో ఒక్కటి కూడా పూర్తి చేయలేదు. బస్సుల్లో ఆడవాళ్లు కొట్టుకునే పరిస్థితి వచ్చింది. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ పూర్తిగా

మిగతా 2లో..

# ఆర్టీసీ బస్సు బోల్తా

బైక్‌ను తప్పించబోయి స్టీరింగ్‌రాడ్ విరగడంతో ప్రమాదం.. 20 మందికి గాయాలు

- సూర్యాపేట జిల్లా చింతలపాలెం వద్ద ఘటన

సూర్యాపేట(జనంసాక్షి): బైక్‌ను తప్పించే క్రమంలో స్టీరింగ్‌రాడ్ విరగడంతో ఆర్టీసీ బస్సు అదుపుతప్పి బస్సు బోల్తాపడింది. ఈ ఘటనలో 20 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. సూర్యాపేట జిల్లా చింతలపాలెం వద్ద ఈ ప్రమాదం జరిగింది. కోదాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కోదాడ నుంచి నక్కగూడెం వెళ్తుండగా చింతలపాలెం సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి బోల్తా పడింది.

మిగతా 2లో..




# మళ్లీ నిరసనల హోరు

- అమెరికాలో ట్రంప్ తీరుకు వ్యతిరేకంగా ఆందోళనలు
- 'వలసదారులకు స్వాగతం' అంటూ ప్లకార్డుల ప్రదర్శన




న్యూయార్క్(జనంసాక్షి):తమ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలపై అమెరికా ప్రజలు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ఆయన పాలనపై మండిపడ్డారు. దేశవ్యాప్తంగా నగర వీధుల్లోకి వచ్చి ప్లకార్డులతో ట్రంప్‌నకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. న్యూయార్క్‌లోని ప్రధాన గ్రంథాలయం వెలుపల జనం గుమిగూడి.. 'అమెరికాలో రాజులు ఎవరూ లేరు', 'ఈ దౌర్జన్యాన్ని ఎదిరించండి' అంటూ నినాదాలు చేశారు. తాత్కాలిక వలసదారులకున్న చట్టపరమైన నివాస హోదాను రద్దు చేయడం, వారిని బహిష్కరించడంపై ఆందోళనకారులు మండిపడ్డారు. "ఎలాంటి భయం లేదు.. వలసదారులకు స్వాగతం" అంటూ నినాదాలు చేశారు. రాజ్యాంగ నిబంధనలకు వ్యతిరేకంగా ట్రంప్ పాలన సాగుతోందన్నారు. ఆయన

మిగతా 2లో..



బైడెన్, అసమర్థ న్యాయమూర్తుల వల్ల

# దేశంలోకి అక్రమవలసలు

డొనాల్డ్ ట్రంప్ తీవ్రస్థాయిలో విమర్శలు

వాషింగ్టన్(జనంసాక్షి): అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ సహా పలువురిపై డొనాల్డ్ ట్రంప్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈస్టర్ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపిన ఆయన బైడెన్ సహా పలువురు న్యాయమూర్తులు,

మిగతా 9లో..

# హిందూ సమాజం కులవివక్ష వీడాలి

- ఒకే గుడి, ఒకే బడి, ఒకే శ్మశానవాటిక ఉపయోగించాలి
- ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్

న్యూఢిల్లీ(జనంసాక్షి):కుల భేదాలకు స్వస్తి పలకాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మో హన్ భగవత్ హిందూ కమ్యూనిటీ ప్రజలకు పిలుపునిచ్చారు. "ఒకే గుడి, ఒకే బావి, ఒకే శ్మశాన వాటిక" అనే సూత్రానికి మనమంతా కట్టుబడి ఉండాలని సూచించారు. దీన్ని పాటిస్తూ సామాజిక సామరస్యానికి కృషి చేయాలని కోరారు. అలీగఢ్‌లో ఐదు రోజుల పర్యటనలో ఉన్న మోహన్ భగవత్ అక్కడ జరిగిన ఓ కార్యక్రమంలో

మిగతా 2లో..



# గ్లోబల్ ఎకనామిక్ పవర్‌హౌస్‌గా భారత్

దేశ విదేశీ సంస్థలు దేశంలో పెట్టబడులకు ముందుకొస్తున్నాయి :కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి


హైదరాబాద్(జనంసాక్షి): కంపెనీల సెక్రటరీలు దేశ కార్పోరేట్ రంగానికి రూపు రేఖలు తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. దేశ విదేశీ పెట్టుబడిదారులు మనదేశంలో పెట్టబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారని, అందుకే మన దేశం గ్లోబల్ ఎకనామిక్ పవర్ హౌస్ గా వడివడిగా ముందుకు సాగుతోం దన్నారు. నగరంలో ఖైరతాబాద్ లోని ఆనంద్ నగర్ కాలనీలో

మిగతా 2లో..



# పేరుకే కాల్పుల విరమణ.. దాడులు యథాతథం

పుతిన్ చెప్పేదొకటి..చేసేదొకటి • మండిపడ్డ జెలెన్‌స్కీ



కీవ్(జనంసాక్షి):ఈస్టర్ సందర్భంగా తాత్కాలిక కాల్పుల విరమణ పాటిస్తామని ప్రకటించిన రష్యా ఆ మాటకు కట్టుబడి లేదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. ఈస్టర్ కాల్పుల విరమణను గౌరవిస్తున్నట్లు తప్పుడు వైఖరిని ఆ దేశం ప్రదర్శిస్తోందన్నారు. ఎప్పటిలాగే తమపై దాడులు కొనసాగించిందని.. పదుల కొద్ది డ్రోన్, బాంబు దాడుల ఘటనలు నమోదయ్యాయని తెలిపారు. మరోవైపు.. కీవ్ బలగాలూ దాడులు కొనసాగించాయని రష్యా ఆక్రమిత ఉక్రెయిన్‌లోని అధికారులు ఆరోపించారు."తాత్కాలిక కాల్పుల విరమణను గౌరవిస్తున్నట్లు రష్యా సైన్యం చెబుతోంది. కానీ, యుద్ధక్షేత్రంలో పైచేయి సాధించే, మా దేశానికి నష్టం కలిగించే ఏ అవకాశాన్నీ వదులుకోవడం లేదు. 50కిపైగా బాంబు దాడులు, పదుల కొద్ది డ్రోన్ దాడులకు పాల్పడింది. ఉదయం 10 గంటల నుంచి తీవ్రత మరింత పెరిగింది. అయితే, వైమానిక దాడులకు సంబంధించి సైరన్‌లు మోగకపోవడం కాస్త ఉపశమనం కలిగించే అంశం. క్షేత్రస్థాయి పరిస్థితులు పరిశీలిస్తుంటే.. పుతిన్‌కు తన సైన్యంపై పూర్తి నియంత్రణ లేదని.. లేదా, యుద్ధాన్ని ముగించే ఉద్దేశం ఆ దేశానికి లేదనేది స్పష్టమవుతోంది" అని జెలెన్‌స్కీ ట్వీట్లు చేశారు. కాల్పుల విరమణ షరతులకు పూర్తిగా కట్టుబడి ఉండాలని మాస్కోను డిమాండ్ చేశారు.

మిగతా 2లో..

# జమ్మూ కశ్మీర్‌లో భారీ వర్షాలు

విరిగిపడ్డ కొండచరియలు.. ఐదుగురు మృతి

శ్రీనగర్(జనంసాక్షి): జమ్మూకశ్మీర్‌లో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. రెండు రోజులుగా ఆగకుండా కురుస్తున్న కుండపోత వానల కారణంగా భారీగా కొండచరియలు విరిగిపడుతున్నాయి.రాంబన్ జిల్లాలో దాదాపు 40 ఇళ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. వరదలో చిక్కుకొని ముగ్గురు మరణించగా.. సుమారు 100మందిని సహాయక బృందాలు రక్షించినట్లు అధికారులు పేర్కొన్నారు.చాలా చోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని అధికారులు పేర్కొన్నారు. కొండ చరియలు విరిగి పడడంతో ప్రధాన మార్గాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. శిథిలాల కింద వాహనాలు చిక్కుకుపోయినట్లు చెబుతున్నారు. పశ్చిమాసియాలోని ప్రత్యేకమైన వాతవరణ పరిస్థితుల వల్లే

మిగతా 2లో..





# దద్దరిల్లిన యెమెన్

విరుచుకుపడ్డ అమెరికా యుద్ధవిమానాలు.. 50 లక్ష్యాలపై దాడులు

- సనా, హొదైద, అమ్రాన్ నగరాలపై ఏకధాటిగా బాంబుల వర్షం
- విమానాశ్రయం కూడా ధ్వంసం
- దాడుల్లో ముగ్గురు మృతి.. పలువురికి గాయాలు

సనా (జనంసాక్షి): అమెరికా యుద్ధ విమానాలు యెమెన్ రాజధాని సనా సహా పలు నగరాలపై బాంబుల వర్షం కురిపించాయి. దాదాపు 50 లక్ష్యాలను ధ్వంసం చేసినట్లు అల్-అరేబియా పత్రిక పేర్కొంది. సనా, హొదైద, అమ్రాన్ నగరాలపై బాంబులు జార విడిచినట్లు తెలుస్తోంది. శనివారం రాత్రి ఈ దాడులు చోటుచేసుకున్నాయి. తాజా దాడుల్లో హొదైదలోని పోర్టు, విమానాశ్రయం కూడా ధ్వంసమైనట్లు హూతీలు చెబుతున్నారు. ముగ్గురు వ్యక్తులు చనిపోయినట్లు కూడా పేర్కొన్నారు.తమ దాడులు ఏమాత్రం ఆగవని అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. కొన్ని రోజుల క్రితమే అమెరికా ఎర్ర సముద్రంలో నౌకాశ్రయంపై చేసిన దాడుల్లో 70 మంది చనిపోయారు. దాదాపు 171 మంది గాయపడ్డారు. ఇప్పటి వరకు జరిగిన దాడుల్లో ఇదే అత్యంత తీవ్రమైంది. ఈ దాడిపై ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ స్పందించారు. ఈ చర్యలు తీవ్ర ఆందోళనకరమన్నారు. దాడుల్లో సామాన్య ప్రజలు కూడా చనిపోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని నిలువరించాలన్నారు. హూతీ రెబల్స్ విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆదేశించడంతో ఈ దాడులు జరుగుతున్నాయి.

### త్వరలో పట్టాలపై పరుగులు పెట్టనున్న

# తొలి హైడ్రోజన్ రైలు

రెండు నెలల్లో పూర్తవుతుంది. ఉత్తర రైల్వే జనరల్ మేనేజర్ అశోక్ వర్మ ఆదివారం హైడ్రోజన్ ప్లాంట్‌ను పరిశీలించారు. హైడ్రోజన్‌తో నడిచే రైలు నిర్మాణ పనులు చెన్నైలో జరుగుతున్నాయని అశోక్ వర్మ తెలిపారు. ఆ పనులు చివరి దశలో ఉన్నాయని చెప్పారు. ఇక్కడ హైడ్రోజన్ ప్లాంట్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని, భద్రత కోసం పూర్తి ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు. చెన్నైలో తయారు చేస్తున్న రైలును జీంద్?కు తీసుకువచ్చాక ట్రయల్ రన్ జరుగుతుందని తెలిపారు. జీంద్, సోనిపత్ మధ్య సజావుగా ప్రయాణం ప్రారంభమవుతుందని అన్నారు.జనరల్ మేనేజర్ అశోక్ వర్మ తనిఖీ సమయంలో రైల్వే ఉద్యోగుల సమస్యలను విన్నారు. జీంద్‌లోని వాషింగ్ లైన్‌ను ప్రస్తుతం 17 కోచ్‌ల సామర్థ్యంతో ఉండగా, దాన్ని 23 కోచ్‌లకు విస్తరించాలని సూచించారు. దీనిపై ఆయన అధికారులతో చర్చిం చారు. ఆరు కోచ్‌ల విస్తరణకు పనులు ప్రారంభించాలని చెప్పారు. కొత్త రైల్వే జంక్షన్ పునరుద్ధరణ పనులు ఆగస్టు-సెప్టెంబర్ నాటికి పూర్తవుతాయని పేర్కొన్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.యూనియన్ల నాయకులు తమ డిమాండ్లతో కూడిన మెమోరాండాన్ని జనరల్ మేనేజర్‌కు సమర్పించారు. జీంద్‌లోని రైల్వే ప్యానెల్‌లో ఆస్పత్రి లేకపోవడం అనే అంశాన్ని నాయకులు లేవనెత్తారు. జీంద్‌లో దాదాపు నాలుగు వేల మంది రైల్వే ఉద్యోగులు, వెయ్యి మంది మాజీ ఉద్యోగులు ఉన్నారని వారు విన్నవించారు. అయితే రైల్వే ప్యానెల్‌లో ఆస్పత్రి లేదు. గతంలో రెండు ఉండగా, ఇప్పుడు ఒక్క ఆస్పత్రి కూడా లేదు. అయితే జీంద్‌లోని రెండు ఆస్పత్రులను ప్యానెల్‌లో చేర్చే ఫైల్ ప్రక్రియలో ఉందని రైల్వే ఉద్యోగులు తెలిపారు. త్వరలోనే దానిని ఆమోదించమని జనరల్ మేనేజర్‌ను కోరారు. అయితే జనరల్ మేనేజర్ ఆస్పత్రిలో విషయంలో వ్యక్తిగత ఆసక్తి చూపుతానని వెల్లడించారు. రైల్వే ఉద్యోగులు ఎటువంటి సమస్యలు ఎదుర్కోకుండా ఆ పనిని త్వరగా పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు.

## ఆర్టీసీ బస్సు బోల్తా

ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో సుమారు 50 మంది ప్రయాణికులు ఉన్నారు. వీరిలో గాయపడ్డ 20 మందిని మేళ్లచెరువు, హుజూర్?నగర్? ఏరియా ఆసుపత్రికి తరలించారు.మరో ఘటనలో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెరికిట్ శివారులో లారీ, బైక్‌ఢీకొని ఇద్దరు పిల్లలు మృతి చెందారు. తండ్రికి తీవ్రగాయాలు అయ్యాయి. పెరికిట్?లో ఓ వివాహ కార్యక్రమానికి ఇద్దరు చిన్నారులతో కలిసి తండ్రి విశ్వనాథ్? బైకుపై వెళ్తుండగా లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఓ కుమారుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు ఆసుపత్రిలో సీపీఆర్ చేస్తుండగా ప్రాణాలు విడిచారు. తండ్రి విశ్వనాథ్‌కు తీవ్రగాయాలు కావడంతో అత్యవసర చికిత్స అందిస్తున్నారు. ఇద్దరు కుమారుల మృతితో తల్లి కన్నీరు మున్నీరుగా విలపించడం అక్కడి వారిని కంటతడి పెట్టించింది. మరో ఘటనలో హమాలీ కూలీలపై ట్రాక్టర్ దూసుకెళ్లి ఒకరు మృతి చెందిన ఘటన నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం కొండాపూర్ గ్రామంలో జరిగింది. ఈ ఘటనలో మరో ఇద్దరికీ తీవ్ర గాయాలు అయ్యాయి. వారిని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తూంపల్లి సొసైటీ పరిధిలోని కొండాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రంలో హమాలీ పని చేయడానికి వచ్చిన బిహార్ కూలీలు మధ్యాహ్నం సమయంలో గ్రామ శివారులో చెట్టు కింద సేద తీరుతున్న సమయంలో ఒక్కసారిగా ట్రాక్టర్ కూలీలపై నుంచి దూసుకెళ్లడంతో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ట్రాక్టర్ డ్రైవర్ మద్యం సేవించి నడపడం వల్ల ఈ ఘటన జరిగిందని సిరికొండ పోలీసులు వెల్లడించారు. కేసు నమోదు చేసుకొని ట్రాక్టర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై రామ్ తెలిపారు.

## గ్లోబల్ ఎకనామిక్ పవర్ హౌస్‌గా భారత్

ఐసీఎస్ఐ(ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా)హైదరాబాద్ చాప్టర్ నూతన భవానికి భూమి పూజ చేసిన కిషన్‌రెడ్డి అనంతరం మాట్లాడారు. హైదరాబాద్ చాప్టర్ నూతన భవనానికి శంకుస్థాపన కార్యక్రమానికి హాజరు కావడం చాలా సంతోషంగా ఉంది. కంపెనీ సెక్రటరీలు దేశ కార్పొరేట్ రంగానికి రూపురేఖలు తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు. దేశ విదేశీ పెట్టుబడిదారులు మనదేశంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారు. అందుకే మన దేశం గ్లోబల్ ఎకనామిక్ పవర్ హౌస్ గా వడివడిగా ముందుకు సాగుతోంది. సత్యం వద(సత్యం పలుకు), ధర్మం చర(ధర్మం ఆచరించు) సూత్రం ఆధారంగా %×జూ×% పనిచేస్తోంది.ప్రతి కంపెనీ సెక్రటరీ ప్రతిరోజు ఈ సూత్రాన్ని ఆధారంగా పని చేస్తే దేశ వ్యాపార రంగం నిజాయితీ పారదర్శకతతో ముందుకు సాగుతుంది.ఇప్పటికే భారతదేశం ప్రపంచంలోనే 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. మరో రెండేళ్లలోనే 5 బిలియన్ మార్క్ దాటనుంది.ఈ విజయం మీలాంటి ప్రొఫెషనల్స్ హార్డ్ వర్క్, అంకితభావం, విలువలతో కూడిన వ్యాపారం వల్లే సాధ్యమైంది. ఇప్పటికే జర్మనీ, జపాన్ లాంటి దేశాలు మన టాలెంట్ ని గుర్తించి, కంపెనీ సెక్రటరీలు, లాయర్లు, అకౌంటెంట్లను వారి దేశాల్లో పనిచేసేందుకు నియమించుకుంటున్నాయి. ఇంటెలెక్చువల్స్ కోసం ప్రపంచం భారత్ వైపు చూస్తోంది.ఇంటలెక్చువల్, ప్రొఫెషనల్ స్కిల్స్ పెంచుకోవడం అంటే కేవలం వ్యక్తిగత అభివృద్ధి మాత్రమే కాదు. సమాజంతోపాటు ప్రపంచ అభివృద్ధికి దోహదపడుతుందని విషయం గుర్తుంచుకోవాలి

# ఇంద్రవెల్లి అమరవీరులకు ఘన నివాళి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా ఇంద్రవెల్లి సంఘ టనను 'సంస్మరణ దినం'గా నిర్వహిస్తోంది" అని తెలిపారు. అమరవీరుల కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించేందుకు విద్యార్హతల ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు. ట్రైబల్ వేల్‌ఫేర్ డిపార్ట్మెంట్ ద్వారా ట్రాక్టర్లు, ఇతర వాహనాలను పంపిణీ చేశామని చెప్పారు. సంఘటనలో మరణించిన వారి పూర్తి వివరాలను సేకరించేందుకు ప్రత్యేక కమిటీ వేయనున్నట్లు ప్రకటించారు. ఇంద్ర వెల్లి అమరవీర్లకు అంకితంగా నిర్మిస్తున్న స్మృతివ నాన్ని ఆగస్ట్ 9న ప్రారంభిస్తామన్నారు. ఇందులో ఎవరి ఫోటోలు పెట్టాలన్న దానిపై ఒక నిర్ణయం తీసుకుంటామని సీతక్క వివరించారు. ఫారెస్ట్ అధికా రులు సంయమనం పాటించాలని, గిరిజనులను రెచ్చగొట్టొద్దని సూచించారు. రైతులు ఉన్న భూమిని సద్వినియోగం చేసుకుంటూ బోర్లు వేసుకుని రెండు పంటలు దిగాలన్నదే మా ఉద్దేశమన్నారు. గత ప్రభుత్వం ఐటిడిఎలను నిర్వీర్యం చేసింది. మేము తిరిగి వాటికి ప్రాణం పోస్తున్నాం. త్వరలో ఐటిడిఎల మీటింగ్ నిర్వహిస్తాం. జీవో నెంబర్ 3పై మేధావులతో చర్చిస్తామని తెలిపారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల ద్వారా ఆర్థికసాయం చేస్తున్నామని, పీఎం మోడీ కూడా "ఇప్ప పువ్వు లడ్డు"పై ప్రశంసలు తెలిపారన్నారు. సాగుచేసు కుంటున్న భూములకు హక్కుల పత్రాలు ఇవ్వడం ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. సర్వే పూర్తైన భూములకు హక్కులు కల్పిస్తామని, కానీ కొత్తగా అడవిని నరికేలా చేయరని చెప్పారు. ఐటిడిఎలు, పోడు భూముల చట్టం..పీసా.. ఉపాధి హామీ చట్టం అమరవీరుల త్యాగాల వల్లనే వచ్చాయన్నారు.





## యువత లక్ష్యంవైపు సాగాలి : సీతక్క

ఉట్నూర్ మండల కేంద్రంలోని కేబీ కాంప్లెక్స్ లో వైటీసీ లో గిరిజన నిరుద్యోగులకు ఐటీడీఏ ఆధ్వర్యంలో టీజీ ఆర్టీసీ అదిలాబాద్ రీజియన్ సహకారంలో హెవీ వెహికిల్ మోటార్ ట్రైనింగ్ ప్రోగ్రాంను ఆదివారం ఎమ్మెల్యే బొజ్జు పటేల్, ఎంపీ నగేశ్, ఎమ్మెల్సీ విఠల్, ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా,ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ లతో కలసి మంత్రి సీతక్క జెండా ఊపి ప్రారంభించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు 59వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు పేర్కొన్నారు. ఆయా శాఖల్లో ఖాళీపై వివరాలు సేకరించడం జరుగుతుందని, త్వరలో 14వేల అంగన్వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగు తున్నాయన్నారు. ఈ నోటిఫికేషన్ తో ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలో 4వేల పోస్టులు భర్తీ చేస్తామ న్నారు. అనంతరం ఉట్నూర్ మండలంలోని దేవుగూడలో గిరిజన ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం హెచ్ డీఎఫ్ సీ పారివర్ధన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బెంచిల అందజేత కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు.

## జమ్మూ కశ్మీర్‌లో భారీ వర్షాలు

జమ్మూలో భారీ వర్షాలు, తుఫాను సంభవించిందని వాతావరణ శాఖ తెలిపింది. ఐదేళ్లలో ఇంత భారీ స్థాయిలో వర్షాలు, బలమైన గాలులు వీయడం ఇదే మొదటిసారని పేర్కొంది.ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా వరదలు చీనాబ్ వంతెన సమీపంలోని ధరంకుండ్ గ్రామాన్ని ముంచెత్తాయని అధికారులు పేర్కొన్నారు. దీంతో ఇళ్లు వాహనాలు కొట్టుకుపోయాయని.. ఇళ్లలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి సహాయ బృందాలు శ్రమిస్తున్నాయని తెలిపారు. దీనిపై కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ స్పందిస్తూ.. డిప్యూటీ కమిషనర్ బషీర్-ఉల్-హక్ చౌదరితో తాను నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నానని చెప్పారు. ఆర్థిక, ఇతర సహాయాన్ని అందిస్తున్నామని అన్నారు.ఘటనపై జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా స్పందిస్తూ..ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లొద్దని సూచించారు. రాంబన్‌లో కొండ చరియలు విరిగిపడడం వల్ల తీవ్ర ఆస్తి నష్టం సంభవించిందన్నారు. విపత్తు ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అన్నారు.ఆకస్మిక వరదల కారణంగా దోడా జిల్లాలోని ధరమ్ కుండ్ గ్రామంలో 40 ఇళ్లు ధ్వంసమయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని, శిథిలాల కింద చిక్కుకున్న 100 మందిని కాపాడారు. మరోవైపు పెద్ద ఎత్తున రాళ్లు పడటం సహా ఓ చోట స్వల్పంగా ధ్వంసం కావడం వల్ల జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిని అధికారులు మూసి వేశారు. ముఘల్, సింథాన్ రోడ్లపై రాకపోకలు నిలిచిపోయాయి. వాతావరణం మెరుగుపడే వరకు ప్రయాణికులెవరూ ఈ మార్గాలను వినియోగించవద్దని జమ్మూకశ్మీర్ ట్రాఫిక్ పోలీసులు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కొండచరియల కారణంగా రోడ్లపై వాహనాలు చిక్కుకున్న దృశ్యాలు అందులో ఉన్నాయి. రాంబన్‌లో కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదలు సంభవించడం బాధించిందని సీఎం ఒమర్ అబ్దుల్లా అన్నారు. ప్రజలంతా చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లొద్దని సూచించారు. వరదల వల్ల భారీగా ఆస్తి నష్టం వాటిల్లిందని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. తక్షణ సహాయ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

# మళ్లీ అధికారంలోకొస్తాం

క్షీణించింది. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలున్న కాంగ్రెస్ నేతలను హైడ్రా ముట్టుకోదు. గత ఎన్నికల్లో ఓటమి భారాస కంటే ప్రజలకే ఎక్కువ నష్టం. కేసీఆర్ మరోసారి సీఎం కావడం చారిత్రక అవసరం. రెండు జాతీయ పార్టీలు తెలంగాణకు శత్రువులే" అని కేటీఆర్ అన్నారు. రాబోయే ఎన్నికల్లో మనం గెలవడం మన కోసం కాదు.. తెలంగాణ సమాజానికి మళ్లీ తిరిగి కేసీఆర్‌ను సీఎం చేసుకోవడం చారిత్రక అవసరం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని పూడ్చుకోవాల్సిన బాధ్యత తెలంగాణ సమాజంపై ఉంది. కచ్చితంగా ఏప్రిల్ 27వ తేదీ నాడు.. వరంగల్‌కు తరలిరావాలి అని కేటీఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో రాజేంద్ర నగర్ ఇంచార్జ్ పటోళ్ల కార్తీక్ రెడ్డి అధ్యక్షతన బీఆర్ఎస్ పార్టీలో అత్తాపూర్ డివిజన్ నుండి శ్రీరామ్ రెడ్డి, పలు పార్టీల నేతలు చేరారు. వారందరికి కేటీఆర్ గులాబీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.పదేండ్ల పాటు సంక్షేమాన్ని, అభివృద్ధిని జోడెద్దుల్లాగా కేసీఆర్ పరుగులు పెట్టించారు. మొన్నటి ఎన్నికల్లో మనం ఓడిపోవడంతో మనకు జరిగిన నష్టం తక్కువ.. కానీ మన ఓటమితో తెలంగాణ సమాజానికి ఎక్కువ నష్టం జరిగింది. ఇది అక్షర సత్యం, వాస్తవం అని కేటీఆర్ స్పష్టం చేశారు.తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఆకాశ స్థాయికి తీసుకుపోయి స్వరాష్ట్రాన్ని సాధించిన గులాబీ జెండా.. మన నాయకుడు కేసీఆర్. ఈ రికార్డును ఎవరూ చెరపలేరు. కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేస్తామని ఎవరన్న అనుకుంటే అది వారి అజ్ఞానం. రేవంత్ రెడ్డి మీద నోరుపారేసుకుని మన నోరును కరాబ్ చేసుకోవాల్సిన అవసరం లేదు. ఎవరికి తెలంగాణ మీద ప్రేమ ఉంటది.. రైతులకు, పేదలకు, విద్యార్థులకు, మహిళలకు లాభమైతది అని చర్చ పెట్టాలి అని కేటీఆర్ సూచించారు.బీజేపీ దేశంలో మతం పిచ్చి లేపడం తప్ప చేసిందేమీ లేదు. ప్రపంచ ర్యాంకుల్లో వివిధ రంగాల్లో వెనక్కి పోతున్నాం. రేవంత్ నాయకత్వంలో తెలంగాణ వెనక్కి పోయినట్టే.. మోదీ నాయకత్వంలో దేశం వెనక్కి పోతుంది. నెగిటివ్ పాలిటిక్స్ తప్ప బీజేపీ చేసిందేమీ లేదు. మనం కేంద్రానికి ఇచ్చేది రూపాయి అయితే వాపస్ 45 పైసలు వస్తుంది. ఈ దేశానికి సాదుతున్న రాష్ట్రాల్లో మన తెలంగాణ కూడా ఒకటి. మత పిచ్చి అనేది మంచిది కాదు. సమాజాన్ని విచ్ఛిన్నం చేయకూడదు. హిందువులు ప్రమాదంలో ఉన్నారట. 2014 వరకు మంచిగా ఉన్న హిందువులు ఇప్పుడు ప్రమాదంలో ఉన్నరాట అని అన్నారు.



### హిందూ సమాజం

## కులవివక్ష వీడాలి




పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హిందూ విలువల ప్రాముఖ్యతను చెప్పారు. "ప్రపంచవ్యాప్తంగా శాంతి సాధించడానికి ముందుగా.. భారత్ సామాజిక ఐక్యత సాధించడం కీలకం. హిందూ సమాజానికి పునాదిగా భావించే సంస్కారం (విలువలు), సంప్రదాయం, సాంస్కృతిక విలువలు, నైతిక సూత్రాల పేరుతో ఆ చీకటి లోయల లోతుల్లో పాతుకుపోయిన ఈ సమాజ ఆలోచన తీరును నిర్మూలించాలి. కుల భేదాలకు స్వస్తి పలకాలి" అని పిలుపునిచ్చారు. "నైతిక విలువలను పాటిస్తూ సమాజంలోని అన్ని వర్గాలను కలుపుకొని పోవాలి. ఎలాంటి భేదాలు చూపకుండా అన్ని వర్గాల వారిని ఇళ్లలోకి ఆహ్వానించాలి. అట్టడుగు స్థాయిలో సామరస్యం, ఐక్యతను వ్యాప్తి చేయాలి. సంస్కారం అనే పునాదిపై నుంచి కుటుంబం, దాని విలువలు రూపుదిద్దుకున్నాయి. ఇది సమాజంలో ప్రాథమిక యూనిట్‌గా ఉంటోంది. జాతీయవాదం, సామాజిక ఐక్యత పునాదులను మరింత బలోపేతం చేసేందుకు అన్ని పండుగలను సామూహికంగా నిర్వహించడం ఎంతో ముఖ్యం" అని పేర్కొన్నారు.

# చివరి ఆయకట్టుకు సాగునీరు

10 కోట్ల 31 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన మధిర ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ భవన నిర్మాణ పనులకు ఉపముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.మహాదేవపురం గ్రామంలో సుమారు 952 ఎకరాలకు సాగునీరు అందించేందుకు 12 కోట్ల 14 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన మహాదేవాపురం ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించి, రాయపట్నం గ్రామంలో 1079 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన రాయపట్నం ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మధిర మునిసిపాలిటీ 3వ వార్డు, అంబారుపేటలో మధిర నుండి ములుగుమాడు వయా నిదానపురం వరకు ఉన్న రహదారిని 25 కోట్ల అంచనా వ్యయంతో రెండు వరసల రహదారిగా అభివృద్ధి చేయుటకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులకు ఉపముఖ్యమంత్రి, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ మధిర మండలం సిరిపురం గ్రామంలో 1240 ఎకరాలకు సాగునీరు అందించే దిశగా వైరా నదిపై 6 కోట్ల 85 లక్షలతో చెక్ డ్యాం నిర్మిస్తున్నామని, చెక్ డ్యామ్ నిర్మాణం వల్ల పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయ వృద్ధికి దోహద పడతాయని, వేసవి, చలి కాలంలో భూగర్భ జలాల కొరత తగ్గిపోతుందని అన్నారు. చెక్ డాం పైన 3 చిన్న ఎత్తిపోతల పథకాలు ఉన్నాయని, చెక్ డ్యాం నిర్మాణం వల్ల బ్యాక్ వాటర్ 1.5 కిలో మీటర్ల వరకు ఉంటుందని, చిన్న ఎత్తిపోతల పథకాలకు సంవత్సరం పాటు నీరు అందుబాటులో ఉంటుందని, నది గర్భం సమీపంలో గల గ్రామాలలో భూగర్భ జలాలు అధికంగా పెరుగుతాయని ఉప ముఖ్యమంత్రి తెలిపారు.గత ప్రభుత్వం భారీగా అప్పులు చేసి ఖర్చు చేసినప్పటికీ ఆయకట్టు సృష్టించడంలో వైఫల్యం చెందిందని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తక్కువ ఖర్చుతో కూడుకున్న పనులు చేపట్టి అధిక ఆయకట్టు సాధించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని అన్నారు. పేదల సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలను ప్రజా ప్రభుత్వం సమాంతరంగా చేపడుతుందని అన్నారు. గత ప్రభుత్వం సృష్టించిన ఆర్థిక విధ్వంసాన్ని సరిచేస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని అన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్య శ్రీ పరిమితి 10 లక్షలకు పెంపు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ సరఫరా, 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్స్ చార్జిల పెంపు వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. కార్పోరేట్ కు దీటుగా మన పిల్లలు చదువుకోవాలని యంగ్ ఇండియా సమీకృత విద్యాలయాలను నిర్మిస్తున్నామని అన్నారు. అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని, మొదటి దశలో నిరుపేదలకు మంజూరు చేస్తామని అన్నారురైతుల సంక్షేమం దిశగా రెండు లక్షల రుణమాఫీ, రైతు భరోసా, సన్న బియ్యం పండించిన రైతులకు క్వింటాల్ వడ్లకు 500 రూపాయల బోనస్, రైతు బీమా, ఉచిత విద్యుత్ కు పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేశామని అన్నారు.మహిళలను సంపన్నులుగా చేసే దిశగా ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద వివిధ పనులు చేపట్టామని, ఇందిరమ్మ క్యాంటీన్ లు ఏర్పాటు, మండలాలలో పెట్రోల్ బంకుల ఏర్పాటు, రైస్ మిల్లులో ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఖమ్మం సిఇ ఓ.వి. రమేష్ బాబు, విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాసా చారి, ఆర్ అండ్ బి ఎస్ఇ యుగంధర్, ఇరిగేషన్ కల్లూరు సర్కిల్ ఎస్ఇ జి.వాసంతి, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, పీఆర్ ఇఇ వెంకట్ రెడ్డి, ఇరిగేషన్ మధిర డివిజన్ ఇఇ సి.హెచ్. రామకృష్ణ, మధిర డిఇఇ వి. నాగ బ్రహ్మయ్య, సిరిపురం ఏఇఇ బి.శివ సాగర్, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

# నీతీశ్ అవకాశవాది

- సీఎం పదవి కోసం కుర్చీలాట ఆడుతున్నారు
- ఇది బీహార్ ప్రజలకు మేలు చేకూర్చదు
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే



**పాట్నా(జనంసాక్షి):** బిహార్‌లో జేడీయూ, భాజపా సంకీర్ణ ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శలు గుప్పించారు. అదో అవకాశవాద కూటమి అని పేర్కొన్నారు. నీతీశ్ కుమార్ సీఎం కుర్చీ కోసం పార్టీలు మారుతుంటారని ఆరోపించారు. బిహార్‌లోని బక్సర్‌లో నిర్వహించిన పార్టీ సభలో పాల్గొన్న ఖర్గే ఈ మేరకు ప్రసంగించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో ఎన్డీయే సర్కారును అధికారం నుంచి తప్పించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు."బిహార్‌లో నీతీశ్ పార్టీ, భాజపాది అవకాశవాద పొత్తు. రాష్ట్ర ప్రజలకు ఇది మేలు చేకూర్చదు. ముఖ్యమంత్రి పదవి కోసం నీతీశ్ కుమార్ పార్టీలు మారుతుంటారు. మరోవైపు.. ప్రధాని మోదీ అబద్ధాల ఫ్యాక్టరీ నడుపుతున్నారు. బిహార్‌కు ఇస్తామన్న రూ.1.25 లక్షల కోట్ల ప్యాకేజీ హామీ ఏమైంది? ఈ విషయంపై ముఖ్యమంత్రిని రాష్ట్ర ప్రజలు నిలదీయాలి" అని ఖర్గే వ్యాఖ్యానించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో 'మహాగఠ్‌బంధన్'కు ఓటేయాలని, ఎన్డీయే సర్కారును గద్దె దించాలని విజ్ఞప్తి చేశారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఇటీవల కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై ఈడీ ఛార్జిషీటు నమోదు చేయడాన్ని ఖర్గే ఖండించారు. కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేసుకునేందుకే ఇలా చేశారని ఆరోపించారు. తమ నేతలు భయపడరని.. ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీలు దేశం కోసం ప్రాణాలర్పించారని గుర్తుచేశారు. పేదలు, మహిళలు, బలహీనవర్గాలకు భాజపా, ఆరెస్సెస్‌లు వ్యతిరేకమని విమర్శించారు. కులమతాల ఆధారంగా సమాజాన్ని విభజించాలని చూస్తాయని, వక్ఫ్ చట్టం దీనికి ఉదాహరణ అని పేర్కొన్నారు.

## మళ్లీ నిరసనల హోరు..

తీరు మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ఎఫ్-1 విద్యార్థి వీసా ముగిసినా అమెరికాలోనే ఉంటున్న పాలస్తీనాకు చెందిన విద్యార్థిని లెకా కోర్డియాను అక్కడి అధికారులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అదే విధంగా మరో పాలస్తీనా విద్యార్థిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉంటే.. ట్రంప్ పని తీరును నిరసిస్తూ ఇటీవల అమెరికా ప్రజలు దేశమంతటా ర్యాలీలు నిర్వహించిన సంగతి తెలిసిందే. న్యూయార్క్ నుంచి అలస్కా దాకా వీధుల్లో జనం పోటెత్తి 'హ్యాండ్సాఫ్' అంటూ నినదించారు. రిపబ్లికన్ల పాలన ప్రారంభమయ్యాక జరిగిన అతి పెద్ద నిరసనగా ఇది నిలిచింది.పౌర హక్కుల, కార్మిక సంఘాలు, ఎల్‌జీబీటీక్యూ సంస్థలు, న్యాయవాద సంఘాలు, సీనియర్ సిటిజెన్, ఎన్నికల సంస్కరణల సంఘాల ఆధ్వర్యంలో 50 రాష్ట్రాల్లోని 1,200 ప్రాంతాల్లో చేపట్టిన ఈ 'హ్యాండ్సాఫ్' ఆందోళనలకు ప్రజల నుంచి భారీగా స్పందన వచ్చింది. అయితే.. శాంతియుతంగానే నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. తాజాగా మరోసారి ట్రంప్‌నకు వ్యతిరేకంగా నిరసనలు చేశారు.

## పేరుకే 'కాల్పుల విరమణ'.. దాడులు యథాతథం

ఆదివారం అర్ధరాత్రి నుంచి 30 రోజుల పాటు కాల్పుల విరమణను పొడిగించాలనే ప్రతిపాదనను పునరుద్ఘాటించారు.ఇదిలా ఉండగా.. రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య శాంతి ఒప్పందంలో భాగంగా క్రిమియాపై మాస్కో నియంత్రణను గుర్తించేందుకు అమెరికా సిద్ధంగా ఉన్నట్లు కథనాలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ శాంతి ప్రతిపాదన వల్ల రెండు దేశాల మధ్య తక్షణ కాల్పుల విరమణ అమల్లోకి రానున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా రూపొందించిన ఫ్రేమ్‌వర్క్‌ను ఉక్రెయిన్, ఐరోపా యంత్రాంగాలు పారిస్‌లో పరిశీలించాయి. క్రిమియాపై రష్యా నియంత్రణ కొనసాగడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనుకూలంగా ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. మరోవైపు.. కష్టమైనా చర్చలకు సిద్ధంగా ఉన్నామని రష్యా ప్రకటించింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌పై ఉక్రెయిన్ జెలెన్‌స్కీ సంచలన ఆరోపణలు చేశారు. పుతిన్ చెప్పేదొకటి.. చేసేదొకటి అని మండిపడ్డారు. ఈస్టర్ సందర్భంగా కాల్పులు విరమణ పాటిస్తున్నామంటూనే..రష్యా సైన్యం కాల్పులు జరిపిందని చెప్పుకొచ్చారు. మరోవైపు.. కాల్పులు విరమణ విషయంలో రష్యాపై ఆగ్రహం వ్యక్తం చేశారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. దీంతో, క్రెమ్లిన్ కీలక ప్రకటన చేసింది.ఈస్టర్ కాల్పులపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ తాజాగా స్పందిస్తూ..'కాల్పులు విరమణ పాటిస్తామన్న రష్యా తమ మాట నిలబెట్టుకోలేదు. ఈస్టర్ సందర్భంగా కూడా దాడులు చేసింది. రష్యా సరిహద్దు ప్రాంతాలైన కుర్స్క్, బెల్గోరోడ్లలో రష్యా సైన్యం కాల్పులు జరిపింది. శనివారం సాయంత్రం నుండి 30 గంటల ఈస్టర్ కాల్పుల విరమణను ప్రకటించిన తర్వాత రష్యా దాడులు చేయడమేంటి?. కాల్పుల విరమణ అమల్లోకి వచ్చిన కొన్ని గంటల్లోనే కీవ్, ఇతర ప్రాంతాలలో వైమానిక దాడి సైరన్లు వినిపించాయి. ఇది రష్యా చర్యలకు అద్దం పడుతుంది. నిశ్శబ్దానికి ప్రతిస్పందనగా నిశ్శబ్దం, దాడులకు ప్రతిస్పందనగా రక్షణాత్మక దాడులు ఉంటాయి' అని హెచ్చరించారు.ఇదిలా ఉండగా.. 30 రోజుల పూర్తి కాల్పుల విరమణ కోసం అమెరికా మద్దతుతో కూడిన ప్రతిపాదనకు ఉక్రెయిన్ ముందుగా అంగీకరించింది, దానిని రష్యా తిరస్కరించిన విషయం తెలిసిందే. కాగా, యుద్ధం విషయంలో చర్చలు ఓ కొలిక్కి రాకపోవడం పట్ల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ శుక్రవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. యుద్ధ విరమణ చేయించాలన్న తన ప్రయత్నాలకు ఆ రెండు దేశాలు సహకరించడంలేదని తెలిపారు.ఇదే సమయంలో.. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం విషయంలో పురోగతి ఏమీ కనిపించకుంటే.. ఆ రెండు దేశాల మధ్య శాంతి ఒప్పందం కుదిర్చే ప్రయత్నాల నుంచి తాము విరమించుకుంటామని అమెరికా ప్రకటన వెలువరించిన విషయం తెలిసిందే. దీనిపై రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ స్పందించింది. ఉక్రెయిన్‌లో శాంతి స్థాపనకు చర్యలు తీసుకుం టామని.. ఈ దిశగా త్వరలో ముందుకు సాగే అవకాశం ఉందని పేర్కొంది. తమ స్వంత ప్రయోజనాలను కాపాడు కోవడానికి.. కీవ్, అమెరికాతో చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని ఈ చర్చలు చాలా క్లిష్టమని అంగీకరించినప్పటికీ.. వాటిని కొనసాగించడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. ట్రంప్ తమ అధినేత పుతిన్‌కు మధ్య ప్రస్తుతం ముందస్తు సమావేశాలు లేవని.. కానీ అవసరం అయితే వెంటనే సమావేశమవుతామని తెలిపారు. అలాగే, ఈ ఘర్షణ విషయంలో ఐరోపా దేశాలు ఉక్రెయిన్‌పైఎలాంటిఒత్తిడితీసుకురావట్లేవని విమర్శించారు.

## కుల్‌భూషణ్ జాదవ్‌కు అప్పీల్ చేసుకునే హక్కు లేదు

న్యూఢిల్లీ: గూఢచర్యం ఆరోపణలు ఎదుర్కొంటూ పాక్ జైల్లో మగ్గుతున్న భారత నౌకాదళ మాజీ అధికారి కుల్‌భూషణ్ జాదవ్‌కు 2019లో అంతర్జాతీయ న్యాయస్థానం ఇచ్చిన తీర్పులో ఓ లొసుగును పాక్ వాడుకొంటోంది. దానిలో అతడికి అప్పీల్ చేసుకునే హక్కు ఇవ్వలేదని పాకిస్తాన్ ప్రభుత్వం అంటోంది. 2019 జూన్‌లో ఐసీజే భారత్‌కు అనుకూలంగా తీర్పు ఇస్తూ జాదవ్‌కు కాన్సులర్ యాక్సెస్ హక్కును కల్పించాలని తేల్చిచెప్పింది. ఈ కేసులో అతడికి విధించిన మరణశిక్షను పునఃసమీక్షించాలని పాకిస్థాన్‌ను కోరింది. అప్పటి వరకు ఉరిశిక్ష అమలు చేయొద్దని ఆదేశించింది. అయితే.. 2023 మేలో మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ అరెస్టుకు నిరసనగా జరిగిన ఆందోళనల్లో పాల్గొన్నారని ఆరోపిస్తూ సైనిక కోర్టులు కొందరిని దోషులుగా నిర్ధారించాయి. దీనిని సవాలు చేస్తూ ఆ దేశ సుప్రీం కోర్టులో దాఖలైన కేసుపై ఇటీవల విచారణ జరిగింది. ఈ నేపథ్యంలో ఆ దేశ సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ముందు జాదవ్ కేసు గురించి ప్రస్తావించారు. గూఢచర్యం ఆరోపణలు ఎదుర్కొంటున్న భారత పౌరుడు జాదవ్‌కు ఉన్న అప్పీలు హక్కు.. అల్లర్ల కేసుల్లో దోషులుగా తేలిన పాకిస్థాన్ సొంత పౌరులకు ఇవ్వలేదని వారి తరఫు న్యాయవాది ఆరోపించారు. దీనిపై పాకిస్తాన్ రక్షణ మంత్రిత్వ శాఖ న్యాయవాది స్పందిస్తూ.. అప్పట్లో దేశ న్యాయవ్యవస్థలో ఉన్న లోపాన్ని గుర్తించి అంతర్జాతీయ న్యాయస్థానం జాదవ్‌కు కాన్సులర్‌తో మాట్లాడేందుకు అనుమతిస్తూ ఆ తీర్పును ఇచ్చిందన్నారు.

## త్వరలోనే ఆర్టీసీలో 3038 ఉద్యోగాల భర్తీ

**రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి మంత్రి పొన్నం ప్రభాకర్**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** త్వరలోనే ఆర్టీసీ లో 3038 ఉద్యోగాల భర్తీ చేయనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఆర్టీసీ లో సుదీర్ఘ కాలం తర్వాత ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ప్రారంభిస్తుండడంతో మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. 3038 ఉద్యోగాల భర్తీకి ఇప్పటికే ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని త్వరలోనే నోటిఫికేషన్ వేసి సాధ్యమైనంత త్వరలోనే ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తి చేస్తామని వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ప్రజా పాలన ప్రభుత్వం ఆర్టీసీ లో మహిళలకు ఉచిత ప్రయాణం అందిస్తుందని దీని ద్వారా ఆర్టీసీ లో మహిళా ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగిందని వెల్లడించారు. ఇప్పటి వరకు ఆర్టీసీ లో 165 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని వారు 5500 కోట్ల రూపాయలు ఆదా చేసినట్లు పేర్కొన్నారు.ఇప్పటికే మహా లక్ష్మి కోసం కొత్త బస్సులు కొనుగోలు చేశామని ఇప్పుడు ఉద్యోగాల భర్తీకి ఆర్టీసీ సన్నద్ధం అయిందని పేర్కొన్నారు.

పోస్టులకు త్వరలోనే నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనుంది. ఇప్పటికే ప్రజా పాలన ప్రభుత్వం లో నిరుద్యోగులకు పెద్ద పీఠ వేస్తూ దాదాపు 60 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేసిందన్నారు. ఇప్పుడు మరోసారి భారీస్థాయిలో ఉద్యోగాల నోటిఫికేషన్లు క్యాలండర్ ప్రకారం విడుదల చేయనుందని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకొని బాగా ప్రిపేర్ కావాలని సూచించారు. ఆర్టీసీ లో సుదీర్ఘ కాలం తర్వాత ఉద్యోగాల భర్తీ జరుగుతుండడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క గారికి మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు.

**మొత్తం 3038 ఉద్యోగాల్లో...**

డ్రైవర్ -2000, శ్రామిక్ -743, డిప్యూటీ సూపరిండెంట్ (ట్రాఫిక్) - 84, డిప్యూటీ సూపరిండెంట్ (మెకానికల్) - 114, డిపో మేనేజర్/అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ - 25, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ - 18, అసిస్టెంట్ ఇంజనీర్ (సివిల్) - 23, సెక్షన్ ఆఫీసర్ ( సివిల్) - 11, అకౌంట్ ఆఫీసర్స్ - 6, మెడికల్ ఆఫీసర్స్ జనరల్ - 7, మెడికల్ ఆఫీసర్స్ స్పెషలిస్ట్ - 7 భర్తీ చేయనున్నారు.

# భూపాలపల్లిలో రెండో బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్ ఏర్పాటు!

- కార్యకర్తలకు అందుబాటులో ఉండేందుకు మాజీ స్పీకర్ సిరికొండ వ్యూహం..
- నాలుగైదు రోజుల్లో ప్రారంభించేందుకు సన్నాహాలు..

*జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో మరో(రెండో) బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్ ఏర్పాటుకు రంగం సిద్ధం అయింది.. ఈ ప్రాంత నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉండేందుకు మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి సన్నాహాలు చేస్తున్నారు.. నాలుగైదు రోజుల్లో పార్టీ ఆఫీసును ప్రారంభించి అందుబాటులో ఉండేందుకు వ్యూహాలు రచిస్తున్నారు.. అయితే ఏర్పాటు కానున్న ఆ ఆఫీస్ పార్టీ పేరుతో ఉండకుండా ముందుజాగ్రత్తగా శాసనమండలి పక్షనేత కార్యాలయంగా ఏర్పాటు చేస్తున్నారు.. మధుసూదనాచారి రంగప్రవేశంతో ఇక ఇదే పార్టీలోని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డికి చుక్కలు కనిపించనున్నాయి..*

**- జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):**






టిఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యులు, మాజీ సీఎం కేసీఆర్ కు అత్యంత సన్నిహితుడు, తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుడు, మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి భూపాలపల్లిలో తిరగకుండా అణచివేతకు గురయ్యాడు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరినప్పటినుండి సిరికొండ మధుసూదనాచారిని ఈ నియోజకవర్గంలో లేకుండా చేయాలని కక్ష సాధింపు చర్యలకు పూనుకున్నారు. ఆది నుండి బీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతున్న మధుసూదనాచారి ఈ నియోజకవర్గంలో అందరి ఆదరాభిమానాలతో మళ్లీ గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టాలని అనుకున్న తరుణంలో ఆకస్మికంగా గండ్ర వెంకటరమణారెడ్డి బీఆర్ఎస్ లో చేరి తనదైన శైలిలో చక్రం తిప్పాడు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో భూపాలపల్లి నియోజకవర్గం నుండి బీఆర్ఎస్ టికెట్ తనకే ఇవ్వాలని పట్టుబట్టి తెచ్చుకున్నాడు. దీంతో పాటు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా ఉన్న గండ్ర వెంకటరమణారెడ్డి బీఆర్ఎస్ లో చేరి నానా వ్యూహాలు రచించాడు. తన సతీమణికి వరంగల్ జెడ్పీ చైర్మన్ పదవి తెప్పించుకున్నాడు. దాంతోపాటు బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలుగా ఆయన సతీమణికి వచ్చేలా చక్రం తిప్పి, పై చేయి సాధించాడు. ఇక ఈ ప్రాంతంలో బీఆర్ఎస్ పార్టీలో అంతా తమదే అనే రేంజ్ కి తీసుకువచ్చాడు. కాని అనేక ఆరోపణలు మూట కట్టుకున్నాడు. పార్టీ మారినందుకు అటు ఎమ్మెల్యే సీటు, జడ్పీ చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్ష పగ్గాలు తన ఆధీనంలో ఉంచుకుని, సిరికొండ మధుసూదనాచారి ఈ నియోజకవర్గంలో అడుగుపెట్టకుండా చేయాలనే సంకల్పంతో ముందుకు సాగారు. పార్టీ అధిష్టానంతో సంప్రదింపులు జరిపి సిరికొండ మధుసూదన చారి టికెట్ రాకుండా చేశారు. అప్పటికే టికెట్ కోసం విశ్వ ప్రయత్నాలు చేసిన మధుసూదనాచారి చివరి నిమిషంలో అధిష్టానం ముందు తలవంచాల్సి వచ్చింది. టికెట్ రాకపోవడంతో లోలోన కుమిలిపోయాడు. అధిష్టానం సూచన మేరకు సైలెంట్ గా ఉండిపోయాడు. అప్పటినుండి భూపాలపల్లిలో గండ్ర వెంకటరమణారెడ్డి తన పెత్తనాన్ని చేలాయిస్తూ పార్టీ అంత తమ కుటుంబానిదే అన్నట్లుగా ముందుకు సాగాడు. ఉద్యమ సమయంలో ఎన్నో కష్టనష్టాలు పడి భూపాలపల్లి నుండి ఎమ్మెల్యేగా గెలుపొంది, ఈ ప్రాంత ప్రజలతో సత్సంబంధాలు కలిగిన సిరికొండ మధుసూదనాచారి ఆశలను గత అసెంబ్లీ ఎన్నికల ముందు అడియాశలు చేసి నానా రకాలుగా ఎంతో ఇబ్బంది పెట్టినా, ఎంతో ఓర్పుతో మధుసూదనాచారి ముందుకు సాగాడు. అయితే పార్టీ అధిష్టానం సేవలను గుర్తించి ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చినప్పటికీ, భూపాలపల్లి నియోజకవర్గ ప్రజలకు దూరం అవుతున్నాననే నెపంతో ఈ ప్రాంత అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తల సూచనల మేరకు హైదరాబాదు నుండి పలు కార్యక్రమాలకు నియోజకవర్గంలో పర్యటించడం జరుగుతుంది. ఇందులో భాగంగా భూపాలపల్లిలో పార్టీ ఆఫీసు ఏర్పాటు చేసి ఈ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. రానున్న రోజుల్లోనైనా అధిష్టానాన్ని ఒప్పించి పార్టీ టికెట్ తెచ్చుకొని ఎమ్మెల్యేగా పోటీచేయాలనే ఉద్దేశంతో ఇప్పటినుండే మధుసూదనాచారి పావులు కదుపుతున్నారు.

భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి ఇక చుక్కలే కనిపించనున్నాయి. బీఆర్ఎస్ పార్టీలో చేరినప్పటి నుండి అంతా తానే అన్నట్లుగా వ్యవహరిస్తూ ఒంటెద్దు పోకడలతో సిరికొండ వర్గాన్ని చిన్నచూపు చూడడంతో ఆ పార్టీలో ఆది నుంచి వర్గ విభేదాలు పొడ చూపుతూనే ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో సిరికొండ మధుసూదనాచారి మళ్లీ ఈ ప్రాంతంలో పర్యటిస్తుండడం ఆ వర్గానికి ఊపిరి పీల్చుకున్నట్లవుతుంది. నియోజకవర్గంలో అందుబాటులో ఉంటూ తమ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు దగ్గర అవ్వాలనే సంకల్పంతో సిరికొండ మధుసూదనాచారి ముందుకు సాగేందుకు ప్రయత్నాలు చేస్తుండడంతో అదే పార్టీలోకి మాజీ ఎమ్మెల్యేకు చెమటలు పడుతున్నాయి. నియోజకవర్గంలో ఒంటెద్దు పోకడలతో అనేక విమర్శలతో ముందుకు సాగుతున్న గండ్ర వెంకటరమణారెడ్డికి ఇక ఘాటైన గడ్డు పరిస్థితులు ఏర్పడనున్నాయి. భూపాలపల్లిలో గండ్ర వెంకటరమణారెడ్డి నేతృత్వంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఆఫీసును వివిధ శుభకార్యాలు కిరాయిలకు ఇస్తూ వ్యాపారం చేస్తుండడమే గాక, ఆఫీస్ తన సొంత ఆస్తిలా వ్యవహరిస్తుండడంతో సిరికొండ మధుసూదనాచారి ఆ పార్టీ ఆఫీసు మెట్లు ఎక్కకుండా తాను సొంతంగా పార్టీ ఆఫీసు ఏర్పాటు చేస్తుండడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఏదిఏమైనా ఇకనుండి భూపాలపల్లి బీఆర్ఎస్ లో రెండు పార్టీ ఆఫీసులు దర్శనం ఇవ్వనున్నాయి. రెండు వర్గాలు పోటాపోటీగా ముందుకు సాగనున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఇద్దరిలో ఎవరు పైచేయి సాధిస్తారో వేచి చూడాలి మరి.

## ఆదివాసి కన్నయ్య కుటుంబం కోసం చలో కలెక్టరేట్

- నేడు, రేపు జిల్లాలో నిరసనలు
- తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రౌండ్ టేబుల్ సమావేశం పిలుపు

(ప్రత్యేక ప్రతినిధి/జనం సాక్షి)



ఆదివాసీ కన్నయ్య కుటుంబం కోసం ఏప్రిల్ 21, 22 తేదీల్లో నిరసనలకు తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రౌండ్ టేబుల్ పిలుపునిచ్చింది. ఆదివాసీ కన్నయ్య ఆత్మహత్య పై తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం(టి ఏ జి ఎస్) ఆధ్వర్యంలో ఎర్మ పున్నం అధ్యక్షతన మంచిర్యాల జిల్లా కేంద్రంలోని చార్వాకా ట్రస్ట్ హాల్ ల్లో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కన్నయ్య మరణానికి గల అంశాల పైన చర్చించి,బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని,బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పలు డిమాండ్లు రూపొందించారు. ఏప్రిల్ 21 22 తేదీలలో జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలు/గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు, ప్రభుత్వం,అధికారులు స్పందించకుంటే ఛలో కలెక్టరేట్ నిర్వహించనున్నారు. తక్షణమే కలెక్టర్,ఐటీడీఎ పిఓ ఎమ్మెల్యే బాధిత కుటుంబాన్ని పరామర్శించాలని, కన్నయ్య కుటుంబానికి 50 లక్షల రూపాయలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని, ఇందిరమ్మ ఇల్లు,5 ఎకరాల భూమి ఇవ్వాలని, భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి.తన కొడుకు అఖిల్ చదువులకు ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని, ఎనగంటి చిన్నన్న,తన భార్య లక్ష్మీ పైన మరియు అక్రమంగా కన్నయ్యకు చెందిన భూమిని పట్టా చేసుకున్న వారి కొడుకు ఎనగంటి హరీష్ పైన అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, అక్రమంగా పట్టా చేసుకున్న ఎకరా భూమిని తిరిగి కన్నయ్య కుటుంబానికి ఇవ్వాలని, ఆదివాసీ, దళితుల, ఇతర పేదలపై పెత్తందారుల దౌర్జన్యాలు అరికట్టాలని డిమాండ్ చేశారు. గుడుంబా అమ్మడం, బెల్టు షాపులు నిర్వహణను బంద పెట్టించాలని, కన్నయ్య కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం ఏఐకెస్ జిల్లా అధ్యక్షుడు సంకె రవి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గోమాస ప్రకాష్, ఐద్వా జిల్లా కార్యదర్శి సామల ఉమారాణి, శ్రామిక మహిళా జిల్లా నాయకురాలు దాసరి రాజేశ్వరి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దూర్కే మోహన్, రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి పాయిరాల రాములు తదితరులు పాల్గొన్నారు.



## నీలగిరి తోటలో అగ్ని ప్రమాదం

**కడెం, ఏప్రిల్ 20(జనం సాక్షి) :** కడెం మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన వెంబడి శేఖర్ అనే రైతు ఐదు ఎకరాల భూమిలో నీలగిరి చెట్లు పెట్టి సాగు చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు ఆదివారం రోజున అకస్మాత్తుగా అగ్నిప్రమాదం జరగడంతో ఐదు ఎకరాలలో ఉన్న నీలగిరి చెట్లు పూర్తిస్థాయిలో దగమయ్యాయి. ఇది తెలుసుకున్న యాజమాని,గ్రామస్తులు హుటా హుటిన తోటకి చేరుకున్నారు. మంటలు పెద్ద ఎత్తున చెలరేయడంతో ఏం చేయలేని పరిస్థితి నెలకొంది. ఈ ప్రమాదంలో రైతు సుమారు 5 లక్షల వరకు నష్టపోయినట్లు బాదిత రైతు వెంబడి శేఖర్ తెలిపాడు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు.

## దుబాయిలో చిక్కుకున్న లింగయ్యకు ఆపన్న హస్తం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తాను దుబాయిలో చిక్కుకున్నాను రక్షించండని సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ కు చెందిన చొప్పరి లింగయ్య అనే గల్ఫ్ కార్మికుడు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ ను వేడుకుంటూ ఇటీవల ఒక సెల్ఫీ వీడియో పంపాడు. వెంటనే స్పందించిన పొన్నం ప్రభాకర్ ఈ విషయాన్ని ఎన్నారై అడ్వయిజరీ కమిటీ చైర్మన్ డా. బిఎం వినోద్ కుమార్ దృష్టికి తీసికెళ్లగా... ఆయన దుబాయి లోని సామాజిక సేకులు సుతారి సత్యం పటేల్ ను సంప్రదించి లింగయ్యకు అవసరమైన సహాయం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా దౌత్య ప్రయత్నాలు కూడా కొనసాగుతున్నాయి.

# ఇది కోతల, మాటల ప్రభుత్వమే

- కాంగ్రెస్‌పై ఎమ్మెల్సీ కవిత ధ్వజం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం కోతల, మాటల ప్రభుత్వమేనని, చేతల ప్రభుత్వం కాదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఈడీ కేసులు నమోదు చేస్తే దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆందోళనకు పిలుపునిచ్చిందని.. కానీ సీఎం రేవంత్ రెడ్డి మాత్రం కనీసం స్పందించలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఖమ్మం జిల్లాలో ఉప ముఖ్యమంత్రితో పాటు ఇద్దరు మంత్రులు ఉన్నప్పటికీ కూడా వడగండ్ల వాన వల్ల జరిగిన పంట నష్టంపై సమీక్షించలేదని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా వరి ధాన్యం తడిసిపోయి, మామిడి పూత రాలిపోయి రైతులు కష్టాల్లో ఉంటే కనీసం సమీక్షించే తీరికలేదని అన్నారు. రైతులు ఇంత కష్టంలో ఉంటే ప్రభుత్వ నాయకులు వారిని పలకరించిన పాపాన పోలేదని అన్నారు. ఇంతటి దౌర్భాగ్యమైన స్థితి ఎప్పుడూ లేదని పేర్కొన్నారు. జపాన్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి వర్షాలపై కనీసం రెవెన్యూ అధికారులతో కూడా మాట్లాడలేదని అన్నారు. రాష్ట్రంలో పరిపాలన పూర్తిగా పడకేసిందని మండిపడ్డారు. వర్షాల వల్ల పంట నష్టపోయిన ప్రతి ఎకరానికి రూ.20వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఒకరి మీద ఒకరు ఆధిపత్యం చెలాయించుకునే ప్రయత్నం చేయడం తప్ప ప్రజల సమస్యల గురించి పట్టించుకోవడం లేదని ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. కమ్యూనిస్టు పార్టీలో కూడా ప్రభుత్వాన్ని నిలదీయకపోవడం దారుణమని అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులు దయనీయ పరిస్థితుల్లో ఉన్నాయని.. ప్రజలు వెళ్లాలంటేనే భయపడుతున్నారని తెలిపారు. రైతు భరోసా సగం మందికి రానేలేదని గుర్తుచేశారు. రైతు రుణమాఫీ సంపూర్ణంగా చేశామని ప్రభుత్వం అబద్ధాలు చెబుతున్నదని.. 60 శాతం మందికి రుణమాఫీ కాలేదని పేర్కొన్నారు. రైతు కూలీలకు ఇస్తామన్న ఆత్మీయ భరోసా డబ్బులు ఇవ్వనేలేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే భక్త రామదాసు ప్రాజెక్టును కేసీఆర్ నిర్మించి 60 వేల ఎకరాలకు నీళ్లు అందించారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా ఒక కొత్త ప్రాజెక్టు చేపట్టలేదని విమర్శించారు. పథకాలు కేవలం ప్రచారానికే పరిమితమయ్యాయని మండిపడ్డారు. ఇది మాటల ప్రభుత్వమే తప్ప చేతల ప్రభుత్వం కాదని తేలిపోయిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల మన్ననలను కోల్పోయిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం తిరోగమన దిశలో పయనిస్తున్నదని వ్యాఖ్యానించారు. ఎక్కడికక్కడ ప్రభుత్వ పెద్దలను, కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పెద్ద ఎత్తున ప్రజలు తరలి రావాలని సూచించారు.

## సింగరేణి సంస్థను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెడితే ఊరుకోబోం

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**పెద్దపల్లి (జనంసాక్షి) :** సింగరేణి లో కార్మికుల హక్కులను కాపాడేదని, సంస్థ ను రక్షించేది సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. రామగుండం ఎన్టీపీసీ లోని శ్రీ మయి ఫంక్షన్ హాల్ ( అమరజీవి కామ్రేడ్ మాదన నారాయణ గారి హాల్ లో) లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్, ఆర్జీ వన్ బ్రాంచి ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన సింగరేణి యువ కార్మికుల సదస్సు లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ వందేళ్ల కు పైగా చరిత్ర కలిగిన తెలంగాణ లో ఉన్న ఏకైక ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి కాలరీస్ ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడానికి కుట్రలు జరుగుతున్నాయని, దీనిని అడ్డుకునేందుకు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఉద్యమాలు చేసి రక్షించుకుందామని, అందుకు యువ కార్మికులు సైనికులు లాగా ఐక్యంగా ఉండి సంస్థ ను కాపాడుకోవాలని ఆయన అన్నారు. ప్రైవేటు రంగంలో ఉన్న సింగరేణి ని ఎందరో నాయకులు తమ జీవితాలను, ప్రాణాలను త్యాగం చేసి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ రంగ సంస్థ గా మార్చుకున్నట్లు చెప్పారు. నాటి నుంచి నేటి వరకు సింగరేణి లో అనేక ఉద్యమాలు నిర్వహించి కార్మికుల సంక్షేమం కోసం అనేక హక్కులు సాధించుకోవడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాల వల్ల సింగరేణి కి కొత్త గనులు రాకపోవడం మూలంగా ఉన్న గనులను ఓపెన్ కాస్ట్ లుగా మారుస్తూ, కార్మికుల సంఖ్య తగ్గుతుందని ఆయన పేర్కొన్నారు.

## అకాల వర్షాలతో రైతులు అల్లాడుతుంటే....

# ముఖ్యమంత్రి విదేశీ పర్యటనలా?

- వక్ఫ్ బిల్లు వ్యతిరేక పేరుతో బహిరంగ సభలతో రాజకీయాలా?
- విష సర్పాల కంటే డేంజర్ మజ్లిస్ పార్టీ
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఫైర్



**పెద్దపల్లి, ఏప్రిల్ 20 (జనంసాక్షి) :** అకాల వర్షాలు, వడగండ్ల వానతో వేలాది ఎకరాల్లో పంట దెబ్బతిని రైతులంతా అల్లాడుతుంటే వాళ్లను ఆదుకోవాల్సిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జపాన్ పర్యటన పేరుతో విదేశాలకు వెళ్లడమేంటని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. రైతులను ఆదుకోవాలని కనీసం మంత్రులకైనా ఆదేశాలివ్వాలని కోరారు. వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా నిన్న దారుస్సలాంలో జరిగిన బహిరంగ సభ ముమ్మాటికీ కాంగ్రెస్ స్పాన్సర్డ్ కార్యక్రమమేనని పునరుద్ఘాటించారు. వక్ఫ్ ఆస్తులను దోచుకున్న బడా చోర్లంతా కలిసి నిన్నటి మీటింగ్ లో పాల్గొని బీజేపీపై విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. మజ్లిస్ నేతలు విష సర్పాల కంటే డేంజర్ అని వ్యాఖ్యానించారు. ముస్లిం ఓట్లను దండుకుని ముస్లింలను ఆదుకోకుండా వక్ఫ్ ఆస్తులను దోచుకుతింటున్నారని అన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు పెద్దపల్లికి విచ్చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామక్రిష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షులు సంజీవరెడ్డి, స్థానిక నేతలతో కలిసి మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్, మజ్లిస్ పార్టీల తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముస్లింలపట్ల ప్రేమ నటిస్తూ వక్ఫ్ ఆస్తులను దోచుకుతింటూ ముస్లింలను మురికి కూపాల్లోకి నెట్టేసిన మజ్లిస్ నేతలు అంతకంటే డేంజర్ అని, అంబేద్కర్ పేరును ఉచ్చరించే అర్హత కూడా ఒవైసీకి లేదని అన్నారు. తెలంగాణలో 77 వేల ఎకరాల వక్ఫ్ లాండ్స్ ఉంటే... అందులో 80 శాతం భూములు ఈ దొంగలే స్వాధీనం చేసుకుంది నిజం కాదా? ఒవైసీ కుటుంబంతోపాటు మజ్లిస్ నాయకులు, సోకాల్డ్ వక్ఫ్ బోర్డు సభ్యులంతా వక్ఫ్ ఆస్తులను దోచుకుని ఆసుపత్రులు, విద్యా సంస్థలు, వ్యాపార సంస్థలు నిర్మించి కోట్ల రూపాయల వ్యాపారం చేస్తోంది నిజం కాదా? అని ప్రశ్నించారు. ఈ 77వేల ఎకరాల్లో ఒక్క గజం అయినా పేద ముస్లింలకు ఇచ్చారా? వక్ఫ్ ఆస్తులపై వచ్చే ఆదాయంలో ఒక్క రూపాయి అయినా పేద ముస్లింలకు ఖర్చు చేశారా? ఏ ఒక్క పేద ముస్లిం జీవితాన్నైనా బాగు చేశారా? కనీసం పాతబస్తీలో మురికి కూపాల్లో బతుకుతున్న ముస్లింలకు గజం జాగా అయినా ఇచ్చారా? 5లక్షల కోట్ల రూపాయల విలువైన వక్ఫ్ ఆస్తుల్లో పేద ముస్లింలకు కేటాయించిందెంత? ఆ ఆస్తులపై వచ్చే ఆదాయంలో వాళ్ల కోసం ఖర్చు చేసిందెంత? అసలు ఆ సొమ్మంతా ఎటు పోతోంది? ఎవరి ఆధీనంలో ఎన్ని వక్ఫ్ ఆస్తులున్నాయో బహిరంగ చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. హైడ్రాను ఏర్పాటు చేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి వక్ఫ్ ఆస్తులపై విచారణ జరిపించే దమ్ముందా? ఎన్ని భూములు ఆక్రమణకు గురయ్యాయి? ఎవరు ఆక్రమించారు? అందులో ఒవైసీ కుటుంబం ఎంత దోచుకుంది? వక్ఫ్ ఆస్తులపై ఏటా ఎంత ఆదాయం వస్తోంది? ఆ సొమ్మును వేటి కోసం ఖర్చు చేస్తున్నారు? పేదల సంక్షేమం కోసం ఎంత ఖర్చు చేశారనే వివరాలపై శ్వేత పత్రం విడుదల చేసే దమ్ముందా? అని ప్రశ్నించారు. అకాల వర్షాలతో వేలాది ఎకరాల్లో పంట నష్టపోయి రైతులంతా అల్లాడుతుంటే వారిని ఆదుకోవాల్సిన ముఖ్యమంత్రి జపాన్ పర్యటన పేరుతో విదేశాలకు వెళ్లడం ఎంత వరకు కరెక్ట్? గత ప్రభుత్వ హయాంలో పంట దెబ్బతిన్న రైతులకు పరిహారం ఇవ్వలే. ఈ ప్రభుత్వం అదే పంథా కొనసాగిస్తోంది. ఇకనైనా వెంటనే రైతులను ఆదుకోవాలని సీఎం మంత్రులకు ఆదేశాలివ్వాలని కోరారు.

# అత్యుత్తమ న్యాయస్థానంపై అవాకులా..!

**దేశంలో ప్రతి నాగరికుడి చివరి న్యాయంపై భరోసా కల్పించేదే అత్యుత్తమ న్యాయస్థానం సుప్రీంకోర్టు! బలం ఉన్నది కదా అని పార్లమెంట్లో ఇష్టం వచ్చినట్లు చట్టాలు చేయడం నిర్ణయాలు చేయడం ప్రజలకు ఒక వర్గానికి అన్యాయం చేయడం లాంటివి వచ్చినప్పుడు ఆర్టికల్ 142 ప్రకారం సుప్రీంకోర్టుకు పార్లమెంటు నిర్ణయాన్ని రద్దు చేసే తప్పు పట్టే లేదా ఆమోదించే శక్తి ఉంటుంది. రాజ్యాంగంలో 142 ఆర్టికల్ పొందుపరిచిందే అందుకు.**




### విపక్ష ప్రభుత్వాలు ఉన్నచోట

రాష్ట్రపతి పార్లమెంటు ప్రభుత్వ క్యాబినెట్ నిర్ణయాలను ఆమోదిస్తూ ఉంటారు. రాష్ట్రాలలో గవర్నర్లు రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయాలను ఆమోదిస్తారు ఇటీవల తమిళనాడు గవర్నర్ అక్కడి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ఆమోదించకుండా తన వద్ద పెట్టుకొని ఇబ్బందులు పెడుతున్నారని సుప్రీంకోర్టుకు వెళితే సుప్రీంకోర్టు అక్కడి గవర్నర్ అక్రమంగా ప్రభుత్వ నిర్ణయాలను తన దగ్గర పెట్టుకున్నారని ఇది సరి అయిన పద్ధతి కాదని స్పష్టం చేయడం జరిగింది. గవర్నర్ల విధానం విపక్ష పార్టీలు అధికారంలో ఉన్న అన్ని రాష్ట్రాలలో ఇదే విధంగా ఉంది. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ కి చెందిన కేజిరి వాల్ ప్రభుత్వం ఉన్నన్ని రోజులు అక్కడ ఎల్జి తీవ్ర ఇబ్బందులు పెట్టారు. సీఎం అధికారాలకు కత్తెర పెట్టారు సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ అమలు చేయలేదు. ఇలా తెలంగాణలోనూ ఇదే పరిస్థితి ఉండేది. బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నపుడు నామినేటెడ్ ఎమ్మెల్సీ పదవుల ఫైల్స్ కూడా గవర్నర్ తిప్పి పంపేవారు! విపక్ష ప్రభుత్వాలు ఉన్న చోటే ఈ పరిస్థితి ఉన్నది. సర్కార్ కు అనుకూలంగా తీర్పు ఇచ్చినపుడు పీఎం నరేంద్ర మోడీ సైతం సుప్రీంకోర్టు వల్ల మన పరువు ప్రతిష్టల కు సంబంధించి భంగం కలగకుండా ఉంటుంది అన్న దాఖలాలు ఉన్నాయి. ఇప్పుడు ఇంకా వక్ఫ్ బోర్డు సవరణ చట్టం మీద సుప్రీంకోర్టు అమలును మే 5 వరకు నిలిపి వేసిందో లేదో, అప్పుడే బీజేపీ నేతలు సుప్రీం కోర్టు ఆదేశాల మీద ట్వీట్లు ట్రోల్స్ చేస్తూ అభ్యంతరకర వ్యాక్యలు చేస్తున్నారు. బొమ్మలు పెడుతున్నారు. స్వయంగా ఉప రాష్ట్రపతి సుప్రీం కోర్టు ను న్యూ క్లియర్ మిసైల్ అంటారు. పార్లమెంట్ ఎందుకింక బంద్ చేసుకోవాలి అంటారు. దేశంలో అత్యుత్తమ సుప్రీంకోర్టు అంటే గౌరవం లేదు న్యాయం పట్ల ఏమాత్రం ఇష్టం లేదు ఏమైనా తమకు వ్యతిరేకంగా ఎవరు పనిచేసిన వారికి వ్యతిరేకంగా తాము చిత్తము వచ్చినట్లు రాజ్యాంగ విరుద్ధంగా చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తాం విచ్చలవిడిగా విమర్శలు చేస్తాం భరించాల్సిందే అనే పరిస్థితి ప్రస్తుతం 11 ఏళ్ల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాలనలో అయిపోయింది అంటే అతిశక్తి కాదు.




### 400 సీట్లు వస్తె.. రాజ్యాంగం మార్చేసేవారు

మూడోసారి బిజెపికి కనుక వారు చెప్పుకున్నట్లు 4 వందల ఎంపీ సీట్లు గనుక సింగిల్ గా వచ్చి ఉంటే అంతకుముందు వారు చెప్పినట్లు రాజ్యాంగం నే మార్చి పడేసేవారు. ఇప్పుడు వచ్చిన 240 సీట్లతో టిడిపి జెడియు, ఆర్ ఎల్ డి తదితర పార్టీల మద్దతు ప్రభుత్వం ఏర్పాటు చేయడం వల్ల కొద్దిగా తగ్గినట్లు కనిపిస్తుంది. అయినా వారందరి మద్దతు తో వక్ఫోడు సవరణ బిల్లు తెచ్చుకొని ఆమోదం పొందారు ఇప్పుడు సుప్రీంకోర్టు మే 5 దాకా సవరణ చట్టం అమలు చేయవద్దని,కేంద్ర ప్రభుత్వం వారం రోజులలో తాము వేసిన ప్రశ్నలకు కౌంటర్ ఫైల్ చేయాలని కోరినందుకు ఇంత రాద్దాంతం చేసుడు అవసరమా! సుప్రీం కోర్టు మీద ఇంత అవాకులు చివాకులు మాట్లాడుతున్న అభ్యంతరకర మాటలపై పీఎం నరేంద్ర మోడీ ఒక్క మాట కూడా మాట్లాడలేదు ! రాజ్యాంగంపైన వీరెవరికి కనీస గౌరవం లేదు.



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు
9951865223

# తక్షశిల గ్రంథాలయం.. జ్ఞాన జ్యోతికి నెలవు

**పురాతన నాగరికతల చరిత్రలో భారతదేశానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. జ్ఞానాన్వేషణ, విద్యాభ్యాసం, విశాలదృష్టిని పదిలంగా నిలిపిన నాగరికతగా ఇది ఎన్నో తలాలపై వెలుగొందింది. ఈ క్రమంలో తక్షశిల అనే పట్టణం ఒక అద్భుత జ్ఞాన కేంద్రంగా ఎదిగింది. దాదాపు 2500 సంవత్సరాల కిందట సకల విద్యాశాఖల పుట్టినిలుగా గుర్తింపు పొందిన తక్షశిల విశ్వవిద్యాలయం, ముఖ్యంగా అక్కడి గ్రంథాలయం, భారతీయ విజ్ఞాన పాఠశాలల మహిమను ప్రపంచానికి చాటి చెప్పింది.**




ఇప్పటి పాకిస్తాన్‌లోని రావల్పిండి సమీపంలో ఉన్న తక్షశిల విశ్వవిద్యాలయం నిజంగా 'యూనివర్సిటీ' అనే పదానికి మించిన బహుళవిద్యా కేంద్రంగా అభివృద్ధి చెందింది. ఇది కేవలం విద్యాబోధనే కాకుండా, జ్ఞాన మార్గంలో పరిశోధనలతో శాస్త్రీయ చింతనకు నిలయంగా నిలిచింది. ఈ నగరానికి హృదయంగా ఉన్న గ్రంథాలయం ప్రపంచ నలుమూలల నుండి వచ్చిన శిష్యులకు ఆదర్శ విద్యా వేదికగా నిలిచింది. వైద్యం, ఖగోళశాస్త్రం, వ్యాకరణం, తత్వశాస్త్రం, రాజనీతిశాస్త్రం వంటి విభిన్న విభాగాల్లో వేలాది గ్రంథాలు, తాళపత్ర గ్రంథాల రూపంలో సేకరించబడ్డాయి.

ఈ గ్రంథాలయ విశిష్టత ఏకకాలంలో రెండు ప్రధాన అంశాల్లో ఉంది. జ్ఞాన పరిమాణంలోనే కాకుండా దాని వ్యాప్తిలోను ఉంది. చరకుని ఆయుర్వేద గ్రంథాలు, కౌటిల్యుని అర్థశాస్త్రం, పాణినీయ శబ్దానుశాసనం, భరతముని నాట్యశాస్త్రం వంటి అనేక అపురూప గ్రంథాలన్నీ అక్కడ నిక్షిప్తమై ఉండేవి. హిందూ, బౌద్ధ, జైన గ్రంథాలు అన్నీ అక్కడ సమపాళ్లలో ప్రాధాన్యం పొందాయి. వివిధ దార్శనిక వేదికల మీద పండితుల మధ్య జరిగిన వాద ప్రతివాదాలు, చర్చలు విద్యకు జీవం పోసేవి. తక్షశిలలో గ్రంథాలయం కేవలం పుస్తకాల నిల్వ కేంద్రంగా కాక, జ్ఞాన ప్రయోగశాలగా అభివృద్ధి చెందింది. తక్షశిల విద్యా విధానం అనేక మండలాల్లో శిష్యులకు సమగ్ర విజ్ఞానాన్ని అందించేవి. వైద్య విద్యార్థులకు తత్వశాస్త్రం నేర్పించబడేది. తత్వశాస్త్ర శిష్యులు ఖగోళ విజ్ఞానం అధ్యయనం చేయాల్సి వచ్చేది. ఇలాంటి అంతశాఖా(ఇంటర్ డిసిప్లనరీ అప్రోచ్) విద్యనివ్వడం ఆనాటి నుండే ఉన్నట్లు దీని వల్ల తెలుస్తోంది.విద్యార్థులు సమగ్ర దృక్పథంతో కూడిన పౌరులుగా ఎదిగేవారు.

ఇది భారతీయ తత్వాన్ని ప్రతిబింబించే విధంగా, విద్యను వ్యక్తిగత విముక్తికీ, సామాజిక సేవకూ ఉపయోగించాలన్న ఆలోచనకు ఆదర్శంగా నిలిచింది. ఈ గ్రంథాలయం గొప్పతనం ఇందులోని విద్యా స్వేచ్ఛలోనూ ప్రతిఫలిస్తుంది. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన శిష్యులకు ఆర్థికంగా సహాయం అందించేది స్థానికులు, పాలకులు. గురు-శిష్య సంబంధం ఆధారంగా అభ్యాసం జరిగేది. బ్యూరోక్రటిక్ నియమాలు లేని ఈ పద్ధతిలో స్వేచ్ఛ, స్ఫూర్తి ఉండేది. విద్యా భంగిమను శాసించే యంత్రాంగం కాక, విజ్ఞాన ద్యోతకుల చేతుల్లో విద్య అభివృద్ధి చెందింది.

తక్షశిలను ఐదవ శతాబ్దంలో హూణులు లక్షల సంఖ్యలో ఉన్న గ్రంథాలనూ తగలపెట్టడం వల్ల కేవలం ఓ ప్రాంగణం కాదు, ఒక నాగరికతే అంతరించిపోయింది. లక్షలాది గ్రంథాలు అగ్నికి ఆహుతి కావడం ఆనాటి విజ్ఞానం, సంస్కృతి ఏలా ఉంటుందో తెలుసు కొనే అవకాశం పోయింది. ఇది అలెగ్జాండ్రియా లైబ్రరీ విధ్వంసానికి సమానమైన విపత్తుగా పోల్చవచ్చు. కానీ అది ధ్వంసమైనా, తక్షశిల ఆత్మ, దాని విద్యా పరంపర ప్రపంచాన్ని ఇప్పటికీ చైతన్య పరుస్తూనే ఉంది. గ్రంథాలయాల ఉనికి గురించి, వాటి లక్ష్యం గురించి ఈ రోజు మనం ఆలోచించాలంటే, తక్షశిల స్ఫూర్తిగా మారుతుంది. ఈ కాలంలో గ్రంథాలయాలు డిజిటలైజేషన్, నిధుల కొరత, పఠన అలవాట్ల తక్కువతనంతో బలహీనపడుతున్నప్పుడు తక్షశిల మళ్ళీ మన మనసుల ముందుకు రావాలి. గ్రంథాలయాలు కేవలం పుస్తకాల నిల్వగదులు కాదుబీ అవి ఆలోచనలకు ఆలయాలు. జ్ఞానం ఉచితంగా అందించాల్సిన పవిత్ర బాధ్యతగా గ్రంథాలయాలు పనిచేయాలి. జ్ఞానం అనేది వాణిజ్య వస్తువు కాదు, అది సమాజ సంపద. తక్షశిలను గుర్తుచేసుకోవడం అంటే గడచిన గౌరవనీయుల కాలాన్ని మాత్రమే స్మరించుకోవడం కాదు. అది భావితరాలకు మార్గదర్శనం చూపే ఒక మోడల్‌ను తిరిగి మన ముందు నిలబెట్టడం. విద్యను బంధించకుండా, పటిష్టమైన సాంకేతిక పరిజ్ఞానంతో కాకుండా, స్వేచ్ఛతో కూడిన విచారణత్మక ప్రక్రియగా అభివృద్ధి చేయాలంటే తక్షశిల భావనను మన హృదయాల్లో ప్రతిష్ఠించుకోవాలి. తక్షశిల గ్రంథాలయం కేవలం తాళపత్రాల నిలయం కాదు. అది ఒక జ్ఞాన భాండాగారం. దాని జ్ఞాపకమే మానవతా ప్రగతికి దీపశిఖగా మారాలి.



డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్
9849328496

## ఆ విషయం తెలిస్తే నేను విప్లవంలో చేరేవాడిని కాదు

1956- 62 మధ్య చైనాలో మూడున్నర కోట్ల మంది మరణించారని అంచనా , ప్రధానంగా కరువు మరియు సంబంధిత కారణాల వల్ల . గ్రేట్ లీప్ ఫార్వర్డ్ అనేది మావో జెడాంగ్ నాయకత్వంలో వేగవంతమైన ఆర్థిక మరియు సామాజిక అభివృద్ధి కాలం, దీని ఫలితంగా విస్తృతమైన కరువు మరియు సామూహిక ఆకలి చావులు ఏర్పడ్డాయి. కరువు మరియు రాజకీయ ఉద్యమాలు వంటి ఇతర అంశాలు కూడా అధిక మరణాల రేటుకు దోహదపడినప్పటికీ, కరువు ప్రధాన కారణంగా విస్తృతంగా పరిగణించబడుతుంది. ఇలాంటి పరిణామాల కోసమా విప్లవం? ప్రజల జీవన ప్రమాణాలు పెంచడానికి మనకు అనేక మార్గాలున్నాయి.

ఇండియాలో ప్రజలకు పరిమిత రాజకీయ పరిపాలన అధికారం అప్పగించడానికి సైమన్ కమిషన్, కమ్యూనల్ అవార్డు, పూనా ఒప్పందం 1935 నూతన భారత రాజ్యాంగం రూపొందిన కాలం. మన దేశంలో ఇలా శాంతియుతంగా అధికార బదిలీ జరుగుతుండగా అందుకు పూర్తి భిన్నంగా చైనాలో చాంగ్ కైషేక్ సైనిక నిర్బంధాల వల్ల 1934 -35 లో జరిగిన లాంగ్ మార్చ్ లో లక్షలాది మంది చని పోయారు. విప్లవం వచ్చి మావో నాయకత్వంలో విప్లవ ప్రభుత్వం ఏర్పడ్డాక 1956-62 మధ్య మూడున్నర కోట్ల మంది చనిపోయారని అంచనా! ఇండియాలో 1946 నాటికే అధికార బదిలీ కోసం నూతన రాజ్యాంగ రచన కోసం 398 మందితో రాజ్యాంగ పరిషత్తు కు అంకురార్పన జరిగింది. 1947 ఆగస్టు లో అధికార బదిలీ జరిగింది. 1950 జనవరి లో 1935 రాజ్యాంగం స్ఫూర్తితో మరింత సమగ్రంగా రూపొందించిన రాజ్యాంగం ఓటు హక్కు అమలు లోకి వచ్చాయి. 1952 లో ఎన్నికల ద్వారా సార్వత్రిక ఓటు హక్కుతో ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నుకునే క్రమం మొదలైంది. విప్లవ ప్రభుత్వం ఏర్పడ్డాక కూడా చైనాలో మూడున్నర కోట్ల మంది చనిపోయారని తెలిస్తే నేను విప్లవం లో చేరేవాడిని కాదు.

జనంసాక్షి

# ప్రపంచ దేశాలలో భారతదేశం మానవాభివృద్ధి

ప్రపంచంలోనే లిఖిత రాజ్యాంగాన్ని కలిగి ఉన్న భారతదేశంలో మానవ అభివృద్ధి సూచి ఏ మేరకు ఉన్నదో ఒకసారి గమనించాలి. గడిచిన 78 సంవత్సరాల కాలంలో సామాజిక అభివృద్ధి పట్ల కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు మానవాభివృద్ధికి ఏ విధంగా దోహదపడుతున్నాయి అన్న విషయాన్ని మనం గమనించాలి. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన భారతదేశం మానవ పురోభివృద్ధి ముఖ్యంగా శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం, వ్యవసాయ రంగ, పారిశ్రామిక ఉత్పాదక రంగాలలో గణనీయమైన అభివృద్ధి సాధించినప్పటికీ మానవ మనుగడ విషయంలో ప్రపంచ దేశాలకు భారతదేశం ఏ స్థానంలో ఉందొ ఒక్కసారి గమనించాలి మనం.

2.మానవ అభివృద్ధి మూడు ప్రాథమిక కోణాలలో సగటు విజయాన్ని అంచనా వేయడానికి హెచ్ డి ఐ ఒక సారాంశ కొలత: దీర్ఘ , ఆరోగ్యకరమైన జీవితం, జ్ఞానాన్ని పొందడం ,మంచి జీవన ప్రమాణాలు. 2022 సంవత్సరానికి భారతదేశం యొక్క హెచ్ డి విలువ 0.644 - ఇది దేశాన్ని మధ్యస్థ మానవ అభివృద్ధి విభాగంలో ఉంచింది - 193 దేశాలు , భూభాగాలలో 134 స్థానంలో నిలిచింది.1990 , 2022 మధ్య, భారతదేశ హెచ్ డి ఐ విలువ 0.434 నుండి 0.644కి మారింది, ఇది 48.4 శాతం మార్పు. 1990 , 2022 మధ్య, భారతదేశపు జనన ఆయుర్దాయం 9.1 సంవత్సరాలు, పాఠశాల విద్య యొక్క అంచనా సంవత్సరాలు 4.6 సంవత్సరాలు , పాఠశాల విద్య యొక్క సగటు సంవత్సరాలు 3.8 సంవత్సరాలు మారాయి. 1990 మరియు 2022 మధ్య భారతదేశ తలసరి జిఎన్ఐ దాదాపు 287.0 శాతం పెరిగింది.

### లింగ అభివృద్ధి సూచిక

మానవ అభివృద్ధి మూడు ప్రాథమిక కోణాలలో సాధించిన విజయాలలో లింగ అంతరాలను జిడిఐ కొలుస్తుంది: ఆరోగ్యం (పుట్టుక సమయంలో స్త్రీ, పురుషుల ఆయుర్దాయం ద్వారా కొలుస్తారు), జ్ఞానం (పిల్లలకు స్త్రీ, పురుషుల అంచనా పాఠశాల విద్య సంవత్సరాలు, 25 సంవత్సరాలు , అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న పెద్దలకు సగటు పాఠశాల విద్య సంవత్సరాల ద్వారా కొలుస్తారు) ,జీవన ప్రమాణాలు (తలసరి స్త్రీ ,పురుషుల అంచనా జి ఎన్ ఐ ద్వారా కొలుస్తారు). ఇది స్త్రీ , పురుషుల హెచ్ డి ఐ నిష్పత్తి. భారతదేశంలో 2022 మహిళా హెచ్డి విలువ 0.582, పురుషులకు 0.684కి భిన్నంగా, జి డి ఐ విలువ 0.852, దీనిని గ్రూప్ 5లో ఉంచారు.అసమానత-సర్దుబాటు చేయబడిన జనాభా అంతటా ప్రతి కోణ పంపిణీలో అసమానత కోసం సర్దుబాటు చేస్తుంది. అసమానత కారణంగా మానవ అభివృద్ధిలో 'నష్టం' మధ్య వ్యత్యాసం ద్వారా ఇవ్వబడుతుంది. ఒక దేశంలో అసమానత పెరిగేకొద్దీ, మానవ అభివృద్ధిలో నష్టం కూడా పెరుగుతుంది. అసమానత కారణంగా భారతదేశం నష్టం 31.1 శాతం, ఇది 2022లో హెచ్ డి ఐ ని 0.444కి తగ్గిస్తుంది. మూడు కీలక కోణాలలో లింగ అసమానతలను కొలుస్తుంది - పునరుత్పత్తి ఆరోగ్యం, సాధికారత , కార్మిక మార్కెట్. ప్రసూతి ఆరోగ్యాన్ని ప్రసూతి మరణాల నిష్పత్తి , కౌమార జనన రేట్ల ద్వారా కొలుస్తారుబీ సాధికారతను పార్లమెంటరీ స్థానాల వాటాలు , కనీసం కొంత మాధ్యమిక విద్య కలిగిన జనాభా ద్వారా కొలుస్తారుబీ కార్మిక మార్కెట్ భాగస్వామ్యాన్ని మహిళలు పురుషుల శ్రామిక శక్తి భాగస్వామ్య రేట్ల ద్వారా కొలుస్తారు. భారతదేశం 0.437 జిఐ విలువను కలిగి ఉంది, 2022లో 166 దేశాలలో 108వ స్థానంలో ఉంది. 3.ఇల్లు లేని గరీబోళ్ళు ఇంకా ఉన్నారా! 78 ఏళ్ల భారతంలో సొంత గూడు లేని పేదలు ఉండవచ్చా! ఇదేనా వికసించడం, వెలిగిపోవడం అంటే?లి మానవాభివృద్ధికి పందుల గుడిసెల వంటి ఇండ్లు, ఇండ్ల లేమియే ప్రామానికమా?కలలో కనిపించిన కొన్ని సంఘటనలు దృశ్యాలు అప్పుడప్పుడు నిజమవుతాయి నిజం కావాలని కూడా కోరుకుంటాం కానీ కొన్ని సందర్భాలలో కలలోని దృశ్యాలు నిజం కాకూడదని ఆవేదన చెందిన సందర్భాలు కూడా ఉంటాయి. శుభ అ శుభ కార్యక్రమాలకు సంబంధించి ఆపద సంపదలకు సంబంధించి ఇలాంటి అభిప్రాయాలను మనం వ్యక్తం చేయడం జరుగుతూ ఉంటుంది. కలలో పందులు నివసించే, మనిషి దూరడానికి కూడా అవకాశం లేనటువంటి, కిల్లి కొట్టు కంటే చిన్నగా ఉన్నటువంటి ఇండ్లు, ఆ ఇండ్లలో జీవిస్తున్నటువంటి ప్రజల ఇక్కట్లు, మూత్రశాలలు మరుగుదొడ్లు లేకుండానే సామూహికంగా అరకొర సౌకర్యాల మధ్యన జీవిస్తున్నటువంటి కాలనీవాసులు, స్నానపు గదులకు కూడా నోచుకోని పరదాల మాటున





బతుకుతున్నటువంటి అభాగ్యులకు సంబంధించిన నివాసాలు మాత్రం కలలో కనపడినప్పుడు ఈ కల నిజం కాకూడదు అని నా మనసు ఆవేదన చెందినది. అన్ని సౌకర్యాలతో కనీస మైనటువంటి గృహ సౌకర్యం ప్రతి వ్యక్తికి తప్పకుండా ఉండాలి అని సగటు వ్యక్తిగా కోరుకున్న నేను నా కల నిజం కాకూడదు, క్షేత్ర పర్యటనలో ఇలాంటి సన్నివేశాలు సంఘటనలు కనిపించకూడదు అనుకున్నాను. "మానవాభివృద్ధి అంటే కూడు, గూడు, గుడ్డ, విద్యుత్, రహదారులు, విద్యా, వైద్యము, తాగునీరు వంటి కనీస సౌకర్యాలు ప్రజల ప్రజలందరికీ ఉన్నప్పుడు మాత్రమే మానవాభివృద్ధి అని కొంతవరకైనా అనడానికి ఆస్కారం ఉంటుందని ప్రముఖ ఆర్థికవేత్త నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్ చేసిన సూచన 78 ఏళ్ల తర్వాత కూడా ఈ దేశంలో అమలుకు నోచుకోకపోవడం విడ్డూరం విచారకరం" .రాష్ట్రాలతో సహా కేంద్ర ప్రభుత్వం కూడా ఎక్కడికక్కడ ప్రతి 10 ఏళ్లకోసారి గృహ గణన చేస్తున్నప్పటికీ ఆ రకమైనటువంటి గణాంకాలు ప్రభుత్వం దగ్గర ఉన్నా కూడా ఇల్లు లేనటువంటి వాళ్ల గురించి పట్టించుకున్న దాఖలా లేదు. కేవలం ఏటా కోట్ల ఇండ్లను నిర్మిస్తామని ప్రకటనలతోనే సరిపోతుంది కానీ ఆచరణలో సంచార జీవులతో పాటు ఊర్లలో ఉండే వాళ్లకు ముఖ్యంగా పట్టణాలలో లక్షలాదిమందికి ఇప్పటికీ ఇల్లు లేక కిరాయికి జీవిస్తున్నారు. కొన్ని కాలనీలలోనైతే సామూహికంగా జీవించడం, ప్రత్యేక రూములు లేకపోవడం, ప్రత్యేకమైన మరుగుదొడ్లు మూత్రశాలలు స్థానపు గదులు లేకపోవడంతో వాళ్ళు వీధిన పడుతున్న సంగతిని కూడా మనం అంచనా వేయాలి. సభ్య సమాజం తలదించుకునే దయనీయ పరిస్థితులు ఇప్పటికీ కొనసాగడాన్ని ముక్తకంఠంతో ఖండించవలసినటువంటి అవసరం ఉంది.

ప్రతి పదేళ్లకోసారి జరిగే గృహ గణన 2020లో జరగవలసిఉండగా ఐదేళ్లయిన ఇప్పటికీ జరగలేదు దానికి అనుబంధంగా జన గణన కూడా నీటి మూటగానే మిగిలిపోయింది. ప్రతి పదేళ్లకోసారి జరిగే గృహ గణనలో ఎన్ని కుటుంబాలకు సొంత ఇల్లు లేవు అనే విషయాన్ని పాలకులు గమనించవచ్చు, సర్వే సందర్భంగా కిరాయి ఇళ్లలో ఉన్న వారి యొక్క డా టాను సమకూర్చుకొని కుటుంబ సభ్యులందరికీ వేరువేరుగా సముచిత రీతిలో ఉండాల్సినటువంటి గృహాల కోసం పకడ్బందీగా ప్రణాళికలు అంచనాలు వేసి బడ్జెట్లో నిధులను కేటాయించడం ద్వారా గృహ వసతిని కల్పిస్తే ఆ కుటుంబాలు గౌరవంగా జీవిస్తాయి. అరగుంట ఇళ్ల స్థలాల కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ముఖ్య మంత్రిగా ఉన్న కాలంలో కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో కొనసాగినటువంటి పోరాటం పైన పోలీసులు చేసిన మారణకాండ అంతా ఇంతా కాదు. కేవలం అరగుంట స్థలం కోసం ఆశపడితే ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చినపుడు పాలకులకు ప్రజలను రక్షించాలి వాళ్ళ కనీస అవసరాలు తీర్చాలి అన్న జ్ఞానం ఉన్నదని అంగీకరిద్దామా? ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం తనకు తానే లక్షల సంఖ్యలో గృహాలు నిర్మిస్తామని ప్రకటిస్తూ ఉంటే ఎక్కడికి అక్కడ రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రకటిస్తున్నాయి కానీ ఇప్పటికీ ఇల్లు లేకుండా బజార్లలో రోడ్లమీద మురుగు కాలువల పక్కన మురికి కూపాలలో ప్రజలు ఎందుకు జీవిస్తున్నారు? ప్రభుత్వాలు సమాధానం చెప్పాలి. ఇలాంటి పరిస్థితుల పైన సర్వోన్నత న్యాయస్థానం కూడా సుమోటోగా స్వీకరించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించడం ద్వారా మానవాభివృద్ధికి ఉన్నటువంటి కనీసమైన నిర్వచనాన్ని కాపాడడానికి కృషి చేయాలని మనసారా కోరుకుందాం. "ఎన్నికల ద్వారా ఎన్నుకోబడుతున్నటువంటి స్థానిక సంస్థల ప్రతినిధులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, పార్లమెంటు సభ్యులు వాళ్ల వాళ్ల నియోజకవర్గాల వారీగా గృహాల అవసరం దయనీయస్థితిలో జీవిస్తున్న వాళ్ల గణాంకాలను ప్రభుత్వం దృష్టికి చట్టసభల్లో తేవచ్చు కదా! కానీ ఎన్నికైన తర్వాత తిరిగి మళ్లీ ఎన్నికల్లో గెలవడం కోసం కోట్ల రూపాయలు దండుకోవడానికి, గత ఎన్నికల్లో చేసిన ఖర్చును కూడబెట్టడానికి కూడా వాళ్లకు తీరిక లేకుండా ఉన్నది. అలాంటప్పుడు పేద ప్రజల యొక్క మానప్రాణాలు, కూడు గూడు గుడ్డ, విద్య వైద్యం వంటి కనీస అవసరాలు, ఆత్మగౌరవంతో జీవించగలిగినటువంటి నాగరిక సమాజం గూర్చి ఆలోచిస్తారని నమ్ముదామా? మరి నమ్మకపోతే ఈ వ్యవస్థ ఇలాగే కొనసాగనిద్దామా? ప్రజాప్రతినిధులు, స్థానిక సంస్థల ప్రతినిధులపై ప్రజలు ఎన్నికల సందర్భంలోనూ ఇతరత్రా తమ నిరసన ప్రతిఘటన ప్రశ్న కొనసాగించవలసివుంది. ఆయా పేద కుటుంబాల యొక్క ఆర్థిక స్థితిగతులను మార్చుకోవడం కోసం గౌరవంగా జీవించగలిగే మానవాభివృద్ధి ప్రతి కుటుంబానికి అందేవరకు పోరాటం తప్పనిసరి." నిజ జీవితంలో కాదు కలలో కూడా అలాంటి కష్టతరమైనటువంటి ఇల్లు లేనటువంటి కటిక దరిద్రంతో అనుభవిస్తున్నటువంటి కనీస సౌకర్యాలు లేని సామూహిక జీవితం గడుపుతున్నటువంటి గృహాలు గృహ సముదాయాలు వాతావ రణం కనిపించకూడదని కోరుకుందాం. ఈ రకంగా కలగంటే మాత్రమే సరిపోదు పాలకులు తమ బాధ్యతను గుర్తించాలి,ప్రజలు తమ పోరాటాన్ని ఉధృతం చేయాలి, నిజ జీవితంలో తమ సౌకర్యాలను కొట్లాడి సాధిం చుకోవాలి, ఆ మార్గంలో కృషి జరగాలని మనసారా కోరు కుందాం. మన తోటి వాళ్లు కూడా మనలాగే ఆత్మగౌరవంతో జీవించాలని ఆశిద్దాం.



డాక్టర్. రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

## పరిశోధన పరమేశ్వరుడు
# బిరుదురాజు రామరాజు




అది 1994వ సంవత్సరం ఫిబ్రవరి 28వ తేదీ. పాలకుర్తిలో తెలుగు విశ్వవిద్యాలయం తరపున పాల్కురికి సోమనాథుని అష్టశత జయంతి ఉత్సవాలు జరుగుతున్నాయి. ఆచార్య పేర్వారం జగన్నాథం గారు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు. ఆ మహా సాహితీ సదస్సు ప్రారంభోత్సవానికి జాతీయ ఆచార్యులు, పండిత పరిశోధకులు, తెలంగాణ వైతాళికులు ఆచార్య బిరుదురాజు రామరాజు ముఖ్య అతిథిగా విచ్చేశారు. పాలకుర్తి పాఠశాల నుంచి దేవస్థాన ప్రాంగణం వరకు కవి పండితుల కవాతు. సామాన్య జన సమూహంలోనే కాదు సాహితీ శిఖరాయమానంగా గోచరించారు రామరాజు. ఆచార్య బి.రామరాజు గారు తేదీ 16- 4-1925 న వరంగల్ జిల్లా దేవునూరు అనే గ్రామంలో జన్మించారు. ఇంటర్ వరకు హన్మకొండ లోను ఆ తర్వాత ఉన్నత చదువుల కోసం హైదరాబాదుకు చేరుకొని నిజాం కళాశాలలో డిగ్రీని ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎమ్మె తెలుగును పూర్తి చేశారు. అప్పటివరకు జన సాహిత్యం గానే మిగిలి పండితాదరణకు దూరమై కేవలం లొల్లాయి పాటలుగా భావింపబడే జానపద గేయ సాహిత్యాన్ని మథించాలని తపించి తొలిసారిగా పరిశోధనకు పూనుకొని డాక్టరేట్ డిగ్రీని సాధించిన పరిశోధకులు రామరాజు గారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆనాడు వారు నాటిన ఆ పరిశోధన బీజం నేడు శాఖోప శాఖలుగా విస్తరించి వివిధ విశ్వవిద్యాలయాలకు పందిళ్లు పరిచింది. వారు నడిచిన దారి ఇవాళ జాతీయ రహదారిగా మారింది.

రామరాజు గారు పరిశోధకులుగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలను సందర్శించి వందల కొలది జానపద గేయాలను, తాళపత్ర గ్రంథాలను, అముద్రిత తెలుగు సంస్కృత రచనలను, శాసనాలను వెలికి తీసి ప్రచురించారు. ఈ విషయాన్ని గురించి పరిణత వాణిలో చెబుతూ "తాళపత్రాల కోసం ఒక వేసవిలో కరీంనగర్ జిల్లా ఎల్లారెడ్డిపేటకు నడిచిపోయాను. ఎండ తీవ్రతకు తట్టుకోలేక సొమ్మసిల్లి ఊరి బయట కొట్టం వద్ద మూర్ఛ పోయినాను. ఆ కొట్టం యజమాని నాకు మంచి నీళ్లు పాలు ఇచ్చినాడు". అన్న వారి మాటలు పరిశోధన ఆయనకు ప్రాణం అన్న విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.కాళిదాసు వంటి మహాకవుల సంస్కృత కావ్యాలకు వ్యాఖ్యానం రాసిన పండితులు మల్లినాథసూరి వారి ఘంటాలను సేకరించి జాతికి అందించిన మహనీయులు. అలాగే శ్రీనాథుడు రాసిన శివరాత్రి మహాత్యంల్లోని పంచమాశ్వాసాన్ని సేకరించి పరిష్కరించారు. రామరాజు గారు ఇప్పటివరకు రచించిన చరిత్రకెక్కని చరితార్థులు, మరుగున పడిన మాణిక్యాలు, తెలుగు సాహిత్యోద్ధారకులు, ఉర్దూ తెలుగు నిఘంటువు తెలుగు, వీరుడు, సంపాదకత్వం వహించిన త్రివేణి వ్యాస సంపుటి మొదలైనవన్నీ మన తెలుగు భాషా సాహిత్యాలను పరిశోధన దృక్పథాన్ని విస్తృతపరిచాయి. అన్నింటికీ మించి ఆరు సంపుటాలుగా వారు వెలువరించిన ఆంధ్ర యోగులు అనే గ్రంథం నాన్యతో దర్శనం. వారు సేకరించిన శేష భాగాన్ని మరో సంపుటిగా వెలువరించాల్సిన అవసరం ఉంది. 1976 నుంచి పుట్టపర్తి సాయిబాబా తో వారికి కలిగిన పరిచయం, ప్రభావం కారణంగా రామరాజు గారు అనేక ధార్మిక గ్రంథాలను వెలువరించారు. ఇవి వారి ఆధ్యాత్మిక తత్వానికి మచ్చుతునకలని చెప్పవచ్చు. తెలంగాణ రచయితల సంఘం, శ్రీకృష్ణదేవరాయ ఆంధ్ర భాషా నిలయం కార్యదర్శిగా,ఆంధ్ర సారస్వత పరిషత్తు ఉపాధ్యక్షులుగా పలు సంస్థలలో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆచార్యులుగా, అధ్యక్షులుగా అన్నింటికీ మించి జానపదాన్ని జ్ఞానపథం గా మార్చిన కార్యశీలి ప్రతిభాశాలి. తేదీ 8-02-2010 న ఆయన కన్నుమూసారు. రామరాజు గారి శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఈ నెలలో రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలు, సాహిత్య అకాడమీ స్వచ్ఛంద సాంస్కృతిక సంస్థలు, సదస్సులను నిర్వహించాయి. కంచి విజయలక్ష్మి గారు డాక్టర్ బి.రామరాజు జీవితం రచనలపై పరిశోధన చేసి డాక్టరేట్ డిగ్రీ ని అందుకున్నారు. ముఖ్యంగా వారి సాహిత్య వ్యక్తిత్వాన్ని గురించి ఇటీవల ప్రత్యేక నివాళి సంచిక వెలువడింది. వారి స్మృతి స్ఫూర్తిగా నిలిచేందుకు పరిశోధన రంగంలో విశేష కృషి చేసేవారికి ప్రభుత్వం ఏటా వారి స్మారకంగా పురస్కారాన్ని అందించాలని,వారి రచనల్ని పునర్ ముద్రించాలని కోరుకుంటున్నాను. ఇది వారి శతజయంతికి తగిన నివాళిగా భావిస్తున్నాను.



డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్
9989148305

# ప్రశ్నించే గొంతుక రాహుల్ గాంధీపై బీజేపీ రాజకీయ కుట్ర


**• నరేంద్ర మోడీ, అమిత్ షా దిష్టిబొమ్మ దగ్ధం**

**తలకొండపల్లి, ఏప్రిల్ 20 (జనంసాక్షి) :** నేషనల్ హెరాల్డ్ కేసులో ఏఐసీసీ నాయకులైన కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ, రాహుల్ గాంధీలపై బిజెపి కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ దాఖలు చేసిన చార్జి సీటును ఖండిస్తూ..తలకొండపల్లి మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ తాలూకా ప్రధాన కార్యదర్శి కాటిక నరేష్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ,హెూం శాఖ మాత్యులు అమిత్ షా,ల దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా కాటిక నరేష్ మాట్లాడుతూ..నేషనల్ హెరాల్డ్ కేసులో మా నాయకులైన సోనియా గాంధీ,రాహుల్ గాంధీ లపై ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టర్ చేసిన ఛార్జ్ సీటును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.ఈ దేశం కోసం త్యాగాలు చేసి ప్రజల కోసం పోరాడిన కుటుంబ నేపథ్యమున్న రాహుల్ గాంధీ,సోనియా గాంధీ,లపై మోడీ



రాజకీయంగా ఎదుర్కోలేక ప్రజలు అడిగే అసలైన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వలేక ఈ తరహా కుట్రలకు పాల్పడుతున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీ లోకసభ ప్రతిపక్ష నేతగా దేశ ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తూ బిజెపి ప్రభుత్వ వైఫల్యాలను బహిర్గతం చేస్తున్నందుకు ఈ అక్రమ కేసులతో వారిని లక్ష్యంగా చేస్తున్నారన్నారు. ఈ చర్యలు కేవలం కాంగ్రెస్ పార్టీపై దాడి మాత్రమే కాదు భారత ప్రజాస్వామ్యం మరియు రాజ్యాంగ సంస్థలపై దాడిగా పరిగణిస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులందరూ ఈడీ కార్యాలయాల వద్ద నిరసనలు చేపట్టి, ఈ రాజకీయ కుట్రను బహిర్గతం చేస్తామన్నారు.కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్న బిజెపి పార్టీని చట్టపరంగానే ఎదుర్కొని రాజకీయ కుట్రను బహిర్గతం చేస్తామని వాపోయారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజీమ్,తలకొండపల్లి పట్టణ అధ్యక్షులు రమేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు శివ, మండల ఉపాధ్యక్షులు రమేష్ నాయక్, ప్రధాన కార్యదర్శి రాజేందర్,యువజన కాంగ్రెస్ నాయకులు శ్రీను, సురేష్, పురుషోత్తం, అంజి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# పీహెచ్‌డీ కోర్సు వర్క్ పరీక్ష తేదీల ఖరారు



**ఓయూ, ఏప్రిల్ 20 (జనం సాక్షి) :** ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పీహెచీ కోర్స్ వర్క్ (ప్రీ పీహెచ్డీ) పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ తెలిపారు. ప్రీ పీహెచ్డ్ రెగ్యులర్, బ్యాక్ లాగ్ పరీక్షలను ఈనెల 28వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్ సైట్లో చూసుకోవాలని సూచించారు.

# జిల్లాలో ఘనంగా ఈస్టర్ వేడుకలు

**• ప్రత్యేక ప్రార్ధనలు చేసిన బేతేలు సంఘు కాపరి ధీరజ్ డేనియల్**

**మోమిన్‌పేట, ఏప్రిల్ 20 (జనం సాక్షి) :** జిల్లాలో ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు ఆదివారం నాడు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో భాగంగా జిల్లాలోని పలు చర్చిలలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించి క్రీస్తును ఆరాధించారు. వాక్యోపదేశాలు, బైబిల్ సూక్తులు విన్నారు. ముఖ్యంగా జిల్లాలో ప్రధాన చర్చిలలో జరిగిన ఏసు పునరుత్థాన కార్యక్రమంలో పాస్టర్లు పాల్గొని ప్రత్యేక ప్రార్ధనలు చేసి క్రైస్తవులకు దైవ సందేశం ఇచ్చారు. అనంతరం ఒకరినొకరు ఈస్టర్ పర్వదినం శు భాకాంక్షలు తెలుపుకున్నారు. వికారాబాద్ పట్టణంలోని బేతేలు నగర్ లో బేతేలు ప్రార్ధన మందిరంలో పాస్టర్ ధీరజ్ డానియల్ ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. నిన్ను వలె నీ పొరుగు వానిని ప్రేమించుము అనే ఏసుక్రీస్తు సూక్తిని ఆయన వివరించారు. లోక రక్షకుడు, మన పాపాలను తన రక్తంతో కడిగారని , ఆ ఏసుప్రభు మరణించాక సమాధి చేసిన మూడు రోజుల అనంతరం మళ్లీ తిరిగి లేచాడని వివరించారు. దయామయుడు చల్లని చూపు ప్రజలపై ఉండాలని ప్రార్థించారు.మరణాన్ని జయించి తిరిగి సజీవుడైన దేవుడు,



యుగయుగాలకు యేసయ్య సజీవుడై ఉంటాడన్నారు. క్రీస్తు సమాధి లో నుంచి లేచి వచ్చిన శుభవేళనే ఈస్టర్ పండుగగా జరుపుకుంటున్నామన్నారు. క్రీస్తు మన కోసం మరణి తిరిగి లేచాడన్నారు. ఆయన శాంతి, ప్రేమ, క్షమాపణ, కరుణ గుణాలను అనుసరిస్తూ వాటిని పాటిస్తూ సమాజంలో క్రీస్తును పోలి నడుచుకోవాలన్నారు. ప్రార్ధనలకు హాజరైన మహిళలు యువతలు సంఘ పెద్దలు అందరూ భక్తి గీతాలు ఆలపించి యేసయ్యను స్తుతించారు. ఈస్టర్ అనంతరం చర్చిలలో ప్రేమ విందు ఏర్పాటు చేశారు.

# వరంగల్ సభను జయప్రదం చేయండి

**• మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ రమేశ్ గౌడ్**

**వనపర్తి, ఏప్రిల్ 20 (జనంసాక్షి) :** ఈ నెల 27వ తేదీన వరంగల్ జిల్లాలో జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్, ఆ పార్టీ పట్టణ అద్యక్షుడు పలుస రమేశ్ గౌడ్ పిలుపునిచ్చారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆదేశానుసారం వనపర్తి పట్టణంలోని టిఆర్ఎస్ పట్టణ పార్టీ అధ్యక్షులు పలుస రమేష్ గౌడ్ గారి అధ్యక్షతన 5,17,18,19, 20, 21వ వార్డు బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతలతో సన్నాహక సమావేశం జరిగింది. ఈనెల 27 వ తారీఖు నాడు చలో వరంగల్ బి,ఆర్,ఎస్ పార్టీ రజాతోత్సవ కార్యక్రమానికి టిఆర్ఎస్ పార్టీ వార్డు అధ్యక్ష కార్యదర్శులు కార్యవర్గం, టిఆర్ఎస్ పార్టీ ఉద్యమ నాయకులు, టిఆర్ఎస్ పార్టీ అభిమానులు టిఆర్ఎస్ పార్టీ కళాకారులు ముఖ్య కార్యకర్తలు కార్యకర్తలందరు అందరూ భారీగా తరలిరావాలని రమేశ్ గౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ మాజీ కౌన్సిలర్లు కాగితాల లక్ష్మీనారాయణ, బండారు కృష్ణ,పెండెం నాగన్న యాదవ్,నాయకులు గంధం పరంజ్యోతి, సదుర్ల రమేష్ బాబు, రమేష్ నాయక్, సూర్యవంశం గిరి, జోయెబ్,డి దానేలు,సూగురు మురళి సాగర్,ప్యాట



తిరుపతయ్య, గంధం విజయ్, మంద రాము,గొర్ల ప్రేమ్, మౌలాలి యాదవ్, డి వెంకట్, రవి, డి మద్దిలేటి,డి నరసింహ, రాజు నాయక్,రామకృష్ణ, సూగూరు లక్ష్మయ్య, నవాజ్, రాజు అక్తర్ పాల్గొన్నారు.

## జిల్లా న్యాయమూర్తి సేవలు ప్రశంసనీయం



**మెదక్ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 20 (జనం సాక్షి) :** జిల్లా న్యాయమూర్తి సేవలు ప్రశంసనీయమని జిల్లా ఎస్పీ డి ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, మెదక్ పి. లక్ష్మి శారద బదిలీపై వెళ్తున్న సందర్భంగా మెదక్ జిల్లా న్యాయశాఖ ఉద్యోగులు మెదక్ జిల్లా ప్రధాన న్యాయమూర్తికి మెదక్ పట్టణంలోని మాయా గార్డెన్స్‌లో ఆత్మీయ సన్మాన సభ ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. లక్ష్మీ శారద సభను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం న్యాయశాఖ ఉద్యోగులు, ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద మెదక్ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా అందించిన సేవలు, చేసిన కృషిని అభినందించారు. మెదక్ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఉదయ్ కుమార్ రెడ్డి ఈ వీడ్కోలు సభలో పాల్గొని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, మెదక్ పి. లక్ష్మి శారద సేవలను కొనియాడారు. అనంతరం మెదక్ జిల్లా న్యాయశాఖ ఉద్యోగులు, జిల్లా ప్రధానన్యాయమూర్తి, మెదక్ పి. లక్ష్మీశారద ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జిడ్జి, మెదక్ సిరి సౌజన్య బీ స్పెషల్ మొబైల్ మెజిస్ట్రేట్, మెదక్ నాయి ప్రభాకర్, మెదక్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కూతురి అలేఖ్య రెడ్డి వివాహ వేడుకలు



**కాప్రా, ఏప్రిల్ 20 (జనంసాక్షి) :** ఆదివారం హైటెక్స్ కన్వెన్షన్ లో ఘనంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకలకు స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు ,మాజీ మంత్రులు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మాజీ ఎమ్మెల్యే లు, మాజీ ఎమ్మెల్సీలు హాజరై నూతన వధువులను ఆశీర్వదించారు.

## అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన పెంచుకోవాలి

**• స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రవీందర్ రెడ్డి**

**చేవెళ్ల, ఏప్రిల్ 20 (జనంసాక్షి) :** ప్రతి ఒక్కరు అగ్ని ప్రమాదాల నివారణ పై అవగాహన పెంచుకోవాలని అగ్నిమాపక కేంద్రం స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రవీందర్ రెడ్డి అన్నారు. స్థానిక అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా అగ్నిమాపక కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ...ఇంటిలో పని ప్రదేశాలలో, విద్యాలయాలలో అగ్నిప్రమాదాలు జరగకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇంటిలో గ్యాస్ వినియోగంపై జాగ్రత్తలు పాటించాలన్నారు. గ్యాస్ వల్ల అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు మంటలను ఆర్పటంలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాల



నివారణపై కరపత్రాలను పంపిణీ చేశారు. అగ్ని ప్రమాదం ప్రాథమిక దశలో ఉన్నప్పుడు సమయ స్ఫూర్తితో వివారించి వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచార అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్ కుమార్, సాయిలు, యూసుఫ్, సురేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

## తాండూరు నుంచి అంతర్ రాష్ట్ర సర్వీసులు






**• బీదర్, యాద్గార్‌లకు రవాణా సౌలభ్యం**
**• ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**

**తాండూరు, ఏప్రిల్ 20 (జనంసాక్షి) :** తాండూరు ఆర్టీసీ డీపో నుంచి అంతర్ రాష్ట్ర సర్వీసులు ప్రారంభించేందుకు కృషి చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ పేర్కొన్నారు. శనివారం తాండూరు ఆర్టీసీ డీపోను ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సందర్శించారు.తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు సేవలపై ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి డీపో మేనేజర్ సురేష్ కుమార్ తో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీపో మేనేజర్ తాండూరు ఆర్టీసీ డీపో నుంచి తాండూరు బీదర్, తాండూరు యాద్దీర్ సర్వీసులు కల్పించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. దీంతో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి వెంటనే రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు ఫోన్ చేసి మాట్లాడారు.డీపో మేనేజర్ దృష్టికి తెచ్చిన అంశాలతో పాటు తాండూరు నుంచి అంతర్ రాష్ట్ర సర్వీసులు ప్రారంభించేలా చొరవ చూపాలని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించడంతో తాండూరు నుంచి అంతర్ రాష్ట్ర సర్వీసులు ప్రారంభించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పోరేషన్ చైర్ పర్సన్ కల్వ సుజాత, ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది

**• మాజీ మున్సిపల్ చైర్మెన్ వాకిటి శ్రీధర్**



**వనపర్తి, ఏప్రిల్ 20 (జనంసాక్షి) :** ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనదని, సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్ ఉద్బోధించారు. శ్రీరంగపూర్ జెడ్పిహెచ్ ఎస్ లో ప్రధాన ఉపాధ్యాయుడిగా పని చేసి పదవి విరమణ పొందిన విష్ణు వర్ధన్ రెడ్డి దంపతులను మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సన్మానించారు.ఈ సందర్భంగా వాకిటి శ్రీధర్ మాట్లాడుతూ విష్ణువర్ధన్ రెడ్డి ఉపాధ్యాయ వృత్తికి గౌరవం తెచ్చారని కొనియాడారు. అనేక మంది విద్యార్థులను ఉన్నతంగా ఎదిగేందుకు దోహదపడ్డాడని కొనియాడారు.ఆయనను ఇతర ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలని కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్ గౌడ్,టీచర్లు చంద్రశేఖర్, శ్రీనివాస్ రావు యెసప్, జయంతరెడ్డి, నంది హిల్స్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

## టిప్పర్ ఢీకొనడంతో ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతి

**• నుజ్జునుజ్జు అయిన ఆటో**



**మహమ్మదాబాద్, ఏప్రిల్ 20 (జనంసాక్షి) :** మండలపరిధిలో నంచల్ల క్రాస్ రోడ్డు సమీపంలో ఎదురుగా వెళ్తున్న ఆటో టిప్పర్ను ఢీకొనడంతో ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మహమ్మదాబాద్ మండలంలో చోటుచేసుకుంది.స్థానికులు వివరాలు తెలిపిన ప్రకారం హన్వాడ మండల పరిధిలోని షేక్పల్లి ఎల్లంబాయి తండాకు చెందిన సునీల్ 20 ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు ఇదే తరుణంలో ఆదివారం షేక్పల్లి నుండి మహమ్మదాబాద్ వైఫ్ వెళ్తుండగా నంచల్లగేట్ సమీపంలో ఆటోవు టైర్ పగిలి ఎదురు వస్తున్నటిప్పర్ వైఫ్ వెళ్లడంతో టిప్పర్ ఢీకొనడంతో గాయాల పాలయ్యాడు స్థానికులు గుర్తించి మహబూబ్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.కుటుంబీకులు తల్లి మంగమ్మ ఇచ్చిన ప్రతి మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శేఖర్ రెడ్డి తెలిపారు.

# అంబేద్కర్ రాజ్యాంగం ద్వారానే అన్ని వర్గాలకు సమాన ఫలాలు



**మోమిన్‌పేట, ఏప్రిల్ 20 (జనం సాక్షి) :** బిఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ద్వారానే పేద బడుగు బలహీన వర్గాలకు సమాన హక్కులు లభించి దేశ ప్రపంచంలోనే అభివృద్ధి దిశగా పయనిస్తున్నారని తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పేర్కొన్నారు ఆదివారం మండల పరిధిలోని సయ్యద్ అలీపూర్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ నిర్వహించారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ద్వారానే దేశంలో పరిపాలన నడుస్తుందని వారు పేర్కొన్నారు అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ద్వారానే కుల వివక్ష అంటరానితనం అన్ని పారదోలి అన్ని వర్గాల ప్రజలకు సరైన మేలు జరుగుతుంది అన్నారు ఈ కార్యక్రమంలో మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వైమహేందర్ రెడ్డి నాయకులు కొండల్ రెడ్డి సురేందర్ సుభాష్ గౌడ్ మహంత్ స్వామి ఏ జాజ్ పటేల్ చంద్రన్న ఎస్సీ సెల్ కృష్ణ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు జైపాల్ యూత్ అధ్యక్షులు సుభాష్ ఆయా గ్రామాల అంబేద్కర్ యువజన సంఘాలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులు క్రమశిక్షణతో మెలగాలి

**• ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి**

**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 20 (జనంసాక్షి) :** జర్నలిస్టులు క్రమశిక్షణతో మెలగాలని,తమకంటు తగిన గౌరవాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు.కొల్లాపూర్ మండలం సోమశిలలో జరిగే టియుడబ్ల్యుజె (ఐజెయు) రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యేందుకు జాతీయ నాయకులు దేవులపల్లి అమర్,టియుడబ్లూజె రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలి, రాష్ట్ర కార్యదర్శి రాంనారాయణ లతో పాటు వెళు_ఒడగా ఆదివారం సాయంత్రం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో యూనియన్ నాయకులు ఆహ్వానం పలికి శాలువాలు కప్పి,బొకేలతో సన్మానించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తగిన తీసుకుంటామన్నారు.త్వరలో జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్లస్థలాలు, అక్రిడేషన్లు మంజూరుకై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. మారిన కాలానుగుణంగా జర్నలిస్టులు వృత్తిపరమైన శిక్షణలో మెళకువలతో పాటుగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పై శిక్షణ ఇస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు, సుదర్శన్ రెడ్డి,పలుస విజయ్ కుమార్, కర్నయ్య, కంది కొండ మోహన్, వెంకటస్వామి,హకిం కిషోర్, మాధవరెడ్డి,కంచర్ల శ్యాంసుందర్, దస్తగిరి,నాగర్ కర్నూల్ తాలూకా అధ్యక్ష కార్యదర్శులు సందు యాదగిరి, సాయిలు, నాయకులు అల్లంపల్లి రమేష్,దర్వేష్, విజయ్,ముబీన్ ఖాన్, రాంప్రకాష్,వినయ్,ప్రసాద్, మస్కూరిబంగారయ్య, మిద్దె బంగారయ్య,పందిరి శ్రీధర్,వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# మెదక్ ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలి

• మాజీ ఎమ్మెల్యే యం. పద్మ దేవేందర్ రెడ్డి



**మెదక్ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 20 (జనం సాక్షి) :** ఈ నెల 17న మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ అతని కేసు నమోదు చేయాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ , ఎమ్మెల్సి శేరీ సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జ్ కంఠరెడ్డి తిరుపతిరెడ్డి బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు మెదక్ ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డినీ కలిసి పిర్యాదు చేశారు..అనంతరం బిఅర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.మెదక్ ప్రజల గౌరవాన్ని పెంచే విధంగా ఎమ్మెల్యే ప్రవర్తన ఉండాలీ కాని దిగజర్చే విధంగా ఉండొద్దన్నారు.14 సంవత్సరాల పోరాటం చేసి తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేర్చిన కేసీఆర్ మీద అనుచిత వ్యాఖ్యలు చేసిన మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.. ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మెదక్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాల్సిన ఎమ్మెల్యే ఎదుటివారి మనోభావాలు దెబ్బతీసే విధంగా కుట్రపూరితంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టాలు చేసి ఎమ్మెల్యేనే అలాంటి వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. సమాజానికి ఏమి మెసేజ్ పంపుతున్నారని ధ్వజమెత్తారు...పద్ధతి మార్చుకొని మెదక్ ను అభివృద్ధి చేయాలని కోరారు.మెదక్ నియోజకవర్గన్నీ అభివృద్ధి చేస్తామని ఎన్నో హామీలు ఇచ్చారనీ వాటిని నెరవేర్చి మెదక్ ను అభివృద్ధి పథంలో నడిపించాలనీ డిమాండ్ చేశారు. అలాగే ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారెంటీలను అమలుపరచాలని డిమాండ్ చేశారు.ఎన్నికల సందర్భంగా రకరకాల హామీలు ఇచ్చి కుట్రపూరితంగా మాట్లాడి ఇక్కడ ప్రజలతో ఓట్లు వేయించుకొని ఇక్కడి ప్రజలను మోసం చేశారన్నారు. ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ రామయంపేటలో బిఅర్ఎస్ పార్టీ శ్రేణులు ఫిర్యాదు చేస్తే ఇది మా పరిధిలోకి రాదంటూ ఆ ఫిర్యాదును రిజెక్ట్ చేయడం జరిగింది అన్నారు...అలాంటప్పుడు బిఅర్ఎస్ పార్టీ కార్యకర్త రవీందర్ రెడ్డి నీ పోలీసు స్టేషన్ తీసుకువచ్చి కొట్టి అతని ఫోన్ సీజ్ చేశారు ఇది ఎక్కడి న్యాయం అన్నారు. పోలీసులు ఈ కొట్టుడు సంస్కృతి ఏందన్నారు. తప్పు చేస్తే కేసు నమోదు చేయాలన్నారు. కానీ పోలీసుల పనితీరు ప్రభుత్వానికి ఒక న్యాయం ప్రతిపక్షాలకు ఒక న్యాయంల ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో చట్టం అందరికీ సమానమే అన్నారు..కానీ పోలీసుల తీరు ప్రజాస్వామయుతంగా లేదన్నారు. పోలీసు చర్యల ద్వారా బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను భయపడితే ఉపేక్షించేది లేదు అన్నారు. బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టీ కేసులు పెడితే మొదటగ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మీద అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే మీద కేసు నమోదైన తర్వాత మా కార్యకర్తలను ముట్టుకోవాలన్నారు. మొదట మాట్లాడింది ఎమ్మెల్యే అని గుర్తు చేశారు. అతనిపైన చర్యలు తీసుకున్న తర్వాతనే కార్యకర్తలకు పైన చర్యలు తీసుకోవాలన్నారు. బిఆర్ఎస్ పార్టీకి జోలికి వస్తే ఊరుకునేది లేదు అన్నారు. ఒక్కసారి కేసీఆర్ పిలిపిస్తే వేలాదిగా కార్యకర్తలు తరలివస్తారన్నారు. మూడున్నర సంవత్సరాల పదవి కాలం ఉందని ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చి వాళ్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి ఒక న్యాయం ప్రతిపక్షాలకు ఒక న్యాయమని డిమాండ్ చేశారు..సిద్ధాంతపరంగా విమర్శలు చేసుకోవాలీ కాని ఇలా మాట్లాడటం సరికాదన్నారు. ఎమ్మెల్యే చేసిన అనుచిత వ్యాఖ్యలు చాలామంది ట్రోల్ చేశారని వాళ్లపైన ఎందుకు కేసు పెట్టలేదన్నారు. మంచినీళ్ల కోసం, కరెంటుకోసం రైతు భరోసాకోసం రాక రైతుల అవస్థలు పడుతున్నారు వాళ్ల గురించి ఆలోచించాలన్నారు. మెదక్ లో ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో వాళ్ల సమస్యలు ఎవరికి చెప్పాలో తెలియక మెదక్ నియోజకవర్గ ప్రజలు అవస్థలు పడుతున్నారనీ తెలిపారు. అలాంటిదితెలంగాణ గుండెలో నిలిచిన వ్యక్తి కేసీఆర్ మీద అనుచిత వ్యాఖ్యలు చేస్తావా మిమ్మల్ని ఇందుకేనా ఇక్కడ ప్రజలు గెలిపించింది విమర్శించారు. ఈ సమావేశంలో మాజీ జిల్లా పరిషత్ అధ్యక్షురాలు ఏం లావణ్య రెడ్డి, మెదక్ మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు కిష్టయ్య, గౌస్, ప్రభు రెడ్డి,మాజీ సర్పంచ్లు లింగం. మేకల సాయిలు. యామ్ రెడ్డి. మైపాల్ రెడ్డి. మోహన్ నాయక్. ఎలక్షన్ రెడ్డి. గంజి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతితో భూములకు భరోసా

• అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**కౌడిపల్లి, ఏప్రిల్ 20 (జనంసాక్షి) :** మెదక్ జిల్లా కౌడిపల్లి మండల కేంద్రంలో భూభారతి నూతన చట్టంపై రైతులకు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులలో కలెక్టర్ పాల్గొని, భూభారతి చట్టంపై, అందులోని అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిషాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టంతో భూములకు భరోసా లభిస్తుందని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. భూభారతి చట్టం గురించి క్షుణ్ణంగా వివరిస్తూ కొత్త ఆర్ ఓ ఆర్ చట్టం విధి విధానాలను రైతులకు తెలియజేశారు. భూభారతి చట్టం– 2025పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. నూతన చట్టంలో భూ సమస్యలకు వెసులుబాటు పొందుపరచడం జరిగిందని అన్నారు. భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యలను స్థానిక రెవెన్యూ , ఆర్డిఓ, జిల్లా కలెక్టర్ సత్వరమే పరిష్కరించే అవకాశం ఉన్నందున ఈ చట్టంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. మ్యూటేషన్ ద్వారా వచ్చే సమస్యలను పరిష్కరించడం కోసం స్థానిక రెవెన్యూ అధికారులు దరఖాస్తు చేసుకున్న గ్రామాన్ని సందర్శించి వివరాలను పరిశీలించిన అనంతరం రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందని తెలిపారు. భూమి సర్వే నెంబర్, సరిహద్దులు, పూర్తి వివరాలు ఏర్పాటు చేసి ప్రతి భూమికి భూదార్ నెంబర్ ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. భూ భారతి లో హక్కుల రికార్డ్ లలో తప్పుల సవరణకు అవకాశం, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసేందుకు గాను ముందుగా భూముల సర్వే, మ్యాప్ తయారీ, గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ, భూ సమస్యల పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ, మొదలగునవి భూ భారతిలో కీలక అంశాలని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ చైర్మన్ చిలుమల సుహాసిని రెడ్డి, ఆర్డీవో మహిపాల్ రెడ్డి, తాసిల్దార్ ఆంజనేయులు, ఆయా శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు కాడెద్దులు మృతి



**మల్దకల్, ఏప్రిల్ 20 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం విఠలాపురం గ్రామపంచాయతీ శివారు గ్రామమైన చిప్పదొడ్డి గ్రామంలో ఆదివారం సాయంత్రం పిడుగు పడి మేడికొండ రామన్ గౌడ్ చెందిన కాడెద్దులు మృతి చెందాయి. వ్యవసాయ పొలంలో కాడెద్దులను కట్టేసి ఇంటికి వచ్చారు. ఉరుములు మెరుపులకు పిడుగుపాటుకు కాడెద్దులు మృతి చెందడంతో రైతు ఆందోళన చెందుతున్నారు.చంద్రన్న గౌడ్ చెందిన వ్యవసాయ పొలాన్ని రామన్ గౌడు కౌలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. కాడెద్దులు1,50,000కు ఇతరులకు అమ్మినట్లు గ్రామస్తులు తెలిపారు. కొనుగోలు చేసిన రైతులు కూడా కాడెద్దులను తీసుకువెళ్లకుండగా రామన్ గౌడ్ తోనే ఉంచడంతో పిడుగు పడి అకాల మరణం చెందాయి. ప్రభుత్వం పిడుగుపాటుకు మృతి చెందిన మూగజీవాలకు కూడా ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## పిడుగు పడి 25 గొర్రెలు మృతి



**రేవల్లి, ఏప్రిల్ 20 (జనంసాక్షి) :** గోపాల్ పేట్ మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన మాండ్ల విశ్వనాథం, చాకల్ పల్లి గ్రామానికి చెందిన బోయ రాములు గొర్రెలు అకాల వర్షం పడటం వలన, పిడుగు పడి 25 గొర్రెల్లు మృత్యువాత పడ్డాయి. గొర్రెల కాపరులకు గాయాలయ్యాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు.

## ధరణి వ్యవస్థకు ప్రత్యామ్నాయం భూభారతి

• జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**కొల్చారం, ఏప్రిల్ 20 (జనం సాక్షి) :** ధరణి వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం భూ భారతి చట్టం అమలు చేస్తుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. కొల్చారం మండలం రైతు వేదికలో భూభారతి చట్టంపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఆర్టీవో మహిపాల్ రెడ్డి మండల ప్రత్యేక అధికారి, జిల్లా విద్యాధికారి రాధా కిషన్ ప్రభుత్వ అధికారులు హాజరయ్యారు. తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు భూభారతి చట్టంపై కళా ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి భూభారతి చట్టం సందేశం రైతులకు వినిపించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి చట్టం ద్వారా సమస్యలు పరిష్కరించుకునే అవకాశం లభిస్తుందన్నారు. నూతన భూ చట్టం తో భూ సమస్యలు పరిష్కారం కాబోతున్నాయని రైతులు, భూ యజమానులు ఏవైనా సమస్యలు పరిష్కరించుకునే అవకాశం ధరణిలో లేదని, కానీ ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి చట్టంలో సమస్యలు, అభ్యంతరాలు తెలియజేసే అవకాశం కల్పించిందన్నారు. భూసమస్యల పరిష్కరించేందుకు రైతులు, ప్రజలు, మేధావుల అభిప్రాయాలు, సూచనలతో భూభారతి చట్టాన్ని ప్రభుత్వం రూపొందించిందన్నారు. రైతులు, భూ యజమానులు భూభారతి చట్టం ద్వారా తమ భూ సమస్యలు పరిష్కరించుకోవాలని అన్నారు. తమ సమస్యలను హెల్ప్ డెస్క్‌లో అందజేయవచ్చన్నారు. కొల్చారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు, భూ యజమానులు, ప్రజలు తమతమ భూసమస్యలు, వాటి పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఈ అవగాహన సదస్సులో అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రైతులు, భూయజమానులు అడిగిన ప్రశ్నలకు భూభారతి చట్టం ద్వారా వాటికి ఉన్న పరిష్కారాలను తెలియజేస్తూ ఆర్డీవో మహిపాల్ రెడ్డి సమాధానాలిచ్చారు. భూభారతి చట్టంలోని మార్గదర్శకాలను ఆర్డీవో చదివి వినిపించారు. చట్టంలోని వివరాలను తెలియజేసే కరపత్రాలను రైతులు, భూ యజమానులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ మహమ్మద్ గఫర్ మియా, కౌడిపల్లి ఏడిఏ పుణ్యవతి, కొల్చారం ఎంపీడీవో రఫీకున్నిసా, కొల్చారం మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి, ఆయా క్లస్టర్ల ఏ ఈ ఓ లు, కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగులగారి మల్లేశం గౌడ్, శేఖర్, మహేశ్వర్ రెడ్డి, అక్రమ్, గోవర్ధన్ రెడ్డి, నెల్లి రాజు, మాజీ సర్పంచ్ గోదావరి పాల్గొన్నారు.

## డాక్టరేట్ వార్డు అందుకున్న లయన్ హరి నారాయణ్ బట్టడ్




**నారాయణపేట జిల్లా బ్యూరో, ఏప్రిల్ 20 (జనంసాక్షి) :** లయన్స్ క్లబ్ పాస్ట్ డిస్టిక్ గవర్నర్ హరి నారాయణ్ బట్టడ్ డాక్టరేట్ అవార్డు పొందారు.గత 40సంవత్సరాలుగా చేస్తున్న సామాజిక కార్యక్రమలను గుర్తించి అమెరికా భార్లింగ్ టన్ యూనివర్శిటి ఆదివారం న్యూడిల్లి గుల్ మొహోల్ కన్వెన్షన్ హల్ లో ఉత్తమ డాక్టరెట్ అవార్డు ప్రదానం చేసింది.ఈసందర్భంగా యూనివర్ సిటి రిజిస్టర్ లార మే మాట్లాడుతు గత 40సంవత్సరాలనుండి లయన్ హరినారాయణ్ బట్టడ్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అత్యధిక సామాజిక కార్యక్రమాలు చేస్తు జాతీయ స్థాయిలో గుర్తింపు తేవాడం అభినందనీయమని అన్నారు.

## ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించిన ఎమ్మెల్యే



**మక్తల్, ఏప్రిల్ 20 (జనంసాక్షి) :** మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిని ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి అకస్మాత్తుగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని రోగుల వద్దకు ఎమ్మెల్యే స్వయంగా వెళ్లి వారికి వైద్య సేవలు సరిగ్గా అందుతున్నాయా లేదా అని తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రి సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి ఆస్పత్రికి కావల్సిన అన్ని సదుపాయాలు గురించి సంబంధిత డాక్టర్స్ తో మాట్లాడుతూ ఆస్పత్రి కి వచ్చే పేషంట్ల పట్ల నిర్లక్ష్యం వహించకుండా సరైన వైద్యం అందించాలని డాక్టర్స్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట పట్టణ అధ్యక్షులు రవికుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ గణేష్ కుమార్, మాజీ ఉప సర్పంచ్ కట్ట సురేష్ గుప్తా, మల్లేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం



**సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 20 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని పోల్కంపల్లి గ్రామంలో శ్రీ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేకంగా అలంకరించి పూజ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై శ్రీ మల్లికార్జున స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీసుకున్నాను. కళ్యాణ మహోత్సవానికి హాజరైన బి ఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, పిఎస్ ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పైతార సాయికుమార్ హాజరై శ్రీ మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకటేశం,అంతారం మాజీ సర్పంచ్ ఎడ్ల శంకర్, కురుమ సంఘం మండల అధ్యక్షులు తాటిపల్లి మల్లేశం , బిఆర్ఎస్ పార్టీ నాయకులు కుమ్మరి శేఖర్, నాయకులు బక్కన్న, చీలపల్లి నాగేష్, తుడుం దుర్గయ్య, మైనార్టీ నాయకులు చీలపల్లి మౌలాన్ ,గార్లపల్లి సుల్తాన్, కలాల్ వెంకటేశం, బుర్ర సురేష్, సదాశివుడు, చంద్రయ్య, ప్రభు, కురుమ సంఘం నాయకులు యాదయ్య, మల్లేశం, పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పాలనలో అవినీతి.. అక్రమాలే తప్ప అభివృద్ధి శూన్యం

• పిఎసిఎస్ చైర్మన్ వెంకట్ రాం రెడ్డి
• కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత నవీన్ గుప్తా



**శివ్వంపేట, ఏప్రిల్ 20 (జనంసాక్షి) :** భారత రాష్ట్ర సమితి పార్టీ నాయకులకు చిల్లర రాజకీయాలు చేయడం అలవాటుగా మారిందని, ఆ పద్ధతి మంచిది కాదని అభివృద్ధిపై మంచి రాజకీయాలు చేయాల్సిన అవసరం ఉందని శివ్వంపేట పిఏసిఎస్ చైర్మన్ చింతల వెంకట్ రాం రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేత పులిమామిడి నవీన్ గుప్తా పేర్కొన్నారు .ఆదివారం మండల కేంద్రమైన శివ్వంపేట లోని నవీన్ గుప్తా క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నేత పులిమామిడి నవీన్ గుప్తా మాట్లాడుతూ మాజీ జెడ్పిటిసి సభ్యులు మహేష్ గుప్తా హయాంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని, ఇప్పుడు స్వార్థ రాజకీయాల కోసం శివ్వంపేట పెద్ద చెరువు కట్టను మాజీ జెడ్పిటిసి సభ్యులు మహేష్ గుప్తా తన అనుచరుడి కోసం ఇప్పుడు కట్ట మరమ్మతులు చేయించడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీపై గాని, పార్టీ నాయకుల పై గానీ బిఆర్ఎస్ పార్టీ నాయకులు అసత్యపు ఆరోపణలు చేస్తే, చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని నవీన్ గుప్తా హెచ్చరించారు. 16 నెలల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం శివ్వంపేట మండలంలో సిసి రోడ్ల నిర్మాణానికి సుమారు నాలుగు నుంచి ఐదు కోట్ల రూపాయలు మంజూరు చేసిందని ఆయన గుర్తు చేశారు.ఈ ఘనత కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి కే దక్కిందన్నారు. డబ్బులతో రాజకీయాలు చేసేవారు నిజమైన నాయకులు కాదని, ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని నవీన్ గుప్తా అన్నారు. 10 సంవత్సరాలలో శివ్వంపేట లో ఎటువంటి ప్రభుత్వ భవనాలు నిర్మించలేదన్నారు. స్థానికంగా బిఆర్ఎస్ పార్టీ నాయకులు లేని సమస్యలు కావాలని సృష్టిస్తున్నారని నవీన్ గుప్తా తీవ్రంగా మండిపడ్డారు. ఆ తర్వాత పిఎసిఎస్ చైర్మన్ చింతల వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేత చిలుముల మదన్ రెడ్డి ఎంతోమందికి రాజకీయ బిక్ష పెట్టాడని తన హయాంలో మంజూరైన ఉసిరికపల్లి, గోమారం, నవాబుపేట, పోతులబోగూడ వరకు డబుల్ బీడీ రోడ్డు పనులు, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ హయాంలోనే జరుగుతున్నాయని ఆయన గుర్తు చేశారు. వడగండ్ల వాన వల్ల నష్టపోయిన రైతులకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం న్యాయం చేస్తుందని ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి ఇదివరకే తీసుకువెళ్ళడం జరిగిందని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు, ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల కరెంటు సరఫరా, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు రవాణా సదుపాయం, పేదలకు సన్న బియ్యం పంపిణీ, నిరుద్యోగుల కోసం యువ వికాసం ఇలా అనేక రకాల సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందించడం జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ ఆయంలో ప్రతి శాఖలో అవినీతి జరిగిందన్నారు. రియల్ ఎస్టేట్ పడిపోయి మూడు సంవత్సరాలు అవుతుందని కాంగ్రెస్ వచ్చి 16 నెలలు అవుతుందని దానికి దీనికి లంకె పెట్టడం ఎంతవరకు సమంజసం బిఆర్ఎస్ సమాధానం చెప్పాలన్నారు. లక్షల కోట్ల అవినీతి చేసి బీఆర్ఎస్ నాయకులు దుబాయ్ లో పెట్టుబడులు పెట్టి, వారి వ్యాపారాలను కొనసాగిస్తున్నారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెడ్డ పేరు తేవాలని, ఉద్దేశపూర్వకంగానే తెలంగాణలో రియల్ ఎస్టేట్ ను పండబెట్టరని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు వారాల గణేష్, బుర్ర మురళి గౌడ్, పెద్దపులి సతీష్, బిస్కుందు అంజయ్య, కమలయ్య గారి వెంకటేష్, బిజిలిపురం సత్తయ్య, షేక్ అలీ, బండారి నాగేష్, వంజరి గౌరీ శంకర్, బలవంత రెడ్డి, దావూద్, దానబోయిన కృష్ణ, ఇసారపు రాజు గౌడ్, మెతుకు మల్లేష్, సోను, వర్రె మహేష్ యాదవ్, వర్రే కార్తిక్ యాదవ్, నాగేష్ తదితరులు ఉన్నారు.

## ఘనంగా ఈస్టర్ వేడుకలు



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఏప్రిల్ 20 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఈస్టర్ పర్వదినాన్ని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. నారాయణపేట పట్టణంలోని మూడు చర్చీలతో పాటు మండలంలోని బైరంకొండ, కొల్లంపల్లి, సింగారం గ్రామాల్లోని చర్చిలలో ఈస్టర్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సింగారం గ్రామంలో ఉదయం ప్రభువును స్మరిస్తు పాటలు పాడుతూ ర్యాలీగా గ్రామ శివారులోని కల్వరి కొండకు చేరుకొని అక్కడ ఉదయపుకాల ఆరాధన కార్యక్రమం నిర్వహించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం స్థానిక ఇమ్మెన్యూయేల్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా రెవరెండ్ పాస్టర్ నగేష్ మాట్లాడుతూ ప్రభువు మరణాన్ని జయించి సమాధి నుంచి మృత్యుంజయునీగా లేచిన దిన్నానే ఈస్టర్ అని ఇది ఒక పర్వదినంగా క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారాని అన్నారు. తనకు తన తగ్గించుకోన్నవారే హెచ్చించబడుతారని ఏసు బోధించారని అన్నారు. అనంతరం ఏసుక్రీస్తు జీవిత పునరుత్థానంపై సందేశాన్ని వినిపించారు. మహిళలు యేసయ్య పాటలతో గీతాలాపన చేశారు. అయా కార్యక్రమంలో పాస్టర్లు, క్రైస్తవ సంఘ పెద్దలు, చర్చి కమిటీ సభ్యులు, యువకులు, మహిళలు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

# కొత్త రేషన్ కార్డుల్లో సమస్య

**కొత్త కార్డుల్లో పేర్ల నమోదు కోసం పాత వాటిలో తొలగింపు**

**దరఖాస్తు చేసుకోగా రాకపోవడంతో ఆందోళనలో ప్రజలు**

**హైదరాబాద్ (జనంసాక్షి) :**

చాలా ఏళ్లుగా రేషన్‌కార్డుల కోసం జనం ఎదురుచూస్తున్నారు. దరఖాస్తులు ఏళ్లుగా పెండింగ్‌లో ఉండగా కొత్తగా పేర్లు సైతం నమోదు చేసేందుకు అవకాశం ఇవ్వలేదు. ప్రస్తుత ప్రభుత్వం గతేడాది రేషన్ కార్డుల కోసం దరఖాస్తులను స్వీకరించింది. కానీ ఇప్పటికీ కొత్త కార్డులు పూర్తిగా జారీ కాలేదు. కొత్త ఆహార భద్రతా కార్డుల దరఖాస్తులు చేసుకున్న వారు అప్పటి వరకు తల్లిదండ్రుల పేరిట ఉన్న కార్డుల్లో తమ పేర్లను తొలగించారు. కొత్తగా పెళ్లి అయిన యువతులు తమ పిల్లల పేర్లను అత్తవారి ఇంటి కార్డులో చేర్చేందుకు దరఖాస్తు చేసుకున్నారు. కానీ అవి యువతుల పుట్టింటిలోని తల్లిదండ్రుల కార్డుల్లో నమోదు అవుతుండడంతో కొత్త సమస్యకు కారణమవుతుంది. ఇలా రాష్ట్రవ్యాప్తంగా అనేక మంది పేర్లు తొలగించుకోగా ఆ పేర్లు కొత్త కార్డులో నమోదు కాలేదు. ఉన్న పేరు తొలగించడంతో రేషన్ బియ్యానికి, సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు.కార్డుల్లో పేర్లు తొలగిపోగా కొత్త కార్డులు అందక చాలా మంది రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా రు. కొంత మంది పేర్లు వేరే గ్రామాల్లో నమోదు కావడంతో ఆందోళనకు గురవుతున్నారు. వాటిని సరి చేయాలని అధికారులను కోరుతున్నారు. భైంసా పట్టణానికి చెందిన అసిఫాఖానం పేరిట ఉన్న రేషన్ కార్డులో ఆరుగురు సభ్యులు ఉన్నారు. తన ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడికి పెళ్లి కావడంతో వారికి కొత్త కార్డు కోసం వారి పేర్లను రేషన్ కార్డు నుంచి తొలగించారు. కొత్త కార్డుకు దరఖాస్తు చేసుకోగా వారి వారి పిల్లల పేర్లు రాలేదని వాపోయారు.



భైంసా మండలం సుంక్లి గ్రామానికి చెందిన హరీశ్ 2020లో అదే మండలంలోని వానల్‌పాడ్ వాసి సాగరను వివాహం చేసుకున్నారు. తన తల్లి పేరిట ఉన్న కార్డులో నుంచి హరీశ్ తన పేరును తొలగించారు. అనంతరం కొత్త కార్డు కోసం భార్య, ఇద్దరు పిల్లల పేర్లతో ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నారు. కాగా హరీశ్ పేరు తొలగిపోగా కొత్త కార్డు ఇప్పటికీ రాలేదు. కానీ తన భార్య, పిల్లల పేర్లు వానల్‌పాడ్‌లోని అత్త పేరిట ఉన్న కార్డులో నమోదయ్యాయి.

**విచారణ చేస్తున్నాం..**

కొత్త కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులపై విచారణ చేపడుతున్నామని నిర్మల్ డీఎస్‌వో ఇన్‌ఛార్జి సీహెచ్ కోమల్ రెడ్డి తెలిపారు. అర్హులందరికీ రేషన్ కార్డులు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. పాత కార్డుల్లో పేర్ల తొలగించుకున్న వారి పేర్లు కొత్త కార్డుల్లో నమోదు అవుతాయని, ఇతర ప్రాంతాలలో పేర్లు నమోదైన వారు దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వ ఆదేశాల మేరకు పరిశీలించి సరిచేస్తామని వివరించారు.

# నిబంధనలకు విరుద్ధంగా టెండర్?



## రీ- టెండర్ నిర్వహించాలంటూ ఆలయ ఈవోకు పిర్యాదు

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 20 (జనంసాక్షి)**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో ఇటీవల నిర్వహించిన టెండర్లలో ప్రకటనలో ఇచ్చిన విధంగా కాకుండా పూర్తి విరుద్ధంగా టెండర్ ప్రక్రియ జరిగిందని, దీనిపై పూర్తి విచారణ జరిపి మళ్ళీ రీ- టెండర్ నిర్వహించాలని కోరుతూ ఆలయ ఈవో కు కొంతమంది ఏజెన్సీ ప్రతినిధులు వినతి పత్రం సమర్పించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.పూర్తి వివరాల్లోకి వెళ్తే రాజన్న ఆలయానికి సంబంధించి లడ్డు కౌంటర్, గోశాలలో విధులు నిర్వర్తించేందుకు 52మంది లేబర్లను ఔట్ సోర్సింగ్ విధానంలో నియమించుకునేందుకు ఆలయ అధికారులు ఏజెన్సీల కొరకు పేపర్ ప్రకటన చేశారు. ఇట్టి టెండర్లలో అవకాతవకలు జరగాయని ఆలయ ఈవోకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం ఈ విషయంపై ఆలయ ఈ వివరణ కోర ప్రయత్నం చేయగా ఆయన అందుబాటులోకి రాకపోవడంతో ఏఈఓ బ్రహ్మన్న గారి శ్రీనివాస్ చెప్పిన వివరాల ప్రకారం ఈ ప్రకటనతో 16 ఏజెన్సీలు దరఖాస్తులు సమర్పించారన్నారు.

17న టెండర్లు నిర్వహించమని16 ఏజెన్సీలలో ఐదు ఏజెన్సీలు సరైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించకపోవడంతో వారిని రిజెక్ట్ చేశామని,మరో మూడు ఏజెన్సీలు ఎక్కువ రేట్ కోడ్ చేశారన్నారు. మిగిలిన ఎనిమిది ఏజెన్సీలు వారు 0.01 రేటు కోడ్ చేయడంతో ఇట్టి విషయాన్ని ఆలయ ఈవో దృష్టికి తీసుకెళ్ళమన్నారు.ఆలయ ఈఈ కి సమాచారం ఇవ్వగా టెండర్ ప్రక్రియలో అందరూ ఒకే రేటు కోడ్ చేసినట్లయితే డ్రా తీయాలని సూచించడంతో డ్రా తీయడం జరిగిందన్నారు .ఇప్పటి వరకు ఆ డ్రాలో వచ్చిన ఏజెన్సీలలో ఎవరికి కూడా లేబర్లను పంపాలని అధికారికంగా సూచించలేదని ఆయన తెలిపారు.ఆలయ ఈవో వచ్చిన వెంటనే ఈ టెండర్ ప్రక్రియను రద్దుచేసి మళ్లీ టెండర్ నిర్వహిస్తామన్నారు.

# కూచిపూడి నాట్యంలో తొర్రూరు విద్యార్థిని ప్రతిభ

## గిన్నిస్ బుక్‌లో చోటు

**చిన్నారిని అభినందించిన గ్రామస్తులు**

**పాలకుర్తి, ఏప్రిల్ 20 (జనం సాక్షి)**



మండలంలోని తొర్రూరు గ్రామానికి చెందిన మడిపెల్లి వేణు, రజిత దంపతుల కుమార్తె మడిపల్లి తాన్యశ్రీ కూచిపూడి నాట్యంలో ప్రతిభను కనబరిచి, గిన్నిస్ బుక్ లో చోటు సంపాదించుకుంది. ఏడవ తరగతి చదువుతున్న తాన్యశ్రీ కూచిపూడి నాట్యంలో గిన్నిస్ బుక్ లో చోటు సంపాదించుకోవడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ తాన్యశ్రీని అభినందించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ స్వరూపిణి నృత్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో 2025 గిన్నిస్ వరల్డ్ రికార్డు సక్సెస్ మీట్ కార్యక్రమంలో ఇటీవలే నిర్మల్ పట్టణ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో తాన్యశ్రీ కూచిపూడి నాట్యంలో ప్రతిభను కనబరిచి, గిన్నిస్ బుక్ రికార్డు సాధించిందని తెలిపారు. 2023 డిసెంబరు 24న హైదరాబాద్ లోని గచ్చిబౌలిలో గల జీఎంసీ బాలయోగి స్టేడియంలో భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి మహా బృందం నాట్యంలో పాల్గొన్న చిన్నారులకు గిన్నిస్ బుక్ లో చోటు లభించిందని తెలిపారు. కూచిపూడి నాట్యంలో పాల్గొన్న విద్యార్థినిలకు 18 నెలల తర్వాత సర్టిఫికెట్లు, మెడల్స్ రావడం ఆనందంగా ఉందన్నారు. కూచిపూడి నాట్యంలో తాన్యశ్రీ ప్రతిభను కనబరిచి వరల్డ్ బుక్ రికార్డు సాధించడం పట్ల తొర్రూరు మాజీ ఎంపీటీసీ మడిపల్లి కౌసల్య సోమయ్య, మాజీ సర్పంచ్ నాయిని మల్లారెడ్డి, గ్రామస్తులు తదితరులు అభినందించారు.

# మిస్ వరల్డ్ పోటీలను రద్దు చేయాలి




## మహిళా సంఘాల నిరసన

**నారాయణపేట జిల్లా ప్రతినిధి (జనం సాక్షి):**

తెలంగాణలో మే 7 నుంచి మే 30 వరకు జరిగే 72వ మిస్ వరల్డ్ పోటీలను రద్దు చేయాలనీ నిరసిస్తూ ఆదివారం నారాయణపేట జిల్లా కేంద్రంలో పి ఓ డబ్ల్యు రాష్ట్ర సహాయ కార్యదర్శి విజయలక్ష్మి , ఐద్వా జిల్లా అధ్యక్షురాలు రాజేశ్వరి ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు.తెలంగాణలో జరిగే 72వ మిస్ వరల్డ్ పోటీలను వ్యతిరేకిస్తూ పిఓడబ్ల్యు - ఐద్వా - పివైఎల్ -డివైఎఫ్ఐ - పిడిఎస్ యు - ఎస్ఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా నుంచి మున్సిపల్ పార్క్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించి పార్కు ముందు నిరసన తెలిపారు.ఈ కార్యక్రమంలో పి వై ఎల్ జిల్లా కార్యదర్శి ప్రతాప్ , పిడిఎస్యు జిల్లా అధ్యక్షుడు ఎస్.సాయికుమార్ , ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు నరహరి ,పి ఓ డబ్ల్యు జిల్లా కార్యదర్శి సౌజన్య , జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మి , ఐద్వా జిల్లా కార్యదర్శి సమ్రిన్ బేగం , జిల్లా నాయకులు దస్తమ్మ ,చంద్రకళ ,పి ఓ డబ్ల్యు జిల్లా నాయకులు మంజుల సునీత , సరళ ,టియుసిఐ జిల్లా కార్యదర్శి నరసింహ ,పిడిఎస్ యు జిల్లా ఉపాధ్యక్షులు గౌస్ ,సంధ్య , ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పవన్ , పిడిఎస్ యు జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్ , జిల్లా నాయకులు నందిని రాజు, గణేష్ , కృష్ణ తోపాటు పాల్గొన్నారు.

# హామీల అమలులో ప్రభుత్వం విఫలం

**చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్**

**నస్పూర్, ఏప్రిల్ 20, (జనంసాక్షి):**



కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుపరచడంలో వైఫల్యం చెందిందని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు.సోమవారం నస్పూర్ పట్టణంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బిఆర్ఎస్ హయాంలో తెలంగాణ అన్ని రంగాలలో అభివృద్ధి చెందని,కాంగ్రెస్ పాలనలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైందని విమర్శించారు. జిల్లాలోని కొందరు ఎమ్మెల్యేలు అభివృద్ధి పై దృష్టి సారించకుండా మంత్రి పదవిపై తాపత్రయ పడుతున్నారని ఎద్దేవా చేశారు. చెన్నూరులో బిఆర్ఎస్ రజతోత్సవ సభ కోసం రాసిన వాల్ రైటింగ్స్ ను చెరిపి వేయడాన్ని తీవ్రంగా ఖండించారు.చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించారని అన్నారు.ఈనెల 27న ఎల్కతుర్తిలో జరిగే బిఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కార్యకర్తల కు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు నడిపెల్లి విజిత్ రావు, నాయకులు రాజా రమేష్,పల్లె భూమేష్,అక్కురి సుబ్బయ్య,మెరుగు పవన్ కుమార్,బిఆర్ఎస్ మాజీ కౌన్సిలర్లు, జెడ్పిటిసిలు,ఎంపీపీలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అరెస్ట్ చేయాల్సి ఉంటుందంటూ బెదిరింపులు

# సైబర్ నేరగాళ్లపై కేసు

**హైదరాబాద్ (జనంసాక్షి)**



ఆర్థిక పరమైన వ్యవహారాలలో తప్పు చేశావని.. దీంతో నిన్ను అరెస్ట్ చేయాల్సి వస్తుందంటూ ఫోన్ చేసి బెదిరించడంతో పాటు అకౌంట్ నుంచి డబ్బులు తస్కరించిన సైబర్ నేరగాళ్లపై బంజారాహిల్స్ పోలీస్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నెం 14లో నివాసం ఉంటున్న రమేష్‌రెడ్డి అనే వ్యాపారికి ఇటీవల గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. మీ బ్యాంకు ఖాతాలో జరిగిన లావాదేవీలో తప్పులు జరిగా యని, దీనిపై ముంబై సైబర్ క్రైం స్టేషన్‌లో కేసు నమోదయిందని చెప్పాడు. తాను ఎలాంటి తప్పు చేయలేదని రమేష్‌రెడ్డి చెప్పగా రెండువారాల ముందు నీ అకౌంట్‌లోనుంచి రూ.70 వేలు ఎక్కడకు వెళ్లాయో చూసుకోవాలంటూ దబాయించారు. అప్పుడు తన అకౌంట్ చేసుకోగా రూ.70 వేలు సైబర్ నేరగాళ్లు కాజేసినట్లు తేలింది. దీంతో భారీ స్కెచ్‌లో భాగంగా తనను ఇరికేంచేందుకు ప్రయత్నిస్తున్నట్లు గుర్తించిన

బాధితుడు ఈ మేరకు సైబర్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయడంతో పాటు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# నడిరోడ్డుపై పాత కక్షలతో యువకుడి హత్య

**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్ నగరంలోని నాగోల్ చౌరస్తాలో దారుణం జరిగింది. నడిరోడ్డుపై ఓ యువకుడిని అత్యంత దారుణంగా హత్య చేశారు. అనంతరం దుండగులు అక్కడ్నుంచి పారిపోయారు. నాగోల్‌కు చెందిన పంగా మనోజ్ ( 24) తన స్నేహితుడు బందెల వంశీ( 21) తో కలిసి శనివారం రాత్రి 1:50 గంటలకు నాగోల్ ఫ్లైఓవర్ యు-టర్న్ దగ్గర ఉన్న రాజుగారి బిర్యాని హెూటల్ ముందు మెయిన్ రోడ్డు పక్కన ఉన్న మొబైల్ టిఫిన్ సెంటర్ వద్దకు వచ్చారు. వంశీ, మనోజ్ యాక్టివాపై కూర్చొని టిఫిన్ చేస్తున్నారు. మనోజ్ స్నేహితుడైన జయపురి కాలనీకి చెందిన సంజయ్ (27), మహేష్, మరో స్నేహితుడు మొత్తం ముగ్గురు కలిసి ఒక పల్సర్ బైక్‌పై అక్కడికి చేరుకున్నారు. టిఫిన్ చేస్తున్న మనోజ్‌పై సంజయ్ అతని స్నేహితులు కత్తితో విచక్షణారహితంగా దాడి చేశారు. కిందపడిపోయిన మనోజ్‌పై కూర్చుని.. కత్తితో గొంతు కోశాడు సంజయ్. మనోజ్‌ను ప్రాణాలతో కాపాడేందుకు యత్నించిన వంశీపై కూడా సంజయ్ కత్తితో పొడిచాడు. దీంతో వంశీ ఎడమ చేతికి తీవ్ర గాయమైంది. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. రక్తపు మడుగులో పడి ఉన్న మనోజ్ అప్పటికే ప్రాణాలు కోల్పోయాడు. దీంతో మనోజ్ డెడ్‌బాడీని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు

# సీఎంఆర్‌ఎఫ్‌తో నిరుపేదలకు ఊరట

**ఖమ్మంరూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ లబ్ధిదారుల చెక్కుల పంపిణీలో దయాకర్ రెడ్డి**

**ఖమ్మం (జనంసాక్షి) :**



సీఎం రిలీఫ్ ఫండ్ తో నిరుపేదలకు ఎంతో ఊరట కలుగుతోందని, అనారోగ్యంతో సతమతమవుతూ వైద్యం చేయించుకోవటానికి ఇబ్బంది పడుతున్న ఎన్నో కుటుంబాలకు ఆర్థిక చేయూత కలుగుతోందని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం క్యాంపు కార్యాలయ ఇన్ చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి పేర్కొన్నారు. పాలేరు నియోజకవర్గ పరిధిలోని ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ లబ్ధిదారుల చెక్కుల పంపిణీ కార్యక్రమం ఖమ్మంలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో శనివారం జరిగింది. 101మంది లబ్దిదారులకు సుమారు రూ. 35లక్షల విలువ చేసే చెక్కులను అందించారు. ఈ సందర్భంగా చెక్కుల పంపిణీ అనంతరం ఆయన మాట్లాడుతూ... మంత్రి పొంగులేటి సిఫారసుతో నియోజకవర్గానికి చెందిన అనేక మంది సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు అనతి కాలంలోనే చెక్కులను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఆయన నేతృత్వంలో పాలేరు నియోజకవర్గం కొత్త పుంతలు తొక్కుందని అభివర్ణించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు కావాల్సిన సౌకర్యాలను సమకూర్చేందుకు మంత్రి పొంగులేటి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే ఇప్పటికే దాదాపుగా అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటుతో పాటు విద్యుత్ సమస్య లేకుండా చూడటం, చెక్ డ్యాంలను ఏర్పాటు చేయించడం మొదలగు అనేక అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా పూర్తయ్యాయని తెలిపారు.

# హైడ్రా లాగా మేము 'కోబ్రా' తీసుకొస్తాం

**హైదరాబాద్ (జనంసాక్షి) :**



కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు తీవ్ర విమర్శలు చేశారు. ఆదివారం తెలంగాణ భవన్లో బీఆర్ఎస్ నాయకుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ వాళ్ళు హైదరాబాద్ అసెట్ ప్రొటెక్షన్ అని హైడ్రా ఎలా తీసుకు వచ్చారో మేము కాంగ్రెస్ వాళ్ళు కబ్జా పెట్టినవి తిరిగి తీసుకు రావడానికి కోబ్రా అని తీసుకువస్తామని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ నేతలు కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సీఎం నుంచి మొదలుకొని వారి కుటుంబ సభ్యుల వరకు భూములు అగ్రిమెంట్ చేసుకుంటూ కబ్జాలు పాల్పడుతున్నారని ఆరోపించారు. మూడేళ్ల తర్వాత బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పాలన ఎలా ఉందంటే హైవే రోడ్డు మీద పడ్డ మందు లారీ లెక్క అయిందని విమర్శించారు. ఎవరికి దొరికినంత వాళ్ళు దోచుకొని పోదాం అనే తప్ప పార్టీని బతికిద్దాం అని ఎవరికీ లేదన్నారు.

# బీజేపీతో పోరాడేందుకు మూడు పార్టీలు కుమక్కు



చేవెళ్ల బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

**హైదరాబాద్ (జనంసాక్షి)**

: బీజేపీ పార్టీతో పోరాడేందుకు మూడు పార్టీలు కుమక్కు అయ్యాయని, ఈ ఎన్నికల్లో జరిగేది సిద్ధాంతపరమైన యుద్ధమని చేవెళ్ల బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికలపై మీడియా సమావేశం నిర్వహించిన ఆయన.. ప్రత్యర్థి పార్టీలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో బీజేపీ పార్టీతో పోటీ పడేందుకు ఎంఐఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కు అయ్యాయని వ్యాఖ్యానించారు. అసలు ఎంఐఎం పార్టీకి సెక్యూలర్, అంబేద్కర్ అనే పదాలు వాడే హక్కుందా అని ప్రశ్నించారు. అలాగే యాంటీ సెక్యూలర్ పార్టీ అయిన ఎంఐఎంకు కాంగ్రెస్ మద్దతు ఇవ్వడం కరెక్టేనా అని, ఎంఐఎంకు మద్దతు ఇస్తున్న టీఆర్ఎస్/బీఆర్ఎస్ పార్టీ వాళ్లు సెక్యూలర్ అనే పదం వాడే హక్కుందా అని నిలదీశారు. అసదుద్దీన్ కు లొంగిపోయి, ఎంఐఎం కు మద్దతు ఇచ్చేందుకేనా బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల్లో నిలబడటం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఎంఐఎం లేకుంటే బ్రతకలేదని అందుకే వారికి లొంగిపోయారని అన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
21 ఏప్రిల్ 2025

# వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ వ్యతిరేకం

- పలు పార్టీల, ప్రజాసంఘాల నాయకుల పిలుపు




**ఖమ్మం, ఏప్రిల్ 20 (జనంసాక్షి) :** వక్ఫ్ సవరణ చట్టం 2025 రాజ్యాంగ వ్యతిరేకమని , దేశంలో మరో విభజనకు బిజెపి కుట్ర పన్నుతోందని , వక్ఫ్ సవరణ చట్టం పేరుతో ముస్లింలను టార్గెట్ చేసిన భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం రేపు క్రిస్టియన్లను కూడా టార్గెట్ చేయనుందని , సంఘటిత ఉద్యమాల ద్వారానే దీనిని మనం తీపి కొట్టాల్సిన అవసరం ఉందని పలు పార్టీల నాయకులు , ప్రజా సంఘాల బాధ్యులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎస్ ఆర్ కన్వెన్షన్ హాలు లో ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా ఖమ్మం యూనిట్ ఖమ్మం కమిటీ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. తొలుత లిజమాతే ఇస్లామీ హింద్ నాయకులు మహమ్మద్ సాదిక్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యానికి రాజ్యాంగమే ఊపిరి అని , కేంద్రంలోని ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ వ్యతిరేకం కాబట్టి ప్రభుత్వం ఈ చట్టాన్ని ఉపసంహరించుకునే అంతవరకు ప్రణాళిక బద్ధమైన కార్యాచరణ తలపెట్టాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ పీఠికను చదివి ,వినిపించి , దాని స్ఫూర్తిని కాపాడుకోవాలని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ గతంలో ముస్లిం మైనార్టీల లక్ష్యంగా తీసుకువచ్చిన సి ఏ ఏ, ఎన్ఆర్సి లకు వ్యతిరేకంగా పోరాడిన విషయాన్ని గుర్తు చేస్తూ మత స్వేచ్ఛను హరిస్తున్న వంటి వక్ఫ్ సవరణ చట్టం తో మరోసారి బిజెపి ప్రభుత్వం మతకలహాలను రెచ్చగొట్టాలని చూస్తోందనీ ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ నాయకులు బాగా హేమంతరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ జగదీష్, కాంగ్రెస్ నేత, మస్జిద్ ఏ ఆయేషా (సదర్) ప్రెసిడెంట్ షేక్ అబ్దుల్ రషీద్, ప్రజాపంథా మాస్ లైన్ కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వరరావు, సిపిఎం రాష్ట్ర నాయకులు ఎం. సుబ్బారావు, తెలంగాణ ఉద్యమకారులు డాక్టర్ కెవి కృష్ణారావు, పి డి ఎస్ యు నాయకులు ఆజాద్ , గ్రంధాలయ మాజీ చైర్మన్ ఖమర్‌లు, ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ గోపీనాథ్, ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఖమ్మం యూనిట్ బాధ్యులు మహమ్మద్ అసద్వక్ఫ్ చట్టంతో పాటు ఆర్టీఐ చట్టం నిర్వీర్యం.తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఖమ్మం జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. ముఫ్తీ రవూఫ్ దివ్య గ్రంథం ఖురాన్ పఠనం , ముఫ్తీ జలాలుద్దీన్ దువా చేశారు.లి ఈకార్యక్రమంలో మౌలానా అబ్దుల్ సత్తార్ , లింగాల రవికుమార్ , భాష , పుల్లారావు , మహమ్మద్ సలాం , అశోక్ , కిషన్ నాయక్ , ఎంపీజే ఖాసీం , జే ఐ హెచ్ నాయకులు ఖలీల్ అహ్మద్ ఖాన్ , ముజీబ్ , కాంగ్రెస్ నాయకులు చోటే బాబా , తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్ 10 వేల కోసం ఎంపీ వంశీకి మద్దతు ఇద్దాం

పరిశ్రమ రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ ఫండ్ క్షీణిస్తున్న స్థితిని అర్థం చేసుకొని కోల్ మైన్స్ పెన్షన్ ఫండ్ బలోపేతం కొరకు,గత వి కొన్ని సంవత్సరాల నుంచి విశ్రాంత ఉద్యోగులు,ఆందోళనలు, నిరసనలు తెలుపుతూనే ఉన్నారు. సీఎంపిఎఫ్ బోర్డ్ ఆఫ్ ట్రస్ట్ సభ్యుల నిర్ణయం మేరకు2021సంవత్సరం నుంచి కోల్ ఇండియా,సింగరేణి యాజమాన్యాలు టన్ను బొగ్గుకు రూ.10 పెన్షన్ ఫండ్ జమ చేయడం జరుగుతుంది. ప్రస్తుతం పెన్షన్ ఫండ్ లో రూ.22,452 కోట్లు మాత్రమే ఉన్నాయి. పని చేసే ఉద్యోగులు తగ్గడం, రిటైర్డ్ ఉద్యోగులు పెరగడం వలన ఫండ్ 2031 సంవత్సరం వరకు మాత్రమే పెన్షన్ చెల్లించే స్థితిలో ఉంది.పెన్షన్ చెల్లించలేని ప్రమాదం పసిగట్టిన బోర్డ్ ఆఫ్ ట్రస్ట్ వారు, ఉన్నత అధికారులు టన్ను బొగ్గు పై రూ. 20 జమ చేయడం తాత్కాలిక ఉపశమనం మాత్రమే.కావున బొగ్గు సంస్థ యాజమాన్యాల సహకారంతో పాటు, ప్రభుత్వాలు కూడా పెన్షన్ ఫండ్ కు సహకారం అందించాలి. కోల్ మైన్స్ పెన్షన్ స్కీం-1998 సవరణలు చేసి కనీస పెన్షన్ రూ.10,000 చెల్లించే ప్రయత్నాలు కరువు భత్యం తో కూడిన పెన్షన్ కొరకు పార్లమెంట్ సభ్యులు కృషి చేయాలి. తెలంగాణ నుంచి ఎన్నికైన పార్లమెంట్ సభ్యులు సింగరేణి విశ్రాంత ఉద్యోగుల గురించి మాట్లాడక పోవడం బాధాకరం.కానీ ఎడారిలో ఒయాసిస్సు లాగా సింగరేణి రిటైర్డ్ కార్మికుల పెన్షన్, మెడికల్ తదితర సమస్యలపై పార్లమెంట్లో,వివిధ సమావేశాలలో యువ కిశోరం,పెద్దపల్లి లోక్ సభ సభ్యుడు గడ్డం వంశీ చంద్ గళం విప్పడం యావత్తు సింగరేణి కే గర్వకారణం. గడ్డం వంశీ ప్రకటించినట్లుగా కనీస పెన్షన్ రూ.10,000 చెల్లించేంత వరకు సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు ఆయన కు అండగా ఉండాలి.

**ఆళవందార్ వేణు మాధవ్**
**ఉప ప్రధాన కార్యదర్శి**
**సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్**

## కోమరం భీమ్ విగ్రహ ప్రతిష్టకు శంకుస్థాపన



**ఆళ్లపల్లి, ఏప్రిల్ 20 (జనంసాక్షి) :** కొమరం భీం విగ్రహ ప్రతిష్టకు శంకుస్థాపన ఆదివారం మండల కేంద్రంలోని రైతు వేదిక సమీపంలోని ఆదివాసి కమ్యూనిటీ స్థల ప్రాంగణంలో భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆదివాసి ఐక్య కార్యా చరణ సమితి మండల అధ్యక్షులు పాయం రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి మాట్లాడుతూ. కొమరం భీం ఆదివాసీల ఆశాజ్యోతి అని, ఆదివాసుల హక్కుల కోసం నిజాం ప్రభుత్వ దమనవిధానాలకి వ్యతిరేకంగా పోరాడిన మహావీరుడని, జల్ జంగల్ జమీన్(నీరు, అడవి, భూమి) అనే నినాదంతో ఆదివాసీల హక్కులను కాపాడటానికి తన ప్రాణాలను అర్పించిన యోధుడనీ అన్నారు. నేటి యువత ఆయన పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని సమాజంలో అన్యాయానికి, అసమానతలకు వ్యతిరేకంగా నిలబడి, సమానత్వ హక్కుల కోసం పోరాడాలన్నారు. దేశం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లాలంటే యువతలో ఆత్మవిశ్వాసం, నాయకత్వగుణం, సామాజిక బాధ్యత వంటి విలువలు అవసరమనీ అన్నారు. ఆదివాసీల హక్కుల సాధన కోసం ఐక్య ఉద్యమాలు చేయవలసిన సమయం ఆసన్న మైనదని ఈ సందర్భంగా ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి కొమరం హనుమంతరావు, మాజీఎంపీపీ పడిగ సమ్మయ్య, మాజీ సర్పంచ్ మెస్సు కోటేశ్వరరావు, ఈసం సాంబశివరావు, పిఏసిఎస్ డైరెక్టర్, ఏఈడబ్ల్యూసీఏ జిల్లా కార్యదర్శి జోగ.రాంబాబు, ఊకె కిషోర్ బాబు, వజ్జ పగడయ్య, గొగ్గల వెంకటేశ్వర్లు, బట్టు సురేష్, కొమరం వెంకటకృష్ణ, గొగ్గల గాదెరాజు, సుబ్బారావు, అక్రెమ్ బాలకృష్ణ, గొగ్గల వినోద్, ఏడుల్ల రామనాథం, ఏడుల్ల రమేష్, గొగ్గల లక్ష్మయ్య, కొమరం గాదెరాజు, కల్తీ హనుమంతు, మెస్సు శ్రీను, చందా వీరయ్య, వట్టం ముత్తయ్య, ఏడుల్ల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి



**టేకులపల్లి, ఏప్రిల్ 20 (జనం సాక్షి) :** ఇల్లందు నియోజకవర్గం టేకులపల్లి మండల కేంద్రంలో గల వ్యవసాయ మార్కెట్ గిడ్డంగిలో బేతంపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ల చేతుల మీదుగా ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలోని విక్రయించుకుని లబ్ధి పొందాలని, దళారుల మాటలు నమ్మి ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించి మోసపోవద్దని రైతులకు సూచించారు. సొసైటీలకు గిడ్డంగులను ఏర్పాటు చేసి, సొసైటీలు ఒక వ్యవసాయానికే కాకుండా, అన్ని రకాలుగా సొసైటీల ద్వారా రైతులు లబ్ధి పొందే విధంగా ఏర్పాటు చేద్దామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి, చెమటోడ్చి పండించిన రైతుల కష్టార్జితాన్ని గత ప్రభుత్వంలోని పాలకులు కటింగ్‌ల పేరుతో అనేక విధాలుగా అవినీతికి అక్రమాలకు పాల్పడినరని వారు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా రైతులకు న్యాయం చేకూర్చేందుకు పనిచేస్తున్నామని అన్నారు. రైతులకు భరోసాతో పాటు గిట్టుబాటును ధరను అందిస్తూ క్వింటాకు 500 రూపాయల బోనస్ ను కూడా రైతులకు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బేతంపూడి సొసైటీ అధ్యక్షులు లక్కినేని సురేందర్ రావు, సొసైటీ కార్యదర్శి పొన్నోజు ప్రేమ చారి, సొసైటీ డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## భూ భారతి చట్టంతో రైతాంగ సమస్యలకు సత్వర పరిష్కారం

- టేకులపల్లిలో భూ భారతి చట్టంపై అవగాహన కల్పించిన కలెక్టర్ జితేష్ వి పాటిల్
- ముఖ్య అతిథిగా హాజరైన ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య




**టేకులపల్లి, ఏప్రిల్ 20 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన భూ భారతి చట్టంతో ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన రైతాంగ సమస్యలు సత్వరమే పరిష్కార మార్గాలు జరగనున్నాయని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఆదివారం టేకులపల్లి లోని స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో ఏర్పాటుచేసిన భూభారతి చట్టం అవగాహన కల్పించడానికి జిల్లా కలెక్టర్ హాజరు కాగా, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య హాజరయ్యారు. ఈ అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి చట్టంతో రైతు తమ భూ సమస్యలకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు ఉన్న సత్వరమే పరిష్కారం అయ్యే విధంగా భూభారతి చట్టంలో అవకాశం కల్పించడం జరిగిందన్నారు. గతంలో సరైన చట్టం లేకపోవడం వలన భూ సమస్యలతో రైతులు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. ధరణి పోర్టల్ లో తప్పుల సవరణకు రైతుల అనేక ఇబ్బందులు పడ్డారని, ఈ భూభారతి చట్టం వలన ఇప్పుడు ఆ ఇబ్బందులు ఉండవన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టంపై రైతులు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు రిజిస్ట్రేషన్, మ్యూ టేషన్, సర్వే నెంబర్లు రైతులు కలిగి ఉన్న గట్లు పంచాయతీలలో రెవెన్యూ కార్యాలయాలు చుట్టూ తిరిగిన ఫలితం ఉండేది కాదని, అలాంటి సమస్యలు ఇప్పుడు గ్రామస్థాయిలోని గ్రామ పాలన అధికారి విచారణలతో మన దగ్గరే పరిష్కార మార్గం జరగనుంది అన్నారు. జిల్లాలో తొమ్మిది లక్షల పైగా సాదా బైనా మా పెండింగ్ కేసులు ఉన్నాయని ఇప్పుడు భూభారతితో పూర్తిస్థాయి విచారణ చేపట్టి వాటికి పరిష్కారం సుగమం కానుంది అన్నారు. రైతాంగానికి భూ సమస్యలే కాకుండా, ఇంటి స్థలాలు, వ్యవసాయతర భూములకు సంబంధించి భూభారతిలో చట్టం తీసుకొచ్చారని, దీనివలన ప్రతి ఒక్కరికి రక్షణ కలుగుతుందన్నారు. రైతులకు అందించే పాస్ పుస్తకాలలో రైతుకు సంబంధించిన భూమి మ్యాపు సైతం (నక్ష) పొందుపరచడం జరుగుతుందని, దీనితో తమ భూమికి రక్షణ ఉంటుందన్నారు. ఒకే స్థలాన్ని పలువురికి అమ్మే మోసపూరిత వ్యక్తులకు ఇక తెరపడనుందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి చట్టం వలన అనేకమంది రైతులు ఇబ్బందులకు పాలయ్యారని రైతుల సమస్యలు పరిష్కరించుకోవడానికి భూభారతి చట్టాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి ఆవిష్కరించిందన్నారు. రైతులు వారి భూమిని నమ్ముకుని భూమి వల్ల ఇబ్బందులు పడుతున్న రైతులందరికీ భూభారతి చట్టం వరంలా మారుతుందన్నారు. జిల్లా కలెక్టర్ తెలిపిన భూభారతి చట్టం సూచనలు, అవగాహన కల్పించడం రైతులందరికీ ఎంతగానో ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. అవగాహన సదస్సు అనంతరం రైతులు పలు సమస్యలపై కలెక్టర్కు దరఖాస్తులు అందజేశారు. మీ సమస్యలకు మీ గ్రామంలోనే పరిష్కారానికి అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడం జరుగుతుందని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ మధు, తహసిల్దార్ నాగ భవాని, ఎంపీడీవో రవీందర్రావు, సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్ రావు ఇల్లందు వ్యవసాయ సంచాలకులు లాల్ చంద్, మండల వ్యవసాయ అధికారిని అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## యువత మాదకద్రవ్యాలకు, బెట్టింగులకు బానిస కావొద్దు

- క్రీడాకారులకు పూర్తి సహకారం అందిస్తా..
- మైదానానికి వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయిస్తా
- ఎమ్మెల్యే వేముల వీరేశం




**రామన్నపేట, ఏప్రిల్ 20 (జనంసాక్షి) :** యువత మాదకద్రవ్యాలకు, బెట్టింగులకు బానిస కావద్దని అందువల్ల యువత జీవితాన్ని కోల్పోతుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలో నిర్వహిస్తున్న ఆర్పిఎల్ సీజన్ 3 మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీల బహుమతుల ప్రధానోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి సాధించిన టీంకు 20 వేల రూపాయల బహుమతిని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గంగుల వెంకట్ రాజిరెడ్డి స్పాన్సర్ చేసి ఎమ్మెల్యే వేముల వీరేశం చేతుల మీదుగా అందజేశారు. రన్నర్ ఆఫ్ టీంకు 15 వేల రూపాయల బహుమతిని రామన్నపేట మేజర్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ గోదాసు శిరీష పృథ్వీరాజ్ స్పాన్సర్ చేసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ మానసిక ఉల్లాసం కలిగించే క్రీడలపై యువత ఆసక్తి పెంపొందించుకోవాలని తెలిపారు.క్రీడలు ఆడడం వల్ల శారీరక, మానసిక ధృడత్వం కలుగుతుందన్నారు. ఈ క్రీడా మైదానాన్ని యువకులు క్రీడాకారులు కాపాడుకోవాలని సూచించారు. ఈ మైదానానికి బౌండరీలు ఏర్పాటు చేసి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయిస్తానని, ఐదు లక్షలతో ఓపెన్ జిమ్‌తో పాటు ఈ మైదానం పూర్తిగా క్రీడలకు ఉపయోగించే విధంగా ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ నంద్యాల బిక్షం రెడ్డి, జిల్లా నాయకుడు గంగుల వెంకట్ రాజిరెడ్డి, జినుకల ప్రభాకర్ మాజీ సర్పంచ్ గోదాసు శిరీష పృథ్వీరాజ్, మాజీ ఎంపిటిసి ఎండి రెహాన్, ఎండి జమీరుద్దీన్,రామిని రమేష్, ఎండి అక్రమ్ మరియు క్రీడాకారులు పాల్గొన్నారు.

# లారీ చోదకుల సమస్యలు తీరేదెప్పటికీ..?



వ్యవసాయ రంగం తరువాత మన దేశంలో అత్యధిక ఉపాధి కల్పిస్తున్న రంగం రవాణా రంగం. ఈ రంగం దేశాభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుంది. భారతదేశపు ట్రక్కింగ్ పరిశ్రమ దేశ ఆర్థిక వ్యవస్థకు ఒక ముఖ్యమైన ఊతమిస్తూ జిడిపికి ఆరు శాతానికి పైగా దోహదం చేస్తోంది. లక్షలాది మందికి జీవనోపాధిని అందిస్తున్నది. ఈ కీలకమైన రంగంలో ట్రక్కు డ్రైవర్లు ఒక అనివార్యమైన పాత్రను పోషిస్తున్నారు. దేశంలో 80 లక్షలకు పైగా ట్రక్కు డ్రైవర్లు ఉన్నారని అంచనా. ట్రక్కు డ్రైవర్లకు సౌకర్యాలు మెరుగుపరచడంపై దృష్టి సారించి కేంద్ర ప్రభుత్వం 2025 సంవత్సరం నుండి కొత్తగా తయారుచేసే ఎన్2, ఎన్3 వర్గాల ట్రక్కుల డ్రైవర్ క్యాబిన్‌లో ఎయిర్ కండిషనింగ్ తప్పనిసరిగా ఉండాలని ఇదివరకే ఆదేశించింది. వేడి వాతావరణ పరిస్థితుల్లో డ్రైవర్ల అలసటను తగ్గించి తద్వారా వారి పని సామర్థ్యాన్ని పెంచాలనే అవగాహనతో ఈ నిర్ణయం తీసుకోబడింది. ఇది నిజంగా ప్రశంసనీయమైన చర్య.

### డెబ్బై శాతం రోడ్డు ద్వారానే..

2022 నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం మన దేశం తన దేశీయ సరుకులో 70% రోడ్డు మార్గం ద్వారా రవాణా చేస్తుంది. భారతీయ రహదారులపై తిరుగుతున్న ట్రక్కుల సంఖ్య 2022లో నలభై లక్షల నుండి 2050 నాటికి ఒక కోటి డెబ్బై లక్షలకు చేరుకుంటుందని నివేదికలు సూచిస్తున్నాయి. ట్రక్కులు పరిమాణం ప్రకారం రహదారి వాహనాలలో కేవలం 2% మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ భారతదేశంలోని 28 లక్షల ట్రక్కులు సమిష్టిగా సంవత్సరానికి పదివేల కోట్ల కిలోమీటర్లకు పైగా ప్రయాణిస్తూ 460 కోట్ల టన్నుల సరుకును రవాణా చేస్తున్నాయి. వార్షిక రవాణా డిమాండ్ ప్రస్తుతం 2.2 ట్రిలియన్ టన్ను-కిలోమీటర్లుగా ఉంది. 2050 నాటికి నాలుగు రెట్లు పెరిగి 9.6 ట్రిలియన్ టన్ను-కిలోమీటర్లకు చేరుకుంటుందని అంచనా వేయబడింది. రవాణా డిమాండ్ అనేది జనాభా, భూ వినియోగం, ఆర్థిక ప్రభావాలతో సహా వివిధ బాహ్య కారకాల కలయిక నుండి ఉత్పన్నమయ్యే సంచిత ప్రయాణ అవసరాన్ని సూచిస్తుంది.

### ప్రమాదాల కారణాలు

రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వ శాఖ, నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో విడుదల చేసిన వేర్వేరు గణాంకాల ప్రకారం ట్రక్కులు రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలలో ఒకటిగా ఉన్నాయి. భారతదేశంలోని "రోడ్డు ప్రమాదాలు - 2022" వార్షిక నివేదికలోని గణాంకాలను పరిశీలిస్తే 2022లో మొత్తం రోడ్డు ప్రమాదాలలో 32.9 శాతం (1,51,997), మొత్తం మరణాలలో 35.7 శాతం (55,571) జాతీయ రహదారులపైనే సంభవించాయి. కొంతమంది డ్రైవర్లు మద్యం లేదా మాదక ద్రవ్యాల ప్రభావంతో వాహనాలు నడపడం, వాహనాల అధిక బరువు వంటి అంశాలు ఈ ప్రమాదాలకు ముఖ్యమైన కారణాలుగా ఉన్నాయి.

### ఎదుర్కుంటున్న సవాళ్లు

జాతీయ రహదారులపై ట్రక్కు డ్రైవర్లు అనేక కష్టతరమైన సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలను పరిష్కరించి వారికి నాణ్యమైన డ్రైవింగ్ అనుభవాన్ని వారి జీవనోపాధిపై భరోసా ఇవ్వడం అత్యంత ప్రాముఖ్యత కలిగి ఉంది. ఈ డ్రైవర్లు తరచుగా ఆహారం, నిద్ర, విశ్రాంతి కోసం తగినంత సమయం లేక దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారు. చాలా మందికి, వారి ట్రక్కే వారి ప్రయాణాలలో తాత్కాలిక నివాసం. ఈ రంగం వృద్ధి చెందుతున్నప్పటికీ, పరిష్కారానికి ప్రత్యేక విధానం అవసరమయ్యే సంక్లిష్టమైన సవాళ్ల శ్రేణితో ఇది పోరాడుతోంది. జాతీయ రహదారులపై ప్రయాణించే ట్రక్కు డ్రైవర్లు తరచుగా తక్కువ సమయంలో సుదూర ప్రాంతాలకు సరుకులను చేర్చాలనే ఒత్తిడికి గురవుతారు, దీని కారణంగా రోజుకు ఎక్కువ గంటలు డ్రైవింగ్ చేయవలసి వస్తుంది. ఫలితంగా వాహన వేగాన్ని పెంచుతారు. గణనీయమైన సంఖ్యలో డ్రైవర్లు రోజుకు 14 గంటల వరకు వాహనాలు నడుపుతున్నారని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఇది ప్రమాదాల తీవ్రతను గణనీయంగా పెంచుతుంది. వారి నిరంతరాయమైన పని స్వభావం కారణంగా దాదాపు 50% మంది ట్రక్కు డ్రైవర్లు డ్రైవింగ్ సంబంధిత ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఎక్కువసేపు కూర్చోవడం తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. సమయం లేకపోవడం లేదా వారికి అలవాటైన భోజనం అందుబాటులో లేకపోవడం వల్ల 70% కంటే ఎక్కువ మంది డ్రైవర్లు పోషకమైన ఆహారం తీసుకోలేకపోతున్నారు. ఇది ఊబకాయం, ఎముకలు, కండరాల సంబంధిత రుగ్మతలు, అధిక రక్తపోటు, నిద్రలేమి, అధిక ఒత్తిడి స్థాయిలు, డీహైడ్రేషన్ వంటి అనేక ఆరోగ్య సమస్యలకు వారిని గురిచేస్తుంది. చాలా మంది స్థానిక భాష తెలియకపోవడం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రయాణంలో అనారోగ్యానికి గురైతే, ఆర్థిక ఇబ్బందుల కారణంగా సరైన వైద్య సంరక్షణ పొందలేకపోతున్నారు. వాహనాలు మొరాయించినా లేదా ప్రమాదాలకు గురైనా తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. అంతేకాకుండా కొన్ని మార్గాల్లో దోపిడీలు సర్వసాధారణం. సరుకు దొంగతనాలు తరచుగా జరుగుతున్నాయి. దురదృష్టవశాత్తు ఈ నేరాలకు ప్రతిఘటించే డ్రైవర్లు హత్యకు గురయ్యే ప్రమాదం కూడా ఉంది. స్థానిక సమాజాల నుండి మద్దతు తరచుగా ఉండదు. ఇంటి నుండి ఎక్కువ కాలం దూరంగా ఉండటం అనేక మంది డ్రైవర్లలో మానసిక వేదనకు దారితీస్తుంది. అదనంగా అసురక్షిత లైంగిక కార్యకలాపాలలో పాల్గొనడం లైంగికంగా సంక్రమించే అంటువ్యాధులు, హెచ్ఐవితో సహా ప్రమాదాన్ని పెంచుతుంది. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న ఈ డ్రైవర్లకు సాధారణంగా నెలవారీ జీతాలు ఉండవు, వారు ట్రిప్పులు చేసిన రోజులకు మాత్రమే వేతనాలు పొందుతారు. ఈ అస్థిరమైన ఆర్థిక పరిస్థితి వారి కుటుంబాలను పోషించడం కష్టతరం చేస్తుంది. యువత ఈ వృత్తిని స్థిరమైన కెరీర్ మార్గంగా ఎంచుకోవడానికి వెనుకడుగు వేయడానికి ఇది ఒక కారణం. మన దేశంలో ట్రక్కు డ్రైవర్ సగటు వార్షిక జీతం సుమారు ?3,14,600 లేదా నెలకు ?17,040, ఇది జాతీయ సగటు జీతం ?72,900 కంటే 19% తక్కువ. ఈ రంగంలో అధికారికీకరణ ఇంకా అభివృద్ధి చెందుతున్న దశలోనే ఉండటం వల్ల ట్రక్కింగ్ యొక్క వాంఛనీయ సామర్థ్యాన్ని ఉపయోగించుకోవడానికి అర్హత కలిగిన డ్రైవర్ల కొరత ఇటీవలి కాలంలో ఈ రంగాన్ని వేధిస్తున్న ఒక నిరంతర సమస్య. మన దేశంలో డ్రైవర్-టూ-ట్రక్ నిష్పత్తి ఇప్పటికీ 1000 ట్రక్కులకు 750 కంటే తక్కువగా ఉంది. దీని ఫలితంగా కొన్ని సమయాల్లో 25% నుండి 30% ట్రక్కులు డ్రైవర్లు లేకపోవడం వల్ల ఖాళీగా ఉండిపోతున్నాయి.

### పరిష్కారాలు

కేంద్ర ప్రభుత్వం ట్రక్కు యజమానులను డ్రైవర్లకు నెలవారీ జీతం ఇచ్చేలా ఒప్పించాలి. కనీస వేతన ప్రమాణాలను అమలు చేయాలి. రహదారులపై పెట్రోలింగ్‌ను పెంచడం ద్వారా డ్రైవర్లు తమ ప్రయాణాలలో ఎదుర్కొనే అనేక సమస్యలను పరిష్కరించాలి. డ్రైవర్ల కోసం జాతీయ రహదారులపై ప్రత్యేక విశ్రాంతి స్థలాలను అభివృద్ధి చేయడం చాలా అవసరం. రాత్రిపూట బస చేయడానికి వసతి సౌకర్యాలు కల్పించాలి. ప్రతి 400 కిలోమీటర్లకు హైవేల వెంట వారి ప్రత్యేక అవసరాల కోసం ఆసుపత్రులను ఏర్పాటు చేయాలి. ప్రతి డ్రైవర్‌ను సమగ్ర ప్రమాద బీమా పరిధిలోకి తీసుకురావాలి. ఈ చర్యలన్నీ ఒకేసారి సాధ్యం కానప్పటికీ, డ్రైవర్లకు క్రమంగా సౌకర్యాలు కల్పిస్తే మనం నిస్సందేహంగా ఉన్నతమైన నాణ్యమైన సేవలను పొందగలుగుతాము.

**జనక మోహన రావు దుంగ**
**ఫోన్ : 8247045230**

# విపణి


## 2025లోనూ లేఆఫ్‌లు

### వ్యయ నియంత్రణ చర్యలకు దిగిన టెక్ దిగ్గజాలు
### గూగుల్, మైక్రోసాఫ్ట్, మెటా, టిక్‌టాక్

న్యూఢిల్లీ: ఈ ఏడాది ప్రారంభం నుంచే గూగుల్, మైక్రోసాఫ్ట్, మెటా, టిక్‌టాక్ వంటి టెక్ దిగ్గజాలు లేఆఫ్‌లు ప్రకటిస్తున్నాయి. లేఆఫ్ ట్రాకింగ్ ప్లాట్‌ఫామ్ ట్రూఅప్ డేటా ప్రకారం, 2025లో ఇప్పటి వరకు 234 లేఆఫ్‌ల ద్వారా 45,656 మంది ఉద్యోగులను తగ్గించుకున్నాయి. అంటే సగటున ఒక రోజుకు 439 మంది ఉద్యోగులు ఇంటి ముఖం పట్టారు. 2024లో 1,115 లేఆఫ్‌ల ద్వారా 2,38,461 మంది ఉద్యోగులను టెక్ కంపెనీలు తగ్గించుకున్నాయి. అంటే రోజుకు సగటున 653 మందిని ఇంటికి పంపించేశారు. వ్యయాలు తగ్గించుకోవడంతో పాటు పునర్నిర్మాణంలో భాగంగా ఏఐ వంటి సాంకేతికతలకు ప్రాధాన్యం



ఇవ్వడానికి వీలుగా ఆయా కంపెనీలు ఉద్యోగుల్ని తగ్గించుకుంటున్నాయి. గూగుల్ ఈ ఏడాది మూడోసారి లేఆఫ్‌లను ప్రకటించింది. ఆండ్రాయిడ్, పిక్సెల్, క్రోమ్ బ్రౌజర్‌ను నిర్వహిస్తున్న తన ప్లాట్‌ఫామ్స్ అండ్ డివైజెస్ యూనిట్‌లో వందలాది మందికి ఉద్వాసన పలికింది. 2024లో ఆండ్రాయిడ్, పిక్సెల్ విభాగాలను విలీనం చేసిన తర్వాత ఈ ఏడాది ప్రారంభంలోనే అమెరికాలోని ఉద్యోగుల కోసం స్వచ్ఛంద పదవీ విరమణ ప్రకటించింది. ఫిబ్రవరిలో గూగుల్ క్లౌడ్ విభాగం నుంచి ఉద్యోగులను తొలగించింది. మైక్రోసాఫ్ట్ వ్యవస్థాగత నిర్మాణంలో భాగంగా మేలో లేఆఫ్‌లు ప్రకటించబోతోందని సమాచారం. ఈ విడతలో మధ్య స్థాయి మేనేజ్‌మెంట్ ఉద్యోగులను తగ్గించడంపై దృష్టి సారించనుంది. ప్రాజెక్ట్ బృందాల్లో నాన్-టెక్నికల్ సిబ్బంది కంటే ఇంజినీర్లు ఎక్కువగా ఉండేలా చూసుకోనుంది. ఛార్లీ బెల్ నేతృత్వం వహిస్తున్న మైక్రోసాఫ్ట్ సెక్యూరిటీ విభాగం ఇంజినీర్-టు-ప్రాజెక్ట్ మేనేజర్ నిష్పత్తిని 5.5:1 నుంచి 10:1కి పెంచుకోవాలనే లక్ష్యంతో ఉంది. ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటా ఫిబ్రవరిలో సుమారు 3,600 మంది ఉద్యోగులను తొలగించింది. ప్రపంచ వ్యాప్తంగా ఈ సంస్థకు ఉన్న ఉద్యోగుల్లో వీరు 5 శాతానికి సమానం. టిక్‌టాక్‌లో సుమారు 300 మంది ఉద్యోగులకు ఏప్రిల్‌లో లేఆఫ్‌లు ప్రకటించే అవకాశం ఉంది.





## ఏఐలో పెట్టుబడులు భారత్‌లో అంతంతే..

**'ఏఐ'లో భారత్ ఎంతో క్రియాశీలకంగా ఉన్నా ప్రైవేట్ రంగం నుంచి పెట్టుబడులు సాధించడంలో భారత్ వెనకబడి ఉంది. ఈ రంగంలో పరిశోధనల విషయంలోనూ మనకు భాగస్వామ్యం తక్కువే.ఏఐ మోడళ్ల నాణ్యత విషయంలోనూ చైనా ఎంతో మెరుగ్గా ఉంది. లాటిన్ అమెరికా, పశ్చిమాసియా, ఆగ్నేయాసియాల నుంచి ఏఐ మోడళ్ల అభివృద్ధి ఎక్కువగా ఉందని స్టాన్‌ఫోర్డ్ నివేదిక పేర్కొంది.గత ఏడాది మార్చిలో భారత్ ఏఐ మిషన్‌ను ప్రారంభించింది. ఇందుకోసం 1.25 బి.డాలర్లతో ఒక ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసింది.**

ఏఐ నిపుణుల నియామకాలు, సాంకేతికత అభివృద్ధి కార్యకలాపాల్లో భారత్ ఎంతో క్రియాశీలకంగా ఉందని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ తాజా నివేదిక వెల్లడించింది.కానీ, ప్రైవేట్ రంగం నుంచి ఏఐ పెట్టుబడులు సాధించడంలో భారత్ వెనకబడి ఉంది. 2013 నుంచి భారతీయ ఏఐ రంగంలోకి 11.29 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. ఇదే సమయంలో అమెరికా 470.9 బి.డాలర్లు, చైనా 119.3 బి.డాలర్ల పెట్టుబడులను ఆకర్షించింది. యూకే 28.2 బి.డాలర్లను 2024లోనే సంపాదించింది. ఏఐ పెట్టుబడుల విషయంలో అమెరికా ఎంతో ముందుంది. 109.1 బి.డాలర్ల పెట్టుబడులను పెట్టింది. ఇది చైనా పెట్టుబడి 9.3 బి.డాలర్లతో పోలిస్తే 12 రెట్లు అధికం.అంకురాల విషయంలోనూ భారత్ ఏమంత ఆశాజనకంగా లేదు. 2024లో కేవలం 74 ఏఐ స్టార్టప్‌లే ఇక్కడ ఆవిర్భవించాయి. అమెరికాలో 1,073, యూకేలో 116, చైనాలో 98 అంకురాలు వచ్చాయి. ఏఐ పరిశోధనల విషయంలోనూ భారత భాగస్వామ్యం తక్కువే. బాధ్యతాయుతమైన ఏఐపై భారత్ 2024లో 42 పరిశోధనా పత్రాలు సమర్పించింది. అమెరికా 669, చైనా 268 పత్రాలను సమర్పించాయి.ఏఐ మోడళ్ల నాణ్యత విషయంలోనూ చైనా ఎంతో మెరుగ్గా ఉంది. డీప్‌సీక్, క్వెన్, మానస్‌లాంటి ఏఐ మోడళ్లు ఇందుకు తోడ్పడ్డాయి. అమెరికా 40, చైనా 15, యూరప్ 3 వరకు ముఖ్యమైన ఏఐ మోడళ్లను విడుదల చేశాయి. లాటిన్ అమెరికా, పశ్చిమాసియా, ఆగ్నేయాసియాల నుంచి ఏఐ మోడళ్ల అభివృద్ధి ఎక్కువగా ఉందని స్టాన్‌ఫోర్డ్ నివేదిక పేర్కొంది.గత ఏడాది మార్చిలో భారత్ ఏఐ మిషన్‌ను ప్రారంభించింది. ఇందుకోసం 1.25 బి.డాలర్లతో ఒక ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమం కింద 10,000 జీపీయూలను ప్రారంభించడం, జాతీయ వ్యక్తిగతేతర డేటా ప్లాట్‌ఫామ్‌ను సృష్టించడం, దేశీయ అంకురాలు, ఏఐ మోడళ్లకు మద్దతు ఇవ్వడం లక్ష్యంగా పెట్టుకుంది. నైతికతతో ఏఐ అభివృద్ధి, ప్రధాన మెట్రో నగరాల్లోనే కాకుండా ఇతర ప్రాంతాల్లోనూ ఏఐ పరిశోధనా సామర్థ్యాన్ని విస్తరించడమూ ఇందులో భాగమే. ఇతర దేశాలతో పోలిస్తే ఈ పెట్టుబడి స్థాయి ఎంతో తక్కువగా ఉంది. కెనడా 2.4 బి.డాలర్లు, ఫ్రాన్స్ 117 బి.డాలర్లు, సౌదీ అరేబియా 100 బి.డాలర్లతో సెమీ-కండక్టర్ల ఆధారిత ఏఐ అభివృద్ధి కోసం ప్రణాళికలను ప్రకటించాయి.ఏఐ ఉద్యోగ నియామకాల్లో గణనీయ వృద్ధి కనిపించినప్పటికీ.. భారతీయ రిక్రూటర్లు సరైన ప్రతిభ దొరక్క ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2025 ఫిబ్రవరి లింక్డ్ఇన్ నివేదిక ప్రకారం.. దేశంలో 54 శాతం హెచ్‌ఆర్ నిపుణులు తమకు అందే ఉద్యోగ దరఖాస్తుల్లో సగం లేదా అంతకంటే తక్కువ మంది మాత్రమే అవసరమైన అర్హతలను కలిగి ఉన్నారని చెప్పారు. సాంకేతికత, సాఫ్ట్‌స్కిల్స్ రెండింటినీ ఉన్న అభ్యర్థులను నియమించుకోవడం సవాలేనని పేర్కొన్నారు. ఉద్యోగ అర్హతల్లో 80% ఉన్న అభ్యర్థులనే తాము పరిగణనలోకి తీసుకుంటున్నామని తెలిపారు. ఒక అధ్యయనం ప్రకారం.. 2027 నాటికి భారత్‌కు 23 లక్షల మందికి పైగా ఏఐ నిపుణులు అవసరం. కానీ, ప్రస్తుత నిపుణుల సంఖ్య ప్రకారం 2024లో 8 లక్షలు, 2025 నాటికి 9.40 లక్షలు, 2026 నాటికి 10.8 లక్షల మంది నిపుణులే అందుబాటులో ఉంటారు. అంటే.. ఇంకా 10 లక్షల కంటే ఎక్కువ మంది నిపుణుల కొరత ఉంది. భారతీయ విద్య, నైపుణ్యాభివృద్ధికి ఇది ఒక సవాలు, అదే సమయంలో అవకాశాలను సూచిస్తోంది. ఇప్పటికే ఉన్న ఐటీ నిపుణులు తమ నైపుణ్యాలను 'రీస్కిల్లింగ్' చేసుకోవాల్సిన అవసరమూ కనిపిస్తోంది.ఏఐ సంబంధిత గిట్‌హబ్ ప్రాజెక్టుల్లో 19.9% వాటాతో భారత్ కీలకంగా ఉంది. అమెరికా 23.4%, ఐరోపా 19.5 శాతంతో ఉన్నాయి. ఓపెన్-సోర్స్ ఏఐ అభివృద్ధిలో భారత్‌కు పెరుగుతున్న ప్రాధాన్యాన్ని ఇది సూచిస్తోంది. ఈ సమాచారం లింక్డ్ఇన్ ఆధారంగా తీసుకున్నారు. భారత్‌లాంటి దేశాల్లో దీని వినియోగం అంతగా ఉండదని, కాబట్టి, సమాచారంలో కొంత వ్యత్యాసం ఉండొచ్చనీ నివేదిక పేర్కొంది.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 4.05 | ₹ 4.07 |

### బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 89,450 (22 క్యారెట్లు) | ₹ 97,580 (24 క్యారెట్లు) |
|---|---|

### వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్

₹ 1,10,000



## 2026 చివరి కల్లా కొత్తగా 19 ప్రీమియం షాపింగ్ మాల్స్

**దేశంలోని 8 ప్రధాన నగరాల్లో అందుబాటులోకి: నివేదిక**

ఢిల్లీ: 2026 చివరినాటికి దేశంలోని 8 ప్రధాన నగరాల వ్యాప్తం గా 19 కొత్త ప్రీమియం షాపింగ్ మాల్స్ అందుబాటులోకి వస్తా యని కుష్‌మ్యాన్ అండ్ వేక్‌ఫీల్డ్ నివేదిక తెలిపింది. పెరుగుతున్న గిరాకీకి తగ్గట్లుగా వ్యాపారాన్ని విస్తరించేందుకు రిటెయిలర్లు యోచన చేస్తుండటమే ఇందుకు కారణంగా పేర్కొంది. ఢిల్లీ- ఎన్‌సీఆర్, ముంబయి, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, పుణె, అహ్మదాబాద్- ఈ 8 నగరాలపై ఈ నివేదికను కుష్‌మ్యాన్ అండ్ వేక్‌ఫీల్డ్ రూపొందించింది. 2025, 2026 క్యాలెండర్ సంవత్సరాల్లో 123 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 19 గ్రేడ్ ఏ షాపింగ్ మాల్‌ల కార్యకలాపాలు ప్రారంభం అవుతాయని తెలిపింది. ఇందులో 86 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో సుపీరియర్ గ్రేడ్ (గ్రేడ్ ఏ- ప్లస్) షాపింగ్ మాల్స్ ఉంటాయని పేర్కొంది. సంఖ్య కంటే కూడా నాణ్యతకు ఈ రంగం ప్రాధాన్యం ఇస్తోం దని విషయాన్ని ఇది తెలియజేస్తోందని నివేదిక వెల్లడించింది. 100 కోట్ల డాలర్లకు బ్రాండెడ్ రెసిడెన్సీలు, రిసార్ట్‌ల విపణి: బ్రాండెడ్ గృహ సముదాయాలు (రెసిడెన్సీస్), రిసార్ట్‌ల మార్కెట్ పరిమాణం 2027 కల్లా 100 కోట్ల డాలర్లకు (దాదాపు రూ.8,500 కోట్లు) చేరుతుందని విలాసవంత రిసార్ట్‌ల అభివృద్ధి సంస్థ ఫైన్ ఎకర్స్ తెలిపింది. 2025-26లో 11-12% వృద్ధి రేటును నమోదు చేసే అవకాశం ఉందని.. 2030 నాటికి వార్షిక వృద్ధి 15 శాతానికి చేరుతుందని పేర్కొంది. బ్రాండెడ్ నివాస సముదాయాల్లో ఢిల్లీ-ఎన్‌సీఆర్, జయపుర, బెంగళూ రు, పుణె కీలక మార్కెట్లుగా ఉన్నాయి. హైదరాబాద్, అహ్మద్ బాద్ లాంటి విపణులు కూడా ఈ విభాగంలో వేగంగా వృద్ధి చెందుతున్నాయని పేర్కొంది.

## విమానాశ్రయం.. విలాసవంతం

- ప్రపంచంలోని టాప్ 20 ఎయిర్‌పోర్ట్‌లు
- ఉత్తమ విమానాశ్రయంగా సింగపూర్ చాంగి ఎయిర్‌పోర్ట్
- రికార్డు స్థాయిలో 13వసారి ఈ టైటిల్ సొంతం
- దక్షిణాసియాతోపాటు ఇండియాలో మొత్తానికి ఉత్తమ విమానాశ్రయంగా ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ రికార్డు



ప్రపంచంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉత్తమ విమానాశ్రయంగా సింగపూర్ చాంగి ఎయిర్‌పోర్ట్ నిలిచిందని స్కైట్రాక్స్ ప్రకటించింది. ఈ విమానాశ్రయం రికార్డు స్థాయిలో 13వసారి ఈ టైటిల్ గెలుచుకోవడం గమనార్హం.జ్యువెల్ కాంప్లెక్స్, ఇండోర్ జలపాతం, ఆకర్షణీయ గార్డెన్‌లకు చాంగి ఎయిర్‌పోర్ట్ ప్రసిద్ధి చెందింది. తర్వాతి స్థానాల్లో హమద్ (దోహా), హనేడా (టోక్యో) విమానాశ్రయాలు నిలిచాయి. దక్షిణాసియాతోపాటు ఇండియాలో ఉత్తమ విమానాశ్రయంగా ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ నిలిచింది.చాంగి ఎయిర్‌పోర్ట్ 2024లో 8 కోట్ల మందిని తమ గమ్యస్థానాలకు చేరవేసింది. ఇందులో 10 అంతస్తుల జ్యువెల్ షాపింగ్ కాంప్లెక్స్ ఎంతో ప్రసిద్ధి చెందింది. ఇందులో బటర్‌ఫ్లై పార్క్, ఇండోర్ గార్డెన్లు, జలపాతాలు ఉన్నాయి. ఎయిర్‌పోర్ట్ ఆవరణలో స్పాలు, హోటళ్లు, కళా ప్రదర్శనలు, మ్యూజియం, సినిమా థియేటర్, అమ్యూజ్‌మెంట్ పార్క్‌లు ఉన్నాయి. దోహాలోని హమద్ అంతర్జాతీయ విమానాశ్రయం గతంలో మూడుసార్లు ప్రపంచ ఉత్తమ విమానాశ్రయంగా నిలిచింది. అయితే ఈ సంవత్సరం ఇది రెండో స్థానానికి చేరింది. టోక్యోలోని హనేడా విమానాశ్రయం ప్రపంచంలోనే అత్యంత పరిశుభ్రమైన విమానాశ్రయంగా గుర్తింపు పొందింది. దాంతోపాటు ప్రపంచంలోనే ఉత్తమ డొమెస్టిక్ ఎయిర్ పోర్ట్‌గా, పీఆర్‌ఎమ్ యాక్సెసబుల్ సౌకర్యాలను అందించడంలో టాప్‌లో నిలిచింది. ప్రపంచంలోని టాప్ 20 విమానాశ్రయాల జాబితాలో ఏ భారతీయ విమానాశ్రయం లేనప్పటికీ ఢిల్లీ అంతర్జా తీయ విమానాశ్రయం దేశంతోపాటు దక్షిణాసియాలో ఉత్తమ విమానాశ్రయంగా గుర్తింపు పొందింది. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం ఇండియా, దక్షిణాసియాలో ఉత్తమ విమానాశ్రయ సిబ్బంది సర్వీస్ అవార్డును అందుకుంది. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం ఇండియా, దక్షిణాసియాలో ఉత్తమ విమానాశ్రయ సిబ్బంది సర్వీస్ అవార్డును అందుకుంది .బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయం ఇండియా, దక్షిణాసియాలో ఉత్తమ ప్రాంతీయ విమానాశ్రయంగా అవార్డును గెలుచుకుంది. గోవాలోని మనోహర్ అంతర్జాతీయ విమానాశ్రయం ఐదు మిలియన్ల కంటే తక్కువ ప్రయాణీకుల విభాగం లో ఉత్తమ విమానాశ్రయంగా గుర్తింపు సాధించింది.

**ఉత్తమ విమానాశ్రయాల జాబితా:** సింగపూర్ చాంగి విమానాశ్రయం,హమద్ అంతర్జాతీయ విమానాశ్రయం, దోహా టోక్యో అంత ర్జాతీయ విమానాశ్రయం (హనేడా),ఇంచియాన్ అంతర్జాతీయ విమానాశ్రయం, దక్షిణ కొరియా నరిటా అంతర్జాతీయ విమానాశ్రయం, జపాన్‌హాంగ్‌కాంగ్ అంతర్జాతీయ విమానాశ్రయం, పారిస్ చార్లెస్ డి గాల్ విమానాశ్రయం, రోమ్ ఫియుమిసినో విమానాశ్రయం, మ్యూనిచ్ విమానాశ్రయం, జ్యూరిచ్ విమానాశ్రయం, దుబాయ్ అంతర్జాతీయ మానాశ్రయం,హెల్సింకి-వాంటావా విమానాశ్రయం,వాంకోవర్ అంతర్జాతీయ విమానాశ్రయం, ఇస్తాంబుల్ విమానాశ్రయం, వియన్నా అంతర్జాతీయ విమానాశ్రయం,మెల్‌బోర్న్ మానాశ్రయం చుబు సెంట్రైర్ విమానాశ్రయం, జపాన్ కోపెన్ హాగన్ విమానాశ్రయం ఆమ్ స్టర్ డామ్ షిపోల్ విమానాశ్రయం బహ్రెయిన్ అంతర్జాతీయ విమానాశ్రయం.

# జాతీయం అంతర్జాతీయం





## అమెరికాకు పార్సిల్ సరఫరాకు డీహెచ్‌ఎల్ బ్రేకులు

### కొన్ని రకాల కొరియర్ సేవలు నిలిపివేసిన జర్మనీకి కొరియర్ సేవల దిగ్గజం

**జనంసాక్షి:** జర్మనీకి చెందిన కొరియర్ సేవల దిగ్గజం డీహెచ్‌ఎల్ 800 డాలర్ల కంటే విలువైన ప్యాకేజీలను అమెరికాలో డెలివరీ చేయడాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది.ట్రంప్ ప్రభుత్వం ప్రకటించిన టారిఫ్‌లు, చెకింగ్‌లు కఠినం కావడంతో ఈ నిర్ణయం తీసుకొన్నట్లు వెల్లడించింది. ఇక బిజినెస్ టూ బిజినెస్ షిప్‌మెంట్లు మాత్రం కొనసాగుతాయని.. కాకపోతే వాటిల్లో కూడా ఆలస్యం చోటు చేసుకోవచ్చని వెల్లడించింది.గతంలో 2,500 డాలర్ల వరకు విలువైన ప్యాకేజీలను అతి తక్కువ పేపర్ వర్క్‌తో అమెరికాలో డెలివరీ చేసే అవకాశం ఉండేది. కానీ, ఇప్పుడు అది కూడా లేదు.. తనిఖీలు కూడా పెరిగాయి. ప్రస్తుతం 800 డాలర్ల కంటే తక్కువ విలువైన వాటిని అమెరికాకు డెలివరీ చేస్తోంది. కాకపోతే వీటి డెలివరీలకు సంబంధించిన చట్టాల్లోని అడ్డదారులను మూసేందుకు శ్వేతసౌధం సిద్ధమైంది. ముఖ్యంగా చైనా, హాంకాంగ్ నుంచి వచ్చే వాటి విషయంలో అప్రమత్తంగా ఉంది.సింథటిక్ డ్రగ్స్‌ను అమెరికాలో సరఫరా చేయడానికి చైనా కొరియర్ మార్గాలను వాడుకొంటున్నట్లు ట్రంప్ కార్యవర్గం అనుమానిస్తోంది. ఈ నేపథ్యంలో సింథటిక్ ఒపియాడ్ పంపిణీ వ్యవస్థను అడ్డుకోవాలని అధికారులకు సూచించింది. మరోవైపు బీజింగ్ మాత్రం ఫెంటనిల్‌ను అమెరికా సమస్యగా అభివర్ణించింది. తమ దేశంలో మాత్రం మాదకద్రవ్యాలపై కఠిన చట్టాలు అమల్లో ఉన్నాయని పేర్కొంది.గత వారం హాంకాంగ్ పోస్టు కూడా అమెరికాకు సముద్ర మార్గాన ప్యాకేజీల సరఫరాను ఏప్రిల్ 27 నుంచి పంపడం ఆపేస్తున్నట్లు వెల్లడించింది. అమెరికాకు పార్శిళ్లను ఇక తీసుకోమన్నారు. అమెరికా అకారణంగా వేధిస్తోందని ఆరోపించింది.

## తప్ప తాగి..రచ్చ రచ్చ

**మద్యం మత్తులో ర్ధరాత్రి రోడ్డు మీద యువతి హంగామా..**

న్యూఢిల్లీ: ఉత్తరాఖండ్ లోని హరిద్వార్ లో ఒక యువతి రోడ్డుమీద తాగిన మైకంలో రచ్చ రచ్చ చేసింది.ఈ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ గామారింది. ఉత్తరాఖండ్ లోని హరిద్వార్ లో యువతి తప్పతాగి రచ్చ రచ్చచేసింది. డెహ్రాడూన్, ఢిల్లీ హైవే మీద ఈ ఘటన చోటు చేసుకుంది. యువతి ఫుల్ గా తాగి వచ్చి రోడ్డు మీదకు వచ్చింది. అక్కడ వచ్చి పోయే వాహనాలు ఆపి దాని పైన ఎక్కి న్యూసెన్స్ చేసింది. కార్లను ఆపుతు.. రోడ్డుమీద పడుకుని, తూలుతు నానా రభస చేసింది. దీంతో ఆ మార్గంలో వెళ్తున్న ప్రయాణికులు ఒక్కసారిగా షాక్ కు గురయ్యారు.అక్కడున్న కొంత మంది యువతికి నచ్చ చేప్పేందుకు ప్రయత్నించారు. కానీ ఆమె ఫుల్ గా తాగి ఉండటం వల్ల ఎవరి మాటలు పట్టించుకోకుండా.. ఇష్టమున్నట్లు ప్రవర్తించింది.చివరకు పోలీసులకు సమాచారం ఇవ్వగా..అదుపులోకి తీసుకు న్నారు. ఆమె వివరాలు తెలుసుకుని, ఇంట్లో వాళ్లకు సమాచారం ఇచ్చారు.



## పాకిస్థాన్‌లో హిందూ నేతపై దాడి.. ఖండించిన ప్రధాని షెహబాజ్



**ఇస్లామాబాద్:** పాకిస్థాన్‌లోని సింధ్‌కు చెందిన ముస్లిం లీగ్-నవాజ్ శాసనసభ్యుడు, మత వ్యవహారాల సహాయ మంత్రి ఖేల్ దాస్ కోహిస్తానీపై దాడి జరిగింది.ఈ విషయంపై పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ స్పందించారు. ప్రజా ప్రతినిధులపై దాడులు ఆమోదయోగ్యం కాదని.. ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంపై తాను కోహిస్తానీతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిపారు. సింధ్ ముఖ్యమంత్రి సయ్యద్ మురాద్ అలీ షా సైతం ఈ చర్యను తీవ్రంగా ఖండించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే హక్కు ఎవరికీ లేదని.. దాడిలో పాల్గొన్న దుండగులను వెంటనే అరెస్టు చేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అసలేమయ్యిందంటే.. హిందూ నేత అయిన ఖేల్ దాస్ కోహిస్తానీ పాకిస్థాన్ ముస్లిం లీగ్-నవాజ్ శాసనసభ్యుడిగా, మత వ్యవహారాల సహాయ మంత్రిగా ఉన్నారు. సింధ్ రాష్ట్రంలో నిర్మించనున్న నూతన కాలువలకు ఇటీవల ఆయన ప్రణాళికను రూపొందించారు. అయితే దీనివల్ల తమకు నష్టం వాటిల్లుతుందని పేర్కొంటూ..కొందరు వ్యక్తులు ఆయనకు వ్యతిరేకంగా మొదట నిరసన చేపట్టారు. శనివారం ఆయన సింధ్‌లోని తట్టా జిల్లా గుండా వెళ్తుండగా, నిరసనకారులు సమాఖ్య ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ..ఆయన కాన్వాయ్‌పై కర్రలు, టమోటాలు, బంగాళాదుంపలతో దాడి చేశారు. అయితే ఈ దాడిలో కోహిస్తానీకి ఎటువంటి గాయాలు కాలేదని అధికారులు వెల్లడించారు.

## బైడెన్, అసమర్ధ న్యాయమూర్తుల వల్ల దేశంలోకి అక్రమవలసలు

దర్యాప్తు అధికారులను లక్ష్యంగా చేసుకొని ధ్వజమెత్తారు. వారి చర్యల వల్లే దేశంలో అక్రమ వలసదారులు పెరిగారని దుయ్యబట్టారు. "హంతకులను, మాదకద్రవ్యాల వ్యాపారం చేసేవారిని, ప్రమాదకరమైన నేరస్థులను, ఎంఎస్-13 గ్యాంగ్ సభ్యులను, గృహహింసకు పాల్పడేవారిని మన దేశంలోకి తీసుకువచ్చేందుకు పోరాడుతున్న, కుట్ర పన్నుతున్న వారికి సహా అందరికీ ఈస్టర్ శుభాకాంక్షలు. ఇటువంటి వ్యక్తులు మన దేశంపై హింసాత్మక దాడులకు పాల్పడేందుకు అనుమతిస్తున్న అసమర్ధ న్యాయమూర్తులు, దర్యాప్తు అధికారులకు కూడా శుభాకాంక్షలు" అని డొనాల్డ్ ట్రంప్ వ్యంగ్యంగా పోస్టు పెట్టారు.

## నా కలను సాకారం చేసింది ఆయనే

### లలిత్ మోదీ



ఐపీఎల్ కార్యరూపం దాల్చడంలో శరద్ పవార్ పాత్ర ఎంతో ఉందని లలిత్ మోదీ పేర్కొన్నాడు. ఈ ఆటను గ్లోబల్ ఐకాన్‌గా నిలిపిన ఆ సీనియర్ నేతను మరచిపోవద్దన్నారు.ఐపీఎల్ రూపకల్పనలో పవార్ కీలకంగా వ్యవహరించారని పేర్కొంటూ ఆంగ్ల పత్రికలో వచ్చిన ఓ వార్తా కథనాన్ని ప్రస్తావిస్తూ లలిత్ ఈ విధంగా స్పందించారు."ఇది అక్షరాల నిజం. శరద్ పవార్ వల్లే అది సాధ్యమైంది. ఆయన నాపై ఉంచిన విశ్వాసం, 100శాతం ప్రోత్సహించడం వల్లే ఐపీఎల్ కార్యరూపం దాల్చింది. ఈ విషయంలో మనందరం ఆయనకు ధన్యవాదాలు చెప్పాలి. నా కలను ఆయన సాకారం చేశారు. పవార్ దార్శనికతను ఎన్నడూ మరచిపోవద్దు. ఈ విషయంలో ఆయనకు సెల్యూట్" అని లలిత్ మోదీ తన సామాజిక మాధ్య ఖాతాల్లో పోస్టు చేశాడు.ముంబయిలోని వాంఖడే స్టేడియంలోని ఓ విభాగానికి శరద్ పవార్ పేరు పెట్టాలని ముంబయి క్రికెట్ అసోసియేషన్ ఇటీవల తీసుకున్న నిర్ణయంపై సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఐపీఎల్‌లో శరద్ పవార్ పాత్రకు సంబంధించి మీడియాలో కథనాలు వచ్చాయి. ఇదిలాఉంటే, శరద్ పవార్ ముంబయి క్రికెట్ అసోసియేషన్‌కు అనేక పర్యాయాలు అధ్యక్షుడిగా పనిచేశారు. 2005 నుంచి 2008 వరకు బీసీసీఐ అధ్యక్షుడిగా, 2010 నుంచి 2012 వరకు ఐసీసీ అధినేతగానూ సేవలందించారు.

# ధరణి దగాకు భూభారతితో కట్టడి

**కెసిఆర్ దుశ్చర్యలకు కళ్లెం నిర్మల్ ఇన్చార్జి మంత్రి సీతక్క**




**ఖానాపూర్ ఏప్రిల్ 20 (జనం సాక్షి) :** గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం భూములపై ధరణి పేరుతో చేసిన దగాకు ప్రజా ప్రభుత్వం భూ భారతి తో కళ్లెం వేసిందని జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క అన్నారు. శనివారం రాత్రి మండల అభివృద్ధి కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భూభారతి అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. భూభారతి సదస్సులు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భూ సమస్యలు పూర్తిగా పరిష్కరించేందుకే భూ భారతి నిర్మాణం జరిగిందన్నారు. ధరణిలోని లోపాలను గుర్తించి భూభారతికి కఠినమైన చట్టబద్ధత కల్పిస్తూ ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, మేధావులు అందరి అభిప్రాయాల మేరకే భూభారతి నిర్మాణం జరిగిందన్నారు. గత 50 సంవత్సరాల కాలంగా భూ సమస్యలు ఎదుర్కొంటున్న సాధారణ రైతు కుటుంబాలకు భూభారతితో తప్పకుండా న్యాయం చేకూరుతుందని ఆమె భరోసా ఇచ్చారు. భూస్వాములకు అండగా ఉండే విధంగా ధరణిని ఏర్పాటు చేసి కేసీఆర్ ప్రభుత్వం ఆధారాలు లేని వారికి ధరణి పేరుతో ఆధారాలు సృష్టించి నిరుపేద రైతులు, బడుగు బలహీన వర్గాలను ఇబ్బందులకు గురిచేసిన బి.ఆర్.ఎస్ ప్రభుత్వ చర్యలకు భూభారతితో కట్టడి చేసే విధంగా ప్రభుత్వ%శీ% భూభారతిని అమలు పరుస్తుందని మంత్రి అన్నారు. స్థానికంగా తహసీల్ కార్యాలయంలోనే సాదా బైనమాల సమస్యలు పరిష్కారం అవుతాయని కాస్త జటిలమైతే ఆర్డీవో, కలెక్టర్ స్థాయిలో పూర్తి సమస్యకు పరిష్కారం చేకూరుతుందని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జు పటేల్ మాట్లాడారు. దళిత గిరిజనులు, ఆదివాసీల పేర్లతో భూములు లాక్కున్న భూస్వాములను వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. నియోజకవర్గ కేంద్రంలోని తహసీల్ కార్యాలయం శిథిలావస్థకు చేరిందని అట్టి కార్యాలయ నిర్మాణానికి సుమారు కోటి రూపాయలు వెచ్చించవలసిందిగా మంత్రి దృష్టికి ఆయన తీసుకువెళ్లారు. అలాగే స్థానికంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆయన మంత్రికి తెలియజేశారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి కార్యాలయ ప్రాంగణంలో నిర్మించిన ఇందిరమ్మ నమూనా ఇల్లును మంత్రి ఎమ్మెల్యే తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డిఓ రత్న కళ్యాణి లతోపాటు స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

# వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలి






**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

**భూపాలపల్లిలో ముస్లీం జేఏసీ ర్యాలీ**

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):**

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఆదివారం వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లీం జేఏసీ ఆధ్వర్యంలోస్థానిక జామా మసీదు నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ముస్లింలు నిర్వహించిన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరై మాట్లాడారు. ముస్లీం పూర్వీకులు దానం చేసిన ఆస్తులతో సహా, వక్ఫ్ ఆస్తులను అక్రమంగా స్వాధీనం చేసుకుని, వాటిని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆయన ఆరోపించారు. వక్ఫ్ బోర్డుల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే ఈ ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇది ముస్లిం ల ఆస్తులను హరించే కుట్ర అని విమర్శించారు. కేంద్రం ఈ చట్ట సవరణను పునఃపరిశీలించి, వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం జేఏసీ నాయకులు ఎండి చోటేమియా, హబీబ్, బాబుమియా, సాధిక్, అబ్దుల్ అజీం, హఫీస్, హమీద్, ఖాదర్, అలీ, అన్వర్, ముజీద్, ఇంతియాజ్, అజ్మత్, ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

# కమ్యూనిటీ మీడియేటర్స్ నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

## తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి సి.హెచ్.పంచాక్షరి

**వరంగల్ ఎంజీఎం, ఏప్రిల్ 20(జనంసాక్షి):**




ఉమ్మడి వరంగల్ జిల్లాలకు సంబంధించి ఆయా జిల్లాల న్యాయ సేవా సంస్థలు గుర్తించిన కమ్యూనిటీ మీడియేటర్ల మూడు రోజుల శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా చివరి రోజున తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి న్యాయమూర్తి ప్రసంగిస్తూ "సమాజంలోని వ్యక్తులు మరియు సమూహాల మధ్య వైరుధ్యాలు, సంఘర్షణలను పరిష్కరించుకోవడంలో శిక్షణ పొందిన మధ్యవర్తులు, ఇరుపక్షాల మధ్య వివాదాలలో పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారానికై నిష్పక్షపాతంగా తమ వంతు సహాయం చేయాలి అని తెలిపారు. సంఘర్షణ ఆరంభ దశలోనే పరిష్కరించబడినట్లయితే డబ్బు మరియు విలువైన సమయాన్ని కాపాడుకోవచ్చు అని తెలిపారు. కమ్యూనిటీ స్థాయిలో వాదనలు, వివాదాల పరిష్కారంలో మధ్యస్థతా తత్వాన్ని ఎలా వినియోగించుకోవాలో శిక్షణ ద్వారా క్లుప్తంగా తెలియజేయడం జరిగింది. వివాదాలను పరిష్కరించడంలో ఏదైనా సహాయం అవసరమైతే వారు నేరుగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థలను గాని, మండల న్యాయ సేవాధికార కమిటీని గాని సంప్రదించి సలహాలు, సూచనలు పొందాలని సూచించారు. ఈ సందర్భంగా మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న కమ్యూనిటీ మీడియేటర్లకు ప్రశంసా పత్రాలను అందజేయడం జరిగింది. సమాజంలో శాంతి, న్యాయం, సామరస్యం కోసం

ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు మరింత అవసరమని కమ్యూనిటీ పెద్దలు అభిప్రాయపడ్డారు. ఈ శిక్షణ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు వి.బి.నిర్మలా గీతాంబ, సి. హెచ్. రమేష్ బాబు, వరంగల్, హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శులు యం.సాయి కుమార్, క్షమా దేశ్ పాండే, రిసోర్స్ పర్సన్స్ బాలకృష్ణ మరియు సీతాదేవి తదితరులు పాల్గొన్నారు.

# ధాన్య కొనుగోలు వేగవంతం చేయాలి

**అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి**

**తల్లాడ మండలం రంగంబంజర ధాన్య కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చెందిన అదనపు కలెక్టర్**



**ఖమ్మం (జనంసాక్షి) :** ధాన్య కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం అదనపు కలెక్టర్ తల్లాడ మండలం, రంగంబంజర గ్రామంలో ఏర్పాటుచేసిన ధాన్య కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్, కొనుగోలు కేంద్రంలో ఇప్పటివరకు సేకరించిన ధాన్యం వివరాలు, ట్యాబ్ ఎంట్రీ, రైతులకు డబ్బు చెల్లింపు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధాన్యం వచ్చిన వెంటనే నాణ్యతా ప్రమాణాలు పరిశీలించాలని, కొనుగోలు చేసిన ధాన్యం ట్యాబ్ ఎంట్రీ చేసి, సంబంధిత రైస్ మిల్లులకు తరలించాలని అన్నారు. కొనుగోలు కేంద్రంలో ఏర్పాటుచేసిన ఆటోమేటిక్ ప్యాడీ క్లినర్ ను అదనపు కలెక్టర్ పరిశీలించారు. పనితీరును అధికారులు, రైతులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని సదుపాయాల కల్పన చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ అన్నారు. అదనపు కలెక్టర్ తనిఖీల సందర్భంగా జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, అధికారులు తదితరులు ఉన్నారు.

# మోదీ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్న ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్

**ఆదిలాబాద్ ప్రతినిది, 20, (జనంసాక్షి)**



: నేడు జిల్లా కలెక్టర్ రాజర్షి షా ప్రధాని మోది చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. జిల్లా అడ్మినిస్ట్రేషన్ కార్యక్రమంలో భాగంగా నార్నూర్ బ్లాక్ అస్పరెషనల్ ప్రోగ్రాం 2024 కుగాను జిల్లా కలెక్టర్ ఈ అవార్డుకు ఎంపిక.అయ్యారు. ప్రధానమంత్రి ప్రజాస్వామ్య పరిపాలన ఉత్తమ పురస్కారం 2024లో అదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం బ్లాక్ దేశంలో టాప్ 5లో ఎంపిక అయ్యింది ఆదిలాబాద్, జిల్లా తెలంగాణకు గొప్ప గర్వం కలిగించే అంశంగా ఎదిగింది. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ బ్లాక్ 2024 సంవత్సరానికి ప్రగతిశీల బ్లాక్ ప్రోగ్రాం (ABP) కేటగిరీలో ఎంపిక కాగా ప్రధానమంత్రి ప్రజాస్వామ్య పరిపాలన ఉత్తమ పురస్కారం 2024లో దేశంలోని టాప్ 5 ఆస్పిరేషనల్ బ్లాకులలో ఒకటిగా ఎంపికైంది. దేశంలో 426 ఆస్పిరేషనల్ బ్లాకులలో నార్నూర్ అద్భుతమైన విజయాలను ప్రదర్శించి టాప్ ,5 గుర్తింపును సాధించింది.

# రైతుల ముఖాల్లో చిరునవ్వు చూడటమే ప్రభుత్వ ధ్యేయం

**ఎమ్మెల్యే డా.భూక్యా మురళి నాయక్**

**మహబూబాబాద్ ప్రతినిధి, ఏప్రిల్ 20 (జనంసాక్షి)**



: మహబూబాబాద్ నియోజకవర్గం నెల్లికుదురు మండలంలోని శ్రీరామగిరి ఎర్రబెల్లి గూడెం మేచారాజుపల్లె గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక మండల నాయకులతో కలిసి మహబూబాబాద్ ఎమ్మెల్యే డా భూక్యా మురళీ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళి నాయక్ మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టపడి, చెమటోడ్చి పండించిన రైతుల కష్టార్జితాన్ని గత ప్రభుత్వంలోని పాలకులు కటింగ్ ల పేరుతో అనేక విధాలుగా అవినీతికి అక్రమాలకు పాల్పడినరని అన్నారు. తాము పూర్తి పారదర్శకంగా రైతులకు న్యాయం చేకూర్చేందుకు పనిచేస్తున్నామని అన్నారు. అధికారంలో లేనప్పుడు వడ్ల కటింగ్ లకు వ్యతిరేకంగా పోరాటం చేశామని ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగానే ఎక్కడ కటింగ్లు లేకుండా వడ్ల కొనుగోలు చేస్తున్నామని అన్నారు. ప్రతి క్వింటాలకు రైతులకు పారదర్శకంగా చెల్లింపులు జరగేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారుల నుండి నివేదికలు పొందాం. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అంకితంగా పనిచేస్తోంది. ఒక్కొక్క పంటకు తగిన మద్దతు ధర కల్పించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడంలో పాక్షిక విజయాన్ని సాధించామని గర్వంగా చెబుతున్నాం. ఈ కేంద్రం ద్వారా ఆదాయ మార్గాలు మెరుగవుతాయి అన్నారు.

# ఆరోగ్య సమస్యల వల్ల దుబాయ్ వెళ్లా

**తప్పుడు కేసులు పెట్టొద్దని సీపీకి విన్నపం చేశా మాజీ ఎమ్మెల్యే షకీల్**

**నిజామాబాద్ (జనంసాక్షి)**




ఆరోగ్య సమస్యల వల్ల తాను దుబాయ్ వెళ్లానని, కార్యకర్తలకు దూరమయ్యానని బీఆర్ఎస్ నేత, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టొద్దని సీపీకి విన్నపం చేశానన్నారు. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి తన కొడుకుపై కక్ష సాధింపులో భాగంగా తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 27న వరంగల్‌లో బీఅర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభ జరగనుంది. రజతోత్సవ సన్నాహాక సమా వేశ కార్యక్రమం బోధన్ అప్స ఫంకషన్‌లో జరిగింది. మాజీ ఎమ్మెల్యే షేకీల్, బీఆర్ఎస్ నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభ సన్నాహాక సమావేశంలో మాజీ ఎమ్మెల్యే షకీల్ మాట్లాడు తూ 'కాంగ్రెస్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి నీచ రాజకీయాలకు పాల్పడు తున్నారు. తన కొడుకుపై కక్ష సాధింపులో తప్పుడు కేసులు బనాయిస్తున్నారు. రైస్ మిల్లులో రూ.7 కోట్ల బకాయిలు చెల్లించాలని నోటీసులు వచ్చాయి. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టొద్దని సీపీకి విన్నపం చేశా. ఆరోగ్య సమస్యల వల్ల దుబాయ్ వెళ్ళాను, కార్యకర్తలకు దూరమైయ్యాను' అని తెలిపారు.

# భరత నాట్యంలో గిన్నిస్ వరల్డ్ రికార్డు

**నిర్మల్ రూరల్,ఏప్రిల్20(జనంసాక్షి)**



భారత ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన భరత నాట్య ప్రదర్శనల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ నెలకొల్పిన నాట్య బృందాన్ని బీజేఎల్పీ నేత,నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి ఆదివారం అభినందించారు. నిర్మల్ జిల్లా నృత్యమాల నాట్య అకాడమీలో గురువు అంజలి ఆధ్వర్యంలో శిక్షణ పొంది జాతీయ,రాష్ట్ర స్థాయిలో పాల్గొని అవార్డులు పొందడం హర్షణీయమని కొనియాడారు. చదువుతోపాటు కళా నైపుణ్యాల్లో రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గోడం నగేష్, ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, ముత్యం రెడ్డి తదితరులున్నారు.

# ఆర్జేసి కృష్ణకు ఎమ్మెల్సీ కవిత పరామర్శ



**ఖమ్మం జనంసాక్షి :**

జిల్లా పర్యటనలో భాగంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎమ్మెల్సీ ,ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్, ఎంపీ వద్దిరాజు రవిచంద్రతో కలిసి కాలి గాయం నుండి కోలుకుంటున్న ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ నాయకులు ఆర్జేసి కృష్ణను ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా కృష్ణ పూర్తిగా కోలుకొని ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు బానోతు హరిప్రియ, బానోతు చంద్రావతి, మదన్ లాల్ తదితరులు పాల్గొన్నారు.




# రైతుకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 20 (జనంసాక్షి) :**

**గత బిఆర్ఎస్ పాలనలో రైతు దోపిడీకి గురైండు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి**

పలు వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ప్రారంభించారు. మొదట తీగలగుట్టపల్లి లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి అనంతరం కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ లో ప్రాంభించి తర్వాత చామన్ పల్లి, దుబ్బపల్లి లలో ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... ఎల్లప్పుడూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందని గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులు దోపిడీకి గురయ్యారని క్వింటాలుకు 5 నుండి 10 కిలోలు దోచుకున్నారని అప్పుడు దోచుకున్న వారే ఇప్పుడు నీతులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం సన్నాలకు 500 బోనస్ ఇచ్చి రైతులకు అండగా నిలిచిందని, రుణ మాఫీ చేసి చూపించిందని రైతు భరోసా ఇచ్చిందని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలలో నియోజక వర్గ ఇంచార్జి పురుమల్ల శ్రీనివాస్, మూల రవీందర్ రెడ్డి, ఆకారపు భాస్కర్ రెడ్డి, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, కాశెట్టిశ్రీనివాస్, శ్యామ్ సుందర్ రెడ్డి, కొలగానిఅనిల్, కొలగాని శ్రీనివాస్, అట్టేపు వేణు, కిరణ్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, దీకొండ శంకరయ్య, జగ్గని కనుకయ్య, సిపి మమత, పెద్దిగారితిరుపతి, కాంపెల్లి కీర్తి కుమార్, గంగుల దిలీప్, లింగంపల్లి మంగ, బుర్ర గంగయ్యపాల్గొన్నారు.

# నర్సింగ్ సిబ్బందికి సదావకాశం

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 20 (జనంసాక్షి)**



అర్హులైన నర్సింగ్ సిబ్బందికి ఉచిత శిక్షణ అందిస్తూ కొలువులు అందించే ప్రత్యేక కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి రాఘవేందర్ తెలిపారు. ట్రిపుల్ విన్ ప్రాజెక్టు కింద జర్మనీలో ఉపాధి అవకాశాల కోసం అర్హులైన నర్సింగ్ సిబ్బందికి ఉచిత శిక్షణ, నియామకం లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి,శిక్షణ, కర్మాగారాల శాఖ పరిధిలోని రిజిస్టర్డ్ రిక్రూట్ మెంట్ ఏజెన్సీ తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్) ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రకటించింది. జర్మన్ ఫెడరల్ ఎంప్లాయిమెంట్ ఏజెన్సీ (బీఏ), జర్మన్ ఆర్గనైజేషన్ ఫర్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ (జీఐజెడ్) సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు.

**అర్హతలు.. ఎంపిక విధానం..**

తెలంగాణలోని గుర్తింపు పొందిన కాలేజీల నుంచి జీఎన్ఎం,బీఎస్సీ నర్సింగ్ చేసి, 21-38 ఏళ్ల మధ్య ఉండాలనీ ఇండియన్ నర్స్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ తో జీఎన్ఎం అభ్యర్థులకు కనీసం 3 ఏళ్ల ప్రొఫెషనల్ వర్క్ ఎక్స్ పీరియన్స్ ఉండాలన్నారు.

వృద్ధుల సంరక్షణ, పాలియేటివ్ కేర్ (ఉదా. హోమ్ కేర్, నర్సింగ్ హోమ్)లో నర్సింగ్ అనుభవం, షిఫ్టుల్లో పనిచేయడం, ఇన్-పేషెంట్ అనుభవంగా ప్రాధాన్యత ఇస్తారన్నారు. ఇంటెన్సివ్ కేర్ లేదా ఇంటర్మీడియట్ కేర్ యూనిట్, జెరియాట్రిక్స్, లాంగ్ టర్మ్ కేర్ యూనిట్స్,కార్డియాలజీ, వార్డు,జనరల్ సర్జికల్ మెడికల్ వార్డు, నియోనాటాలజీ,న్యూరాలజీ, ఆర్థోపెడిక్స్,ఓటీ, సైకియాట్రీ వంటి విభాగాల్లో ఆసుపత్రి ఆధారిత నర్సింగ్ అనుభవం ఉండాలన్నారు. గత 6 నెలల్లో పొందిన బీ1 సర్టిఫికేట్ కలిగిన జర్మన్ లాంగ్వేజ్ స్కిల్స్ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తారన్నారు. ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్ లో బీ1 స్థాయి వరకు జర్మన్ నేర్చుకునే అవకాశం ఉంటుందనీ, జర్మన్ యజమానితో విజయవంతంగా నియామకం పొందిన తరువాత, వారు రిజిస్టర్డ్ నర్సుగా గుర్తింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు జర్మనీలోని ఆసుపత్రులలో నర్సింగ్ అసిస్టెంట్లుగా పని చేస్తారన్నారు.

**జర్మనీలో ఉపాధి అవకాశాల కోసం ఉచిత శిక్షణ,నియామకం జీఐజెడ్, టామ్ కామ్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రోగ్రాం జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి రాఘవేందర్**

**ఎంపికయిన వారికి నెలకు 2 లక్షల జీతం**

గుర్తింపు వరకు 2300 యూరోలు (నెలకు రూ 2.2 లక్షలు) జీతం అలాగే గుర్తింపు తర్వాత 2800 యూరోలు (2.6 లక్షలు) నెల జీతం అందించబడుతుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు 94400 51581,94400 48500, 94400 52081సంప్రదించాలనీ ,తమ రెజ్యూమ్ ను ఈ నెల 25 లోగా germanytriplewin2 025@gmail.comకు ఈమెయిల్ చేయాలన్నారు. అదనపు సమాచారం కొరకు www.tomcom.telangana.gov.in సందర్శించాలని జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి రాఘవేందర్ తెలిపారు.

# క్రికెట్ కోసం
## పిజ్జా, మటన్ మానేశాడు



**12 ఏళ్లకే అరంగేట్రం**


**దేశవాళీలో 12 ఏళ్లకే అరంగేట్రం చేసి రికార్డు నెలకొల్పిన వైభవ్.. ఇప్పుడు ఐపీఎల్‌లోనూ ప్రకంపనలు సృష్టించాడు. దూకుడుగా ఆడగల ఈ ఓపెనర్‌ను మెగా వేలంలో రూ.1.1 కోటి పెట్టి కొన్నది రాజస్థాన్. ఫ్రాంచైజీ తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెడుతూ అవకాశం రాగానే రెచ్చిపోయాడీ కుర్రాడు. లక్నో సూపర్ జెయింట్స్‌పై 27 బంతుల్లోనే 34 రన్స్ కొట్టిన వైభవ్.. స్టంపౌట్‌గా వెనుదిరిగాడు.**

ఐపీఎల్ చరిత్రలో అతిపిన్న వయస్కుడిగా చరిత్ర సృష్టించిన వైభవ్ సూర్యవంశీ అరంగేట్రంలోనే అకట్టుకున్నాడు. ఓపెనర్‌గా వచ్చిన ఈ యువకెరటం ఏమాత్రం బెరుకు లేకుండా ఆడాడు. తొలి బంతినే సిక్సర్ గా మలిచి దమ్మున్న కుర్రాడని ప్రశంసలు అందుకున్నాడు. దాంతో, ఈ 14 ఏళ్ల సంచలనం గురించి మరిన్ని విషయాలు తెలుసుకునేందుకు అభిమానులు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ నేపథ్యంలో బొద్దుగా ఉండే వైభవ్ గురించి అతడి కోచ్ మనీష్ ఓఝూ ఆసక్తికర విషయాలు వెల్లడించాడు. మొదటి మ్యాచ్‌లోనూ అనుభవజ్ఞుడిలా చెలరేగి క్రికెట్ ప్రపంచాన్ని నివ్వెరపరిచాడు వైభవ్ సూర్యవంశీ. రాజస్థాన్ రాయల్స్ ఓపెనర్‌గా అలరించిన ఈ యంగ్‌స్టర్ క్రికెట్ కోసం తనకు నచ్చిన ఫుడ్‌కు దూరమయ్యాడట. 'వైభవ్‌కు మటన్, పిజ్జాలు అంటే చాలా ఇష్టం. ఈ రెండింటిని ఎంతో ఇష్టంగా తినేవాడు. మటన్ అయితే ఎంత వడ్డించి నా చాలు అనకుండా ఆరగించేవాడు. అందుకే వైభవ్ బొద్దుగా తయారయ్యాడు. అయితే.. క్రికెటర్ అవ్వాలంటే ఫిట్‌గా ఉండాలి కదా.. కాబట్టి తన ఫేవరెట్ ఫుడ్ మానేశాడు. బరువు నియంత్రణలో ఉంచుకునేందుకు ప్రస్తుతం కచ్చితమైన డైట్ పాటిస్తున్నాడు' అని మనీష్ వివరించాడు. దేశవాళీలో ఖతర్నాక్ ఇన్నింగ్స్‌లు ఆడిన వైభవ్ 14 ఏళ్ల 23 రోజుల వయసులో ఐపీఎల్‌లో తొలి మ్యాచ్ ఆడాడు. సంజూ శాంసన్ గాయపడడంతో.. ఇంప్యాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన వైభవ్ కళాత్మక షాట్లతో అలరించాడు. బలమైన ఫుట్‌వర్క్ కలిగిన ఈ యంగ్‌స్టర్ ఆట అచ్చం టీమిండియా దిగ్గజం యువరాజ్ సింగ్, వెస్టిండీస్ లెజెండ్ బ్రియాన్ లారాలను పోలి ఉంటుందని చెబుతున్నాడు కోచ్ మనీష్.

## ఐపీఎల్ క్రెడిట్ అంతా ఆయనదే : లలిత్ మోడీ

ప్రస్తుతం ప్రపంచాన్ని ఐపీఎల్ క్రికెట్ ఉర్రూతలూగిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఐపీఎల్ లీగ్ ఫౌండర్ లలిత్ మోడీ మాత్రం ఈ లీగ్ మీద పలు ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఐపీఎల్ రూపుదాల్చడానికి ప్రధాన కారకులు నేషనల్ కాంగ్రెస్ పార్టీ చీఫ్ శరద్ పవార్ అని పేర్కొన్నారు. నేడు ఐపీఎల్ మేనియా ప్రపంచ క్రికెట్ ప్రేమికులను పట్టి కుదిపేస్తుందంటే.. ఆ క్రెడిట్ అంతా శరద్ పవార్‌కే దక్కుతుందని లలిత్ మోడీ కొనియాడారు. తనను గుడ్డిగా నమ్మి ప్రోత్సహించడంతోనే ఐపీఎల్ కల నిజమైందని తెలియజేశారు. ఇపుడు ఐపీఎల్ లేకుండా ప్రపంచాన్ని ఊహించలేమని అన్నారు. పవార్ విజినరీ ఉన్న నాయకుడు అని, ఆ విషయాన్ని ఎవరూ మర్చిపోవద్దని సూచించారు. ఈ మేరకు లలిత్ మోడీ తన సోషల్ మీడియా ఖాతాలో ఓ పోస్ట్ షేర్ చేశారు.

## కోచ్ నాగపురి రమేష్‌పై వేటు..!



ప్రముఖ కోచ్ నాగపురి రమేష్‌పై వేటు పడింది. దేశం గర్వపడేలా యువ క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్న అతడిపై జాతీయ డ్రగ్స్ నిరోధక సంస్థ(నాడా) నిషేధం విధించింది. ఆయన వద్ద శిక్షణ పొందిన ఇద్దరు అథ్లెట్లు డోపింగ్ టెస్టుకు నిరాకరించడమే అందుకు కారణం. అయితే.. తానేమీ తప్పు చేయలేదని విచారణకు తాను సిద్ధంగా ఉన్నానని రమేష్ తెలిపాడు. డోప్ టెస్టుకు సహకరించనందుకు రమేష్‌తో పాటు కోచ్‌లు కరంవీర్ సింగ్, రాకేష్‌లు కూడా సస్పెన్సన్‌కు గురయ్యారు. ఈమధ్యే కొందరు అథ్లెట్లు డోపింగ్ పరీక్షలకు నమూనాలు ఇచ్చేందుకు అంగీకరించలేదు. పరాస్ సింఘాల్, పూజా రాణి, నలుబోతు షన్ముగ శ్రీనివాస్, చెలిమి ప్రత్యూష, శుభమ్ మహరా, కిరణ్. జ్యోతిలు డోప్ టెస్టుకు తమ రక్త నమూనాలు ఇవ్వడానికి నిరాకరించారు. దాంతో, ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న నాడా అందుకు కోచ్‌లను బాధ్యులను చేస్తూ చర్యలు తీసుకుంది. ఈ క్రమంలోనే ద్రోణాచార్య అవార్డు గ్రహీత అయిన నాగపురి రమేశ్‌పై వేటు వేసింది. అయితే.. నాడా తీరుపై రమేష్ మండిపడ్డాడు. నిజానిజాలు తెలుసుకోకుండా తనపై సస్పెన్సన్ విధించడం సరికాదని.. తానేమీ తప్పు చేయలేదని మీడియాకు వివరించాడీ కోచ్. తెలంగాణతో పాటు యావత్ దేశంలోని పలువురు యువ అథ్లెట్లు రమేష్ శిక్షణలో రాటుదేలుతున్నారు. ఆయన సూచనలతో, సలహాలతో మెరుగుపడిన స్ప్రింటర్ ద్యూతీ చంద్, జ్యోతి ఎర్రాజీలు ఒలింపిక్స్‌లో సత్తా చాటిన విషయం తెలిసిందే.

# కోహ్లీ, పడిక్కల్ వీర విహారం
## పంజాబ్‌పై ఆర్సీబీ ప్రతీకార విజయం
### కోహ్లీ, పడిక్కల్ 103 పరుగుల భాగస్వామ్యం

*ఐపీఎల్ 2025 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తమ ఐదో విజయాన్ని నమోదు చేసింది, పంజాబ్ కింగ్స్‌పై 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ముల్లన్‌పూర్‌లోని మహారాజా యాదవీంద్ర సింగ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో బెంగళూరు బ్యాటింగ్, బౌలింగ్ రెండు విభాగాల్లోనూ ఆధిపత్యం చెలాయించింది. విరాట్ కోహ్లీ మరియు దేవదత్ పడిక్కల్‌ల బ్యాటింగ్ పరాక్రమంతో పాటు, జోష్ హాజిల్‌వుడ్ మరియు భువనేశ్వర్ కుమార్‌ల బౌలింగ్ దాడి బెంగళూరు విజయంలో కీలక పాత్ర పోషించాయి.*



టాస్ గెలిచిన పంజాబ్ మొదట బ్యాటింగ్ ఎంచుకుంది, కానీ బెంగళూరు బౌలర్ల ఒత్తిడి ముందు 20 ఓవర్లలో 157/6 స్కోరుకే పరిమితమైంది. ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (33 పరుగులు, 26 బంతులు), శశాంక్ సింగ్ (31 పరుగులు, 20 బంతులు) మినహా మిగతా బ్యాటర్లు పెద్దగా రాణించలేకపోయారు. సామ్ కర్రాన్ (22), జితేష్ శర్మ (19) కొంత పోరాడినప్పటికీ, బెంగళూరు బౌలర్లు వారిని పెద్ద స్కోరు చేయనీయలేదు.

బెంగళూరు బౌలింగ్‌లో కృనాల్ పాండ్యా (2/25), సుయాష్ శర్మ (2/26), జోష్ హాజిల్‌వుడ్ (1/22), మరియు భువనేశ్వర్ కుమార్ (1/28) అద్భుత ప్రదర్శన కనబరిచారు. హాజిల్‌వుడ్ తన కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్‌తో ప్రభ్‌సిమ్రాన్‌ను ఔట్ చేసి పంజాబ్ ఇన్నింగ్స్‌కు గట్టి దెబ్బతీశాడు, అయితే భువనేశ్వర్ కీలకమైన డెత్ ఓవర్లలో పరుగులను అదుపు చేశాడు.

**ఛేజింగ్‌లో బెంగళూరు ఆధిపత్యం**

158 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బెంగళూరుకు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (1) త్వరగా ఔట్ కాగా, విరాట్ కోహ్లీ మరియు దేవదత్ పడిక్కల్ బాధ్యతాయుతంగా ఆడి ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టారు. కోహ్లీ 54 బంతుల్లో 73 పరుగులతో (7 ఫోర్లు, 1 సిక్సర్) నాటౌట్‌గా నిలిచాడు, తన 67వ ఐపీఎల్ హాఫ్-సెంచరీని సాధించాడు. పడిక్కల్ 35 బంతుల్లో 61 పరుగులు (6 ఫోర్లు, 2 సిక్సర్లు) చేసి, అద్భుతమైన ఫామ్‌ను కొనసాగించాడు. ఈ జోడి 103 పరుగుల భాగస్వామ్యంతో ఛేజింగ్‌ను సులభతరం చేసింది.

ఆఖరి దశలో జితేష్ శర్మ (11 నాటౌట్) వచ్చి కోహ్లీతో కలిసి మ్యాచ్‌ను స్టైల్‌గా ముగించాడు. 18.5 ఓవర్లలో 159/3 స్కోరుతో బెంగళూరు లక్ష్యాన్ని సాధించింది, జితేష్ శర్మ సిక్సర్‌తో ఇన్నింగ్స్‌ను ముగించాడు. పంజాబ్ బౌలర్లలో హర్‌ప్రీత్ బ్రార్ (1/27), అర్ష్‌దీప్ సింగ్ (1/33), యజ్వేంద్ర చాహల్ (1/34) తలో వికెట్ తీశారు, కానీ కోహ్లీ-పడిక్కల్ జోడి ఆధిపత్యాన్ని అడ్డుకోలేకపోయారు.

విరాట్ కోహ్లీ తన అద్భుత మైన 73 పరుగుల ఇన్నింగ్స్‌తో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. అవార్డు స్వీకరణ సందర్భంగా, కోహ్లీ తన బ్యాటింగ్ భాగస్వామి పడిక్కల్‌ను ప్రశంసించాడు, అతని ఆత్మవి శ్వాసం, షాట్‌ల ఎంపికను హైలైట్ చేశా డు. అలాగే, హాజిల్‌వుడ్, భువనేశ్వర్ కుమార్‌ల బౌలింగ్ ప్రయత్నాలను కొనియాడాడు, వారు పంజాబ్ బ్యాటర్లను నియంత్రించడంలో కీలక పాత్ర పోషించారని అన్నాడు.

ఈ విజయంతో బెంగళూరు ఐపీఎల్ 2025 పాయింట్స్ టేబుల్‌లో తమ స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంది. కోహ్లీ, పడిక్కల్‌ల ఫామ్ జట్టుకు పెద్ద బూస్ట్‌గా నిలిచింది, ముఖ్యంగా ఛేజింగ్‌లో వారి సమన్వయం మరియు ఆత్మవిశ్వాసం జట్టు స్ఫూర్తిని పెంచాయి. మరోవైపు, పంజాబ్ ఈ ఓటమితో బ్యాటింగ్ బలహీనతలను సమీక్షించుకోవాల్సిన అవసరం ఏర్పడింది, ముఖ్యంగా వారి మిడిల్ ఆర్డర్ పనితీరు మెరుగుపడాలి. మొత్తంగా, ఈ మ్యాచ్ బెంగళూరు యొక్క సమతూక జట్టు పనితీరును ప్రదర్శించింది, కోహ్లీ-పడిక్కల్ జోడి బ్యాటింగ్‌లో మెరిసి జట్టును విజయతీరాలకు చేర్చారు. పంజాబ్ రాబోయే మ్యాచ్‌లలో తమ వ్యూహాలను సమీక్షించుకొని బలంగా తిరిగి రావాల్సిన అవసరం ఉంది.

## 67 అర్ధ శతకాల హోరు

టీ20ల్లో ఛేజ్ మాస్టర్ విరాట్ కోహ్లీ రికార్డుల పర్వం కొనసాగుతోంది. ఈమధ్యే పొట్టి క్రికెట్‌లో 'వంద' హాఫ్ సెంచరీలతో చరిత్ర సృష్టించిన విరాట్ ఐపీఎల్‌లో అత్యధిక అర్ధ శతకాల వీరుడిగా నిలిచాడు. ఐపీఎల్ 18వ ఎడిషన్‌లో రెచ్చిపోయి ఆడుతున్న కోహ్లీ 67వ సారి 50 ప్లస్ స్కోర్ చేశాడు. తద్వారా డేవిడ్ వార్నర్ రికార్డును బద్ధలు కొట్టాడు. ఆదివారం ముల్లనూర్ వేదికగా పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సూపర్ ఫిఫ్టీతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును గెలిపించాడీ రన్ మెషీన్. దాంతో, అత్యధిక హాఫ్ సెంచరీల జాబితాలో వార్నర్(66) రెండో స్థానానికి పడిపోయాడు. ఐపీఎల్‌లో ఎక్కువ అర్ధ శతకాలు బాదిన క్రికెటర్ల జాబితాలో కోహ్లీ అగ్రస్థానంలో ఉండగా.. శిఖర్ ధావన్ మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. గబ్బర్‌గా పేరొందిన ధావన్ ఖాతాలో 53 హాఫ్ సెంచరీలు ఉన్నాయి.

## నేను పదేళ్ల పాటు కెప్టెన్‌గా ఉన్నా: అజహరుద్దీన్



ఐపీఎల్ టికెట్లకు సంబంధించి హైదరాబాద్ క్రికెట్ సంఘంపై విమర్శలు.. ఇప్పుడు మాజీ అధ్యక్షుడు, మాజీ కెప్టెన్ అజహరుద్దీన్ పేరు వివాదంగా మారింది. ఉప్పల్ స్టేడియంలోని నార్త్ స్టాండ్కు మహ్మద్ అజహరుద్దీన్ పేరు ఉంది. అయితే, దానిని తొలగించాలని హెచ్సీఏ అంబుడ్స్ మన్ జస్టిస్ ఈశ్వరయ్య ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ ఆదేశాలపై అజహరుద్దీన్ తీవ్రంగా స్పందించాడు. హైకోర్టు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వెల్లడించాడు. "ఇందులో ఎలాంటి కుట్రకోణం, స్వప్రయోజనాలు లేవు. దీనిపై నేను ఎలాంటి కామెంట్ చేయదల్చుకోలేదు. ఆ స్థాయికి దిగజారాలని అనుకో వడం లేదు. ఈ అసోసియేషన్ ను చూసి క్రికెట్ ప్రపంచం నవ్వుతోంది. 17 ఏళ్ల క్రికెట్ కెరీర్.. దాదాపు పదేళ్లపాటు భారత జట్టు కెప్టెన్గా ఉన్నా. సారథిగా డిస్టింక్షన్లో పాసైన వ్యక్తిని. హైదరాబాద్లో క్రికెటర్లను ఇలాగేనా గౌరవించేది. ఇది చాలా బాధాకరం. తప్పకుండా కోర్టుకు వెళ్తాం. వంద శాతం న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నా" అని అజహరుద్దీన్ స్పష్టం చేశాడు.

హెచ్సీఏ అధ్యక్షుడిగా ఉన్నపుడు అజహరుద్దీన్ తన పేరును స్టాండ్కు పెట్టించ డం సరైన నిర్ణయం కాదని, ఇందులో విరుద్ధ ప్రయోజనాలున్నాయని అంబుడ్స్మన్ పేర్కొన్నారు. వెంటనే స్టాండ్కు అజహర్ పేరును తొలగించడంతో పాటు క్రికెట్ మ్యాచ్ల టికెట్లపైనా ఆ ప్రస్తావన లేకుండా చూడాలని హెచ్సీఏను ఆయన ఆదేశించారు. 2019లో ఆ స్టాండ్కు వీవీఎస్ లక్ష్మణ్ పేరు ఉండేది. దానిని అజహరుద్దీన్ స్టాండ్గా మార్చారు.

## గిల్‌కు భారీ ఫైన్..

ఐపీఎల్-18లో శుభ్‌మన్ గిల్ నాయకత్వంలోని గుజరాత్ టైటాన్స్ జోరు మీద ఉన్నది. శనివారం ఢిల్లీ క్యాపిటల్స్‌పై విజయం సాధించడం ద్వారా టోర్నీలో 5వ గెలుపును ఖాతాలో వేసుకుంది. దీంతో పాయింట్స్ టేబుల్‌లో ఆ జట్టు గుజరాత్ అగ్రస్థానంలోకి వెళ్లింది. ఢిల్లీపై విజయం సాధించిన ఆనందంలో ఉన్న ఆ జట్టుకు ఐపీఎల్ నిర్వాహకులు షాకిచ్చారు. కెప్టెన్ గిల్‌కు జరిమానా విధించారు. ఢిల్లీతో మ్యాచ్‌లో గుజరాత్ స్లో ఓవర్ రేట్ నిబంధనను ఉల్లంఘించినట్టు ఐపీఎల్ తెలిపింది. ఢిల్లీ ఇన్నింగ్స్‌లో గుజరాత్ నిర్ణీత సమయంలోకా తమ బౌలింగ్ కోటాను పూర్తి చేయలేదు. దీంతో గిల్‌కు రూ.12 లక్షలు ఫైన్ పడింది. ఈ సీజన్‌లో గుజరాత్ స్లో ఓవర్ రేట్ నిబంధనను ఉల్లంఘించడం ఇదే తొలిసారి. ఈ సీజన్లలో పాండ్యా (ముంబై), రియాన్ పరాగ్(రాజస్థాన్), పంత్ (లక్నో), రజత్ పటిదార్(బెంగళూరు), శాంసన్ (రాజస్థాన్), అక్షర్ పటేల్(ఢిల్లీ) జరిమానా ఎదుర్కొన్న కెప్టెన్లలో ఉన్నారు.

## గ్రామపంచాయతీ కార్మికుల వేతన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలి
### ఉద్యోగుల సంఘం గ్రామపంచాయతీ సిబ్బంది



**మహదేవపూర్, ఏప్రిల్ 20 (జనంసాక్షి) :** మండలంలోని గ్రామ పంచాయితీలలో పనిచేస్తున్న సిబ్బందివి ఆగిన బకాయి వేతనాలు ప్రభుత్వము చెల్లించాలని మహదేవపూర్ మండల పంచాయితీ ఉద్యోగ సంఘం కార్మికులు హాజరై తెలంగాణ స్టేట్ ఉద్యోగం అధ్యక్షులు సాదుల శ్రీకాంత్ అధ్యక్షతన సమావే శం మహదేవపూర్ నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు భాష. గౌరవ అధ్యక్షులు రాజమౌళి. మండల అధ్యక్షులు ఠాగూర్ కేసర్ సింగ్ కార్యదర్శి వేమునూరి రవీందర్ రెడ్డి. ఈ సందర్భంగా మాట్లాడుతూ . గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కార్మిక సిబ్బంది కి డిసెంబర్ ఉన్న బకాయి వేతనాలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని 51 జీవోను పెద్దపరిచి గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న మల్టీ పర్పస్ విధానాన్ని ఎత్తివేయాలని ఈ సమావేశంలో పంచాయతీ ఉద్యోగ సంఘం కార్మిక సిబ్బంది రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినారు. అనంతరం గ్రామపంచాయతీ కార్మికుల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాధుల శ్రీకాంత్ మాట్లాడుతూ. పంచాయతీ సిబ్బంది సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి ఇంతకుముందే తీసుకు వెళ్ళమని త్వరలోనే గ్రామపంచాయతీ సిబ్బంది సమస్యలను రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. స్థానిక ఐటి శాఖ మంత్రి దుద్దీళ్ళ శ్రీధర్ బాబు. నేత్రములో పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని వారన్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కారోబార్లు పంప్ ఆపరేటర్లు ట్రాక్టర్ డ్రైవర్లు పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

## మానుకోట జిల్లాలో తహసీల్దారులకు స్థానచలనం

**మహబూబాబాద్ ప్రతినిధి ఏప్రిల్ 20 (జనంసాక్షి)** మహబూబాబాద్ జిల్లాలో 8 మండలాల్లో పనిచేస్తున్న తహసిల్దారులకు స్థానచలనం కలిగిస్తూ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. గార్ల తహసిల్దారుగా శారద, సీరోల్ తహసిల్దారుగా నారాయణ మూర్తి, దంతాలపల్లి తహసిల్దారుగా సునీల్ కుమార్, గూడూరు తహసిల్దారుగా చంద్రశేఖర రావు, ఇనుగుర్తి తహసీల్దారుగా రవీందర్, కురవి తహసిల్దార్‌గా శ్వేత నూతన తహసీల్దారులుగా నియమితులయ్యారు. కేసముద్రం తహసిల్దార్ దామోదర్ ను జిల్లా కలెక్టరేట్ కు బదిలీ చేసి, ఆయన స్థానంలో ఉప తహసిల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఎర్రయ్యను తహసిల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు.

## చేప పిల్లల బదులు సొసైటీలకు నగదు జమ చేయాలి
### ఎంఎంకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మునిగెల రమేష్



**స్టేషన్ ఘన్పూర్, ఏప్రిల్ 20 (జనంసాక్షి) :** ఉచిత చేప పిల్లల బదులు సొసైటీలకు నగదు జమ చేయాలని తెలంగాణ మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం (ఎంఎంకే ఎంఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి మునిగెల రమేష్ అన్నారు. డివిజన్ కేంద్రంలో ఆదివా రం తెలంగాణ మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం మండల సదస్సు స్థానిక మత్స్య సొసైటీ కార్యాలయం లో సంఘం మండల అధ్యక్షుడు చొప్పరి బిక్షపతి అధ్యక్షతన జరిగింది. ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మునిగెల రమేష్ హాజరై మాట్లాడుతూ మత్స్యకారులను ఓటు బ్యాంకు రాజకీ యాల కోసమే కొన్ని రాజకీ య పార్టీలు వాడుకుం టున్నాయని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వంమత్స్యకారులకు బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం చేసిందని మత్స్య శ్రమనుదోచుకుంటూ వారికి నిధులు కేటాయించక పోవడం సరికాదని అన్నారు. జాతీయ స్థాయిలో మత్స్యకారులకు మత్స్యశాఖ ద్వారా రుణాలు మంజూరు చేయాలని చేపల వృత్తిని నమ్ముకొని జీవిస్తున్న మత్స్యకా రులు మరణిస్తే ఇన్సూరెన్స్, ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని చేపలకు మద్దతు ధర ప్రకటించాలని డిమాం డ్ చేశారు. మత్స్యకారుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా మత్స్యకారులను ఐక్యం చేసి హక్కుల కోసం ఉద్యమి స్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి గోనెల వెంకన్న, నాయకులు తోడంగేల ఐలయ్య, అన్నెపు రాములు, పిట్టల స్వరూప, పిట్టల శ్రీనివాస్, లింగనబోయిన కవిత, చిక్కుడు కోమల, గోనెల నరసమ్మ, గోనెల చం దు, మునిగల కుమారస్వామి, పర్శ బాలకృష్ణ, కోల రాజయ్య, భాషబోయిన సంపత్, కొండ వేణు, లింగనబోయిన రాజు, పిట్టల భాస్కర్, లింగనబోయిన రాములు, యతం స్వామి పాల్గొన్నారు.

## సమాజ హితులు వాసాల వసుంధర, పీఎస్ రవీంద్ర





- **ఉపాధ్యాయ, పాత్రికేయ వృత్తిలో వారి సేవలు అజరామరం**
- **ఉద్యోగ విరమణ ఆత్మీయ సమ్మేళనంలో ప్రముఖుల అభిభాషణ**

**కరీంనగర్ (జనంసాక్షి) :** కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయ వృత్తిలో నిబద్ధతతో సేవలందించిన సీనియర్ ఉపాధ్యాయురాలు వాసాల వసుంధర పిఎస్.రవీంద్ర ఉద్యోగ విరమణ కార్యక్రమం ఘనంగా జరిగింది. కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనం ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగింది. ఈ కార్యక్రమానికి కవులు, రచయితలు, పాత్రికేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రముఖులు పెద్దఎత్తున హాజరై వారికి శుభాకాంక్షలు తెలిపారు. వసుంధర, పిఎస్ రవీంద్రలను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. వసుంధర విద్యారంగంలో చేసిన సేవలను పలువురు ప్రసంశిస్తూ, ఆమె నిబద్ధత, క్రమశిక్షణ, విద్యార్థుల పట్ల మమకారాన్ని కొనియాడారు. వసుంధర పనిచేసిన పాఠశాలల అభివృద్ధికి ఆమె చూపిన కృషిని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఆమెతో గడిపిన అనుభవాలను పంచుకుంటూ, ఆమె సూచనలతో జీవితంలో కొత్త దిశలు ఏర్పడిన సందర్భాలను ప్రస్తావించారు. విద్యార్థులు కూడా కృతజ్ఞలతో ఆమెకు అభివందనలు తెలిపారు. వసుంధర మాట్లాడుతూ, "విద్యార్థుల జీవితాల్లో మార్పు తేవడమే నిజమైన ఉపాధ్యాయుని ధర్మం" అని పేర్కొన్నారు. అలాగే పిఎస్.రవీంద్ర సీనియర్ జర్నలిస్ట్, కవి, రచయితగా ఆయన చేసిన నాలుగు దశాబ్దాల సేవలను ప్రముఖులు వేదికపై గుర్తు చేశారు. సమాజ హిత కోసం రాసిన, కథనాలు, రచనలు కవితలు ఎంతో ప్రభావితం చేశాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జ్యుడీషియరీ అకాడమీ మాజీ డైరెక్టర్ మంగారి రాజేందర్ (జింబో), ప్రముఖ కవులు రచయితలు నలిమెల భాస్కర్, వారాల ఆనంద్, అన్నవరం దేవెందర్, జనంసాక్షి ఎడిటర్ ఎంఎం రహమాన్, పలు సంస్థలకు చెందిన మీడియా ప్రతినిధులు హాజరయ్యారు.







## జిల్లా న్యాయమూర్తి సేవలు ప్రశంసనీయం

**మెదక్ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 20 (జనం సాక్షి):**

జిల్లా న్యాయమూర్తి సేవలు ప్రశంసనీయమని జిల్లా ఎస్పీ డి ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, మెదక్ పి. లక్ష్మి శారద బదిలీపై వెళ్తున్న సందర్భంగా మెదక్ జిల్లా న్యాయశాఖ ఉద్యోగులు మెదక్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కి మెదక్ పట్టణంలోని మాయా గార్డెన్స్ లో ఆత్మీయ సన్మాన సభ ఆదివారంం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. లక్ష్మీ శారద సభను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం న్యాయశాఖ ఉద్యోగులు, ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద మెదక్ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా అందించిన సేవలు, చేసిన కృషిని అభినందించారు. మెదక్ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఉదయ్ కుమార్ రెడ్డి ఈ వీడ్కోలు సభలో పాల్గొని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, మెదక్ పి. లక్ష్మీ శారద సేవలను కొనియాడారు. అనంతరం మెదక్ జిల్లా న్యాయశాఖ ఉద్యోగులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, మెదక్ పి. లక్ష్మీశారద ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్డి, మెదక్ సిరి సౌజన్య బీ స్పెషల్ మొబైల్ మెజిస్ట్రేట్, మెదక్ నాయి ప్రభాకర్, మెదక్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



## కవితకు ఘన స్వాగతం

**ఖమ్మం, ఏప్రిల్ 20 (జనం సాక్షి):** బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఉమ్మడి ఖమ్మం జిల్లా పర్యటన నిమిత్తం ఆదివారం సాయంత్రం ఖమ్మం చేరుకున్నారు..తొలుత ఎంపీ వద్దిరాజు రవిచంద్ర నివాసంలో తేనీటి విందుకు హాజరయ్యారు. బిఆర్ఎస్ శ్రేణులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. పార్టీక్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు బాణోతు మదన్‌లాల్, హరిప్రియ పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కురిసిన వర్షాలకు ఇక్కడ ఉన్నటువంటి ముగ్గురు మంత్రులు.. ఒక ఉప ముఖ్యమంత్రి.. ఇద్దరు మంత్రులు రైతుల పక్షాన మాట్లాడే పరిస్థితి లేదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఖమ్మం నగరంలోని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర నివాస గృహానికి చేరుకొని అక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వాన బడి ధాన్యం తడిసి పోయి బస్తాలలో మొలకెత్తే పరిస్థితి ఉంటే మామిడి కాయలు అంత రాలిపోయి మామిడి రైతులు ఇబ్బందులలో ఉంటే రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది రైతులు కన్నీళ్లు కారుస్తూ ఉంటే కనీసం ఒక మాట మాట్లాడి ఒక రివ్యూ పెట్టుకొని నష్టం ఎంత జరిగిందని రెవెన్యూ అధికారులతోని మాట్లాడేటటువంటి తీరిక కూడా లేనటువంటి ప్రభుత్వం ఉండడం నిజంగా మన దౌర్భాగ్యం అన్నారు. ముఖ్యమంత్రి తర్వాతి పోస్ట్ ఉప ముఖ్యమంత్రి పోస్ట్ ఎంత బాధ్యత ఉండాలి ఎంత ఆలోచన ఉండాలి కానీ ఇప్పటివరకు రైతుల్ని కనీసం పలకరించలేదని అన్నారు.

# ఏఐతో జీవితాలు ప్రభావితం

- దాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలి
- సింగరేణి సీఎండీ బలరాం




హైదరాబాద్, ఏప్రిల్ 20 (జనంసాక్షి) : అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) జీవితాలను ప్రభావితం చేస్తోందని సింగరేణి కాలరీస్ కంపెనీ సీఎండీ ఎన్. బలరాం అన్నారు. ఈ సాంకేతికత పట్ల వ్యతిరేక ధోరణి మాని దాన్ని సమర్థంగా, బాధ్యతతో వినియోగించుకోవడంపై దృష్టి పెట్టాలని సూచించారు. తెలుగు విశ్వవిద్యాలయంలో నిర్వహించిన జాతీయ ప్రజా సంబంధాల దినోత్సవాలకు బలరాం ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. "ఏఐ కొత్త విషయం కాదు. ఇది ఎప్పటి నుంచో ప్రభావం చూపుతూ ఉంది. మానవాళి మనుగడ దీనిమీద ఆధారపడి ఉందని అనడం అతిశయోక్తి కాదు" అని ఆయన చెప్పారు. తాను సారథ్యం వహిస్తున్న సింగరేణి సంస్థలో కూడా కాలాను గుణంగా టెక్నాలజీ వాడకాన్ని ప్రోత్సహి స్తున్నట్లు అయన చెప్పారు. కార్మికులు, అధికారుల సమన్వయంతో సింగరేణిలో ప్రవేశపెట్టిన వినూత్న పథకాలను ఆయన విశదీకరించారు. మహీంద్రా యూనివర్సిటీ డిజిటల్ మీడియా అండ్ కమ్యూనికేషన్స్ స్కూల్ ప్రొఫెసర్ శశిధర్ నంజుండయ్య కీలకోపన్యాసం చేస్తూ.. వృత్తినిపుణులు ఏఐని ప్రభావశీలంగా ఎలా వాడుకోవచ్చో విశదీకరించారు. సమాచార ప్రసారంలో టెక్నాలజీ పాత్ర అనూహ్యంగా పెరుగుతున్న నేపథ్యంలో నైతికతకు పెద్ద పీట వేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పీఆర్ఎస్ఐ మాజీ జాతీయ ఉపాధ్యక్షుడు కృష్ణ బాజీ తన 40 ఏళ్ల కెరీర్‌లో పీఆర్ ను శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ఎలా ప్రభావితం చేసిందో వివరించారు. ఈ సందర్భంగా పీఆర్ఎస్ఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అజిత్ పాఠక్ పంపిన సందేశాన్ని నేషనల్ కమిటీ సభ్యుడు మోహన్ రావు చదివి వినిపించారు. పీఆర్ఎస్ఐ హైదరాబాద్ ఛాప్టర్ ఛైర్మన్, ఎం ఎన్ ఆర్ యూనివర్సిటీ డైరెక్టర్ (కొలాబరేషన్స్) మరియు ప్రొఫెసర్ (కమ్యూనికేషన్స్) డాక్టర్ ఎస్ రాము మాట్లాడుతూ.. ఏ ఐ టెక్నాలజీని సమర్థంగా వినియోగించుకోవడం ఎలాగో విద్యార్థులకు బోధించాలని సూచించారు.

# కొత్తస్లాట్ విధానంతో మంచి ఫలితాలు

## రాష్ట్రమంతా అమలుకు రిజిస్ట్రేషన్ల శాఖ ప్రణాళిక



**హైదరాబాద్ (జనంసాక్షి) :** స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్న కొత్త స్లాట్ విధానం మంచి ఫలితాలను ఇస్తోందని అధికారులు అంచనాకు వచ్చారు. గతంలో దస్తావేజులు తీసుకుని, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి, కావాల్సిన ఆధారాలన్నీ పరిశీలించుకుంటే రిజిస్ట్రేషన్ ఎప్పుడనేది తెలిసేది కాదు. ఫలనా రోజున రావాలని అధికారులు చెబితే చెట్ల కిందనో, కార్యాలయం ముందో గంటలకొద్దీ వేచి చూడాల్సి వచ్చేది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన స్లాట్ విధానం ఇందుకు భిన్నం. ఆన్‌లైన్‌లో స్లాట్ నమోదు చేసుకోవాలి. అది ఇచ్చిన ప్రకారం కంప్యూటర్ కేటాయించిన సమయానికి వెళితే లావాదేవీ పూర్తవుతోంది. అందుకే వచ్చే నెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా 122 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానాన్ని అమలు చేయాలని ఆ శాఖ భావిస్తోంది.

ప్రస్తుతం పైలట్ ప్రాజెక్టు అమలవుతున్న 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సంబంధించిన లావాదేవీలను, ఎదురవుతున్న అవాంతరాలను, టెక్నికల్ అంశాలను ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు. రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల రిజిస్ట్రార్ల పరిధిలో షిఫ్ట్ విధానం అమలు చేసే ప్రణాళికలు ఉన్నాయి. ఈ మూడు జిల్లాల పరిధిలో రోజుకు సగటున 100 డాక్యుమెంట్లు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఒక సబ్ రిజిస్ట్రార్‌కు 48 స్లాట్లు కేటాయిస్తుండగా ఎక్కువ సంఖ్యలో డాక్యుమెంట్లు వచ్చే కార్యాలయాలకు అదనపు సిబ్బందిని నియమించాలని అధికారులు భావిస్తున్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఒక షిఫ్ట్, మధ్నాహ్నం రెండు నుంచి రాత్రి ఎనిమిది వరకు మరో షిఫ్ట్‌ను అమలు చేయడం ద్వారా పనిభారం తగ్గించడంతో పాటు ఎక్కువ సంఖ్యలో రిజిస్ట్రేషన్లు పూర్తి చేయొచ్చని భావిస్తున్నారు ప్రస్తుతం చంపాపేట, సరూర్‌నగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏకీకృత విధానం విజయవంతంగా నడుస్తోంది. వీటిల్లో ఎక్కడ రద్దీ తక్కువగా ఉంటే అక్కడికి స్లాట్ వేరే చోటకి బదలాయింపు ఆటోమేటిక్‌గా జరుగుతోంది. ఇదే విధానాన్ని ఫరూఖ్‌నగర్-షాద్‌నగర్, సంగారెడ్డి-పటాన్‌చెరు-అమీన్‌పూర్, కుత్బుల్లాపూర్-బాలానగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ అమలు చేయాలని ప్లాన్ వేశారు.

భూభారతి తరహాలో ఈ-స్లాట్ విధానాన్ని సైతం రాష్ట్రవ్యాప్తంగా అమలులోకి తేవాలని యోచిస్తోంది. దీని ద్వారా పారదర్శకత, జవాబుదారీతనం, సేవల్లో వేగం పెరుగుతుందని రెవెన్యూ శాఖ భావిస్తోంది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖను బలోపేతం చేయడంపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. ముందుగా మౌలిక సౌకర్యాల కల్పనను ప్రారంభించింది. రాష్ట్రంలో 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలుండగా 38 సొంత, 106 అద్దె భవనాల్లో కొనసా గుతున్నాయి. ఏటా అద్దె రూపంలోనే రూ.4.32 కోట్లు చెల్లిస్తున్నారు. ఈ క్రమంలో వీలైనంత త్వరగా సొంత భవనాలను నిర్మించాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి లక్ష్యం విధించారు. దాంతో ఇప్పటివరకు 56 కార్యాలయాలకు భూముల కేటాయింపు పూర్తయింది. శామీర్‌పేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మాణం దాదాపు పూర్తికావొచ్చింది.













































Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370